పిల్లలు పిడుగులు, సిసింద్రీలేనా..?
గ్రామాల్లో పిల్లలు
భావిపౌరులు అవ్వాలిగా!

డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు





పిల్లలు పిడుగులు, సిసింద్రీలేనా ?

గ్రామాల్లో పిల్లలు భావిపౌరులు కావాలిగా!

డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు

జీవితచరిత్రల బాలల గ్రంథాలయం

ముదునూరు

"Pillalu Pidugulu- Sisindrilena...?
Gramallo Pillalu- Bhavi pourulu Kavaliga?"
Dr. Nagulapalli Bhaskararao

పిల్లలు పిడుగులు- సిసింద్రీలేనా...?
గ్రామాల్లో పిల్లలు భావిపౌరులు కావాలిగా?

Dr. N. Bhaskararao, 98111 59588
First Publication: August, 2023

ISBN: 978 – 93 – 100- 0214-0

ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
33-22-2,చంద్రం బిల్డింగ్స్,చుట్టుగుంట, విజయవాడ- 520 004
ఫోన్: 0866 – 2430302
ఈ మెయిల్: vphpublish@gmail.com
విశాలాంధ్ర బుక్ హౌస్,
విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, తిరుపతి,
కాకినాడ, ఒంగోలు, శ్రీకాకుళం, కడప, విజయనగరం,

Price. Rs. 100/-



అంకితం ఈ కృషిలో నాతో పాటు ఉన్న జీవిత చరిత్రల గ్రంథాలయ అధ్యక్షులు

నాగులపల్లి భారతికి...

Pillalu Pidugulu...

ఈ పుస్తకమును వినటానికి పైన కనబడుతున్న QR code ను మీ ఫోన్ లో Goggle Lens తో ఫోటో తీసి, ఫోటోను search చేయండి. ఇప్పుడు మీకు ఒక లింక్ కనబడుతుంది. దాని పై కిక్ల్ చేస్తే మీకు ఈ పుస్తకం రెండు ఫైల్స్ గా కనబడతాయి. వాటిని విని, ఆనందించవచ్చు.

సమయం : 2 గంటలకు పైగా ఉంటుంది.

విషయసూచిక

I

ఉపోద్ఘాతం:

II

ఉపోద్ఘాతం

డాక్టర్ తోటకూర ప్రసాద్
తానా పూర్వాధ్యక్షులు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు
డాలస్, టెక్సాస్, అమెరికా, చరవాణి: 817-300-4747
ఇ మెయిల్: prasadthotakura@gmail. com

"**గ్రామప్రగతి** మొదలు విశ్వప్రగతి వరకు పిల్లలే సారథులు. క్రమశిక్షణ గల పిల్లలవల్లే అది సాధ్యం". సకల చరాచర జగత్తు వికాసానికి సూర్యుడు ప్రాణప్రదాత అన్నట్లు కృష్ణాజిల్లా, గ్రామస్తులు డాక్టర్ నాగులపల్లి భాస్కరరావుగారు ***గ్రామవికాసంతోనే విశ్వవికాసం*** సాధ్యమని, దానికి పిల్లలు సారథులు అనడానికి "పిల్లలు పిడుగులు – సిసింద్రీలేనా…?" అనే ఈ పుస్తకం సాక్షీభూతం.

ముదునూరు గ్రామప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు కీర్తిశేషులు నాగులపల్లి సీతారామయ్యగారి కుమారులు డా. భాస్కరరావు గారు తన అకుంఠిత దీక్షతో గ్రామాల అంధకారాన్ని పోగొట్టాలని కంకణం కట్టుకున్న భాస్కరుడు. వీరు ప్రభుత్వ సలహాదారులు. దేశ, విదేశాల్లో విద్యను ఆర్జించిన జ్ఞానశిఖామణి, బహు గ్రంథకర్త, సేవాతత్పరులు, ఎన్నో గ్రంథాలయాల స్థాపకులు. క్రమశిక్షణ గల పిల్లలు, పెద్దల చైతన్యంతో సమ సమాజ స్థాపన చేయటం సాధ్యమంటారు.

పిల్లలు పిడుగులు సిసింద్రీ లేనా...!? అనే పుస్తక శీర్షికలో ప్రశ్నార్థకం కనిపిస్తుంది. ఆ ప్రశ్నతో ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తాయి. ఈనాటి సమాజంలో పిల్లల వ్యక్తిత్వపరంగా మన ఆలోచనలు పరుగులు తీస్తాయి. స్వగ్రామం కేంద్రంగా సాగిన వారి పరిశోధనలో వెలువడిన శోధనలు మనల్ని ఎంతగానో ఆలోచింప చేస్తాయి.

గ్రామాల్లో పిల్లలు భావిపౌరులు ***'కావాలిగా!'*** అనడంలో కాస్త నైరాశ్యం, అందులోనే ***'కావాలి'*** అనే తపన, ***'ఎలా అవుతారు?'*** అనే ప్రశ్న ఉన్నాయి.

అయితేనే కదా సమాజ శ్రేయస్సు అనే మీ మాంసలో ఎన్నో తరుణో పాయాలు, వారి ఆర్తిలో ద్యోతకం అవుతాయి. పిల్లల నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు అనే కొత్త ఆలోచన రచయితలో చూసినప్పుడు మంచి విషయాలు చిన్నవారు చెప్పినా నేర్చుకోవచ్చు. '***బాలాదపి సుభాషితమ్***' అనే నానుడి గుర్తుకు వస్తుంది. ఈ పుస్తకం కేవలం పిల్లలకే కాదు, పెద్దలకు, గురువులకు సమాజానికి మొత్తంగా విశ్వమానవ కళ్యాణంలో పిల్లల భవితవ్యానికి చక్కని బోధనామృత ప్రేరణాత్మక గీత అనవచ్చు.

పిల్లల జీవితాలను సుందర సుమవనం చేయగలిగే ప్రేరణాత్మక పుస్తకం ఇది. జీవితవైఫ్యల్యాలకు స్వస్తి చెప్పగలది. చెడునుండి మనసును నియంత్రించుకుంటే మంచి వైపుకు మళ్లించగలిగేది. చేయూతనిస్తూ, మార్మిక దర్శనాన్ని ప్రతీకాత్మకంగా మలచిచెప్పేది ఈ పుస్తకం. నైరాశ్యతను పోగొట్టి, కర్తవ్యదిశగా పయనింప చేసే ఊతకర్ర. బాల్యం నుండి బాధ్యతలకు కట్టుబడి జీవితానికి సార్ధకత చేకూర్చాలని బోధించే మార్గదర్శి. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దగల చైతన్య శ్రోతస్విని స్వరూపమే ఈ పుస్తకం.

నిజానికి ప్రపంచంలో మనం ప్రతిబింబాలం. సమస్య మనం, పరిష్కారం మన నీడ. ఈ రెండింటిపైన కాంతి ప్రసరణ జరగాలి. అలాంటి కాంతిని ప్రసరింపజేసే భాస్కర కిరణం ఈ పుస్తకం.

జీవితాన్ని వెలుతురు ముద్దచేసే నీతి, నియమాల సారం. ఈ విశ్వకాంతి వేగంలో మన పదమైనా, పాదమైనా ప్రతి ఒక్కరికీ వెలుగు పంచడానికే కావాలి. నమస్కారములు. మీ ....

డాక్టర్ ప్రసాద్ తోటకూర

ముందుమాట

రెండువేల ఇరవై రెండులో దాదాపు 5 నెలలు, రెండువేల ఇరవైమూడులో 3 నెలలు మా ఊరిలో ఉన్నా. అప్పుడు జీవితచరిత్రల గ్రంథాలయాన్ని స్థాపించడమే కాక, గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహించి ఎంతోమందితో మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకోవడం నా దినచర్యగా మారింది. ముఖ్యంగా పిల్లల దగ్గర నుంచి ఎంతో నేర్చుకున్నవి, ముఖ్యంగా గ్రామాల గురించినవి, నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. మా ఊరితో నాకున్న అనుబంధంతో...

*''గ్రామాలు గర్వించేలా వుండాలిగా''మా ఊరే "ఒక ఉదాహరణ"*అనే పుస్తకంలో గ్రామాన్ని గురించి కొన్ని విషయాలు ముచ్చటించాను. ఆ తర్వాత గ్రామంలో మహిళల స్థితిగతులను గమనించి ***''మహిళల చొరవ గ్రామాలకు శ్రీరామరక్ష''*** అనే పుస్తకం వ్రాశాను.

ఇప్పుడు ఈ ***''పిల్లలు పిడుగులు, సిసింద్రీలేనా... ?''*** అనే పుస్తకాన్ని మీ ముందు ఉంచుతున్నా. ఇది నాఆవేదన, ఆందోళనలు తెలియ జేయడానికే. ఇది పిల్లల భవిష్యత్తుకి సంబంధించిందే కాదు, గ్రామ భవిష్యత్తును, రాబోయే మన తరాలను కూడా ఆలోచింప చేయడం కోసమే. అంతేనా! ఏమీ చేయలేమా? మనందరం జోక్యం చేసుకుంటే పిల్లల ప్రపంచం అయితే ఇంకా, ఇంకా బాగుంటుందని నమ్మకం. అందుకే ఈ నాలుగు మాటలు.

నాగులపల్లి భాస్కర రావు

ముదునూరు/న్యూఢిల్లీ, జూలై31, 2023

నా ఆలోచన

60 సంవత్సరాల నుంచి న్యూఢిల్లీలోనే ఉంటున్నప్పటికీ, నా మూలాలు గల గ్రామం **'ముదునూరు'** ను మరచిపోలేదు. ప్రతి యేటా ఒకసారైనా మా ఊరికివచ్చి, ఏదో ఒక సాంఘిక కార్యక్రమం చేయడంతో పిల్లల 'విద్యా విషయాలు, మారుతున్న జీవన విధానాలు, ప్రజాఆలోచనలు నన్ను ప్రభావితం చేశాయి. ఇంకా తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయని గ్రహించాను. 'భావితరం పిల్లల పెంపకం' వాళ్ల అభివృద్ధి విషయాలు నన్ను గాఢంగా ఆలోచింప చేశాయి. మిత్రులు, సన్నిహితులతో చర్చించాను.

పిల్లలు పిడుగులే కాదు, సిసింద్రీలు కూడా అని ఎప్పుడో గ్రహించాం కాని సర్దుకుపోవడం జరుగుతుంది.

అయితే ఆ భావాలను, ఆలోచనలను తల్లిదండ్రులు, అధ్యాపకులు, బడుల్లో ఎంత వరకు బలపరుస్తున్నారు అని పరిశీలిస్తే ఆందోళన తప్పదు.



చదువుతో మొదలవ్వాలి...

పిల్లల భవిష్యత్ ఎవరిది? ఇది ఎవరి బాధ్యత? తల్లిదండ్రులదా? ప్రభుత్వానిదా? అనే సందేహం కలుగుతుంది. తల్లిదండ్రులు, గురువులు, పాఠశాలలు, ప్రభుత్వ విధానాలు అని చెపుతూ ఎవరికి వారు బాధ్యత తీసుకోనట్లు కనపడుతుంది. **"సమాజం"** పట్టించుకోవడం లేదా అనిపించక పోదు. అసలుపిల్లల భవిష్యత్, దేశ భవిష్యత్ ఎట్లా ముడిపడి వున్నాయో వీలయినంత లోతుగా, దూరదృష్టితో ఆలోచించవలసి వస్తోంది.

గ్రామసీమల్లో తల్లిదండ్రులు తమ పిల్లలని గెలుపు గుర్రాలుగా ఊహించుకుంటున్నారు. తమపిల్లలు పందెంలో గెలవాలనుకోవటం, వారి జీవితాలు బంగారు బాటలు కావాలని పెద్దలు కలలు కనటం సహజం.

ప్రభుత్వాలు పిల్లలు, విద్యార్థులు తమ మీద ఆధారపడాలని పథకాలను రచిస్తున్నాయి. ఉపాధ్యాయుల్లో సమాజంలో తమ గౌరవ స్థానాలు కోల్పోయామనే ఆవేదన కనబడుతుంది. ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి, నిస్సహాయత, నిస్పృహలు కొట్టవచ్చినట్లు కనపడుతున్నాయి.

పధ్నాలుగు ఏళ్ల లోపు పిల్లల ఆలోచనలు ఇప్పుడు తల్లిదండ్రుల కన్నా చురుకుగా, ఉత్సాహంగా ఉరకలు వేస్తున్నాయి. పెద్దలు తమ ఇంట్లో తమ ముందున్న మాణిక్యాలని గుర్తించలేకపోతున్నారు. వాళ్ల ఊహలని, ఉత్సాహాన్ని ఆశలను అంచనావేయలేక నియంత్రిస్తున్నారు. అమ్మ, నాన్నలకు తెలిసినవి ***''గెలుపు'', ''ఓటమి''*** అనే రెండు మాయాజాలపు మాటలే.

పిల్లలు తమ చుట్టూ ఉన్న సమాజ సమస్యలను గూర్చి విద్యలో భాగంగా ఆలోచించ లేకపోతున్నారు. విషవలయాలను అధిగమించి ఆలోచించ లేకపోవటమే గాక ప్రవాహంలో, అదే తేలికన్నట్టు, కొట్టుకుపోతున్నారు.

మరి పిల్లలు జీవన సంగ్రామాన్ని అవగాహన చేసుకుని నిలదొక్కుకుని కొత్త కొత్త అవకాశాలను వినియోగించుకొని ముందుకు వెళ్ళగలరా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఎవరో వున్నారనో, వస్తారనో, చేస్తారనో, ఇస్తారనో అదృష్టం అనే ఆలోచనలకై ఎదురు చూస్తే ఫలితాలు ఉంటాయా? స్వయంకృషి, కలసి మెలిగే జీవన విధానం అమలు కానంత వరకూ ఇంతేనేమో?

ఈ పరిస్థితులలో పిల్లలు వాళ్ల అవకాశాలను ఎట్లా విజయవంతంగా వినియోగించుకోగలరు? వాళ్ల పరిజ్ఞానాన్నే కాక, ఆలోచనా విధానాన్ని ఎలా పెంచుకోగలరు? అలా చేయగలిగి నప్పుడే వాళ్ల భవిష్యత్‌ని కొంతవరకైనా వాళ్ల చేతుల్లోకి తీసుకోగల్గుతారు.

కనుక, ఈ పుస్తకం పిల్లలు, తల్లిదండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలకేగాక భావితరాలని గురించి ఆలోచించే ప్రతివారికీ అవసరం అని, ప్రతిస్థాయిలో ఆలోచింప చేయటానికి ముఖ్యమైనదని నమ్ముతున్నాను.

మా ఊరు ఒక ఉదాహరణ మాత్రమే...

రెండువేల ఇరవై రెండులో మూడు దఫాలుగా మా ఊరిలో దాదాపు ఐదు నెలలు వున్నా. అప్పుడు 'జీవితచరిత్రల గ్రంథాలయం' లో పిల్లలతో ఐదు కార్యక్రమాలు నిర్వహించాం. మూడింటిలో 7 మొదలు12 యేళ్ల వయసు పిల్లల డాన్స్‌లు, పాటలు, ఆటలు, చిత్రలేఖనం ప్రదర్శనలు జరిగాయి. వారు చూపించిన ప్రతిభ అమోఘం. చూస్తేగాని పిల్లల్లోని ప్రతిభను ఊహించలేము. అయితే ఇంత ఉత్సాహానికీ కారణం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సత్యప్రభ కృషి కూడా వుంది.



అమ్మలాలన అంటే తెలియాలిగా

శతకాలు (వేమన, సుమతి) చదివిన విధానం అబ్బురపరచింది. 8 యేళ్ల పల్లవి గుక్కతిప్పుకోకుండా 8 పద్యాలు చదివి వ్యాఖ్యానం చెప్పి అందరి మెప్పు పొందింది. మగ, ఆడపిల్లలను, పెద్దలను ఆకట్టుకో గలిగింది.

ఇలాంటి బాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేవారిని ఎన్ని కళల్లోనైనా ప్రతిభావంతులను చేయటం సాధ్యమని చేసి చూపారు. ఇందుకు ఉపాధ్యాయిని సత్యప్రభ గారి కృషి అభినందనీయం. అట్లాగే హైస్కూల్లో పిల్లలు రెండుసార్లు ప్రత్యేకంగా ఏకపాత్రాభియనం, డ్యాన్స్, సినిమా అనుకరణ చేశారు. ఇంకా నేర్పితే ఎంత గొప్ప కళాకారులు గ్రామగ్రామాన అవతరించగలరో తెలిసింది. ఈ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని, క్రమశిక్షణకి మారు పేరైన భవాని గారికి ప్రత్యేక ప్రశంసలు. ఆమె పిల్లల్లో సహజమైన నైపుణ్య జ్యోతులను వెలిగించారు. పిల్లల్లో ఆటపాటలు, కళలు అభివృద్ధి చేయాలని అభిలాష ఉన్నప్పటికీ గ్రామస్తుల సహకారం చాలా తక్కువగా ఉన్నది.

ఇవన్నీ చూసిన తర్వాత పిల్లలకి మరిన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు వుంటే **''మా ఊరి పిల్లలు''** ఇంకా ఎంత బాగా చేయగలరో అనిపించింది. సంగీతం, డ్యాన్సు, పాటలు పాడడం, బృందపు ఆటలు, వ్యక్తిగత విన్యాసాలు ఆటలు, ముఖ్యంగా చదరంగం, వైకుంఠపాళిలాంటి ఆటలలో పాల్గొంటే ఈ లేతమొగ్గలు వికసించి సువాసనల పుష్పాలు అవుతాయి. వీటివల్ల యువకుల ఆలోచనలు, అలవాట్లలో ఎంతో మార్పు తీసుకురావచ్చు. అయినా అలాంటి ప్రయత్నం గ్రామంలో తక్కువగా ఉంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చదువులో కూడా నూతనోత్సాహం తీసుకురావచ్చు అనే అవగాహన కలిగించాలి.

పిల్లల ప్రపంచం

మా ఊరిలో పిల్లల విద్యా వ్యవస్థలు ఐదు అని చెప్పుకోవచ్చు. 3 నుంచి 5 యేళ్ల పిల్లలు అంగన్‌వాడీ వాళ్లు. వారు ఇంటి దగ్గరలోనే వుండాలని మంచి ఉద్దేశంతో గ్రామంలో ఐదు ప్రాంతాల్లో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కదానిలో సుమారు 10 నుంచి 15 మంది దాకా పిల్లలుఉంటారు. వీటిని ఒక శిక్షితురాలైన కార్యకర్త, ఒక సహాయకురాలు ఇద్దరు నడుపుతారు. ఇద్దరికీ ప్రభుత్వం "గౌరవ వేతనం" ఇస్తుంది. అక్కడే 3 నుండి5 సంవత్సరాల పిల్లలకి పోషక ఆహారం, పాలు, గుడ్డు, రొట్టె, అన్నం తాజాగా తయారు చేసి రోజూ ఇస్తారు. అంకెలు, అక్షరాలతో ఆడుకోటానికి, పాటలకు ఏర్పాట్లు ఉన్నాయి. అలాగే ఆరు సంవత్సరాల పైబడిన పిల్లలకి ప్రాథమిక పాఠశాలలు ఐదు ప్రాంతాల్లో ఐదు ఉన్నాయి. దూసరి పాలెంలో, డొంకలో, గ్రామం మధ్యలో, హరిజనవాడలో ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తాయి.



ఒంటరితనం తెలియకూడదు

ఇంకొకటి, 8వ తరగతి వరకు ప్రైవేటు స్కూలు నడుస్తోంది. ప్రభుత్వ స్కూల్లో పిల్లలకు మంచి భోజనం. అట్లాగే గ్రంథాలయం వారికి పుస్తకాలు, బట్టలు ఉచితంగా ఇస్తారు. ప్రైవేటు స్కూల్లో అన్నిటికీ డబ్బు చెల్లించాలి. నెలవారీ జీతం కాకుండా. ఊరిలో మొదటి ప్రాథమిక స్కూలు 1937 ప్రాంతంలో క్రైస్తవ సొసైటీ వాళ్ళుపెట్టారు.

ఇంకా జిల్లా పరిషత్ హైస్కూలు ఉన్నది. ఇవి చాలకమా ఊరి నుంచి 50 మంది పైగా ఉయ్యూరు, గుడివాడ బస్సుల్లో వెళ్లి చదువుతారు. అవి ప్రైవేటు స్కూల్స్.

అయితే అన్నీ కలిపినా 600 మంది లోపే గ్రామంలో పిల్లలు వివిధ రకాలుగా విద్యను అభ్యసిస్తారు. గ్రామ హైస్కూల్లో విద్యార్థుల సంఖ్య 400 ఉండేది, ప్రస్తుతం 250 లోపే.

మా ప్రాథమిక స్కూల్లో 1970, 1980 మధ్య 250 పిల్లలు వుండేవారు. 13 మంది ఉపాధ్యాయులు, ఒక సంగీతం మాస్టర్ కూడా ఉండేవారు. ఇప్పుడు 2023 లో పట్టుమని 50 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటున్నారు. జనాభా పెరుగుతుంటే ఊరిబడుల్లో చదివే పిల్లలు తగ్గుతున్నారు. దీనిని బట్టి పరిస్థితి అర్థం కావాలి. ప్రాథమిక పాఠశాలలు నాలుగింటిలో కలిపి 100 మంది పిల్లలు కూడా లేరు. గ్రామ ప్రైవేటు స్కూల్లో గ్రామానికి చెందిన 3 నుంచి5 సంవత్సరాల వయస్సు పిల్లలు 30-40 మధ్యనే ఉన్నారు. అంటే ముందు ముందు హైస్కూల్లో పిల్లల సంఖ్య ఇంకా తగ్గిపోతుంది. కొద్ది సంవత్సరాలలో గ్రామంలో స్కూళ్లు మూతపడతయ్యా అనిపిస్తుంది.

అప్పుడు విద్య అంతా ప్రైవేటు మయం అవటమే జరుగుతుంది. ఈ ప్రమాదకర పరిస్థితి రాకుండా చేయాలంటే తీసుకోవలసిన చర్యల గురించి అందరమూ ఆలోచించ వలసిన సమయం.

పిల్లలు, అంకెలలో:

చంద్రశేఖర్ అనే యువకుడు సచివాలయంలో శ్రద్ధతో గ్రామంలో పిల్లల వ్యవహారం పర్యవేక్షించినట్లు కనబడింది. మూడు సంవత్సరాల నుంచి. ఆయన లెక్కప్రకారం కూడా గ్రామంలో 3 మొదలు 14 సంవత్సరాల వయసు పిల్లలు 500 పైగా వున్నారు.

3 నుంచి5 వయస్సు వాళ్ళు, 190,

6 నుంచి11 వయస్కులు216,

11–14 వాళ్లు 180 మంది ఉన్నారు. మరి మిగతా వాళ్లంతా ఎక్కడ చదువుతున్నారు?

అయిదు అంగన్‌వాడీల్లో కలసి 60–70 మంది

నాల్గు ఎలిమెంటరీ స్కూళ్ళల్లో కలిపి 100 లోపే

హైస్కూళ్ళల్లో గ్రామ పిల్లలు 185–195 మాత్రమే.

మా ఊరి ప్రశాంతి ప్రైవేటు స్కూల్లో 3–5 పిల్లలు దాదాపు 30 మంది,

ఇంకో 20 మంది దాకా ఉయ్యూరు ప్రైవేటు స్కూళ్లు.

మరి దాదాపు 40 మందికి పైగా 3–5 వయస్సు పిల్లలు ఎక్కడా చేరటం లేదా? చదువులోకి రావట్లేదా?

ఇంకో విషయం ఏమిటంటే ఈ 3–5 వయసులో ఏదో ఒక స్కూలుకి వెళ్లే వారు, (ముఖ్యంగా ప్రయివేటు స్కూళ్ళకి) వెళ్ళే పిల్లలు ఉదయం 7. 30–8. 30 దగ్గర నుంచి 3. 30–4. 30 దాకా ఇంటి నుంచి తీసుకువెళ్ళే

ఏ కొద్దిఫలహారం, అన్నంతో సరిపెట్టుకోవాలి. ప్రయివేటు బడుల్లో, సర్కారు బడుల్లో ఇచ్చినట్లు ఏమీ అదనంగా ఇవ్వరు. వేళకు సరైన ఆహారం లేకపోతే పిల్లల పెరుగుదల, భవిష్యత్ ఆరోగ్యం సరిగా ఉండదు. ఇది కూడా ఆలోచించదగిన విషయం. ఆరేడు యేళ్లు వచ్చేసరికి బిడ్డల శారీరక, మానసిక స్థితిగతులు బాగా ఉంచటం చాలా ముఖ్యం. ఆ విషయాన్ని తగినంతగా పట్టించుకున్నట్టు లేదు.

గ్రామంలో పిల్లలు (0–14 వయస్సు) ని గురించి పట్టించుకుంటున్న వాళ్ళు ఆశా వర్కర్సే. వీళ్ళు 0–5 వాళ్ళని 5–7 వాళ్ళని ఆ తర్వాత స్థానిక స్కూల్లో వున్న వాళ్ళని ఒక క్రమబద్ధంగా వాళ్ళకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇవ్వవలసిన మందులు ఇస్తూ ఉంటారు. పిల్లలని గురించి ఎక్కువ తెలిసిన వాళ్ళే వీళ్ళు. గ్రామంలో ఎంత మంది పిల్లలు వున్నారో తెలిసేది వీళ్ళకే. వీళ్ళ దగ్గర నుంచే వివరాలు సచివాలయంలో అందుతాయి. కాబట్టి అంగన్‌వాడీలాగా ఈ ఆశా వర్కర్సు వ్యవస్థని పటిష్టం చేయాల్సిన అవసరం వుంది. వాళ్ళకి కనీస సౌకర్యాలు లేకపోవటమే కాక జీతభత్యాలు కూడా క్రమంగా అందకపోగా, పోరాడవలసి వస్తోంది. అంటే పిల్లలను గురించి ప్రభుత్వం తీసుకునే శ్రద్ధ ఏమిటో తెలుస్తుంది.

గ్రామసచివాలయంలో పిల్లల బాగోగులు, విద్యా సౌకర్యాలు, పాఠశాల నిర్వహణ గురించి ఆలోచించటానికి, లెక్కకి మాత్రమే అన్నట్టు, ఒక ఉద్యోగి కూడా వున్నాడు.

మరి అయితే 3–11 సంవత్సరాల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలయే కాక, వ్యక్తిత్వ వికాసం జరుగుతుందా? ప్రత్యేక కృషి కనపడుతోందా?

పిల్లల గురించి తల్లిదండ్రులు సహకరించకపోతే ఎవ్వరైనా ఎంత వరకు తోడ్పడగలరు. ఇది పిల్లల భవిష్యత్‌కి సంబంధించిన ముఖ్యమైన విషయం అని గ్రామంలో గ్రహించినట్లు కనపడదు.

గ్రామ పిల్లలందరిని దృష్టిలో పెట్టుకొని జరిగే, చేసే కార్యక్రమాలు ఏమీ లేవు. ఆట, పాట అందరు పిల్లలకి చదువుతో పాటు ముఖ్యమైనా, ఎలాంటి సౌకర్యాలే కాదు ఆలోచనలు కూడా లేవు. గ్రంథాలయం ఒకప్పుడు దేవాలయం లాగా, పిల్లలకు చదువు, ఆట, కలయికకి కూడలిగా ఉండేవి. ఇప్పుడు ప్రశాంతంగా కూర్చొని ఆలోచించటానికి ఎలాంటి చోటు లేదు. అతిశయోక్తి కాదు.

విద్య ఉద్యోగానికే అనే దృష్టి పాతుకుపోతున్న తరుణం. ప్రస్తుత యువకులలో కూడా అదే ఆలోచనా తీరు వ్యాపిస్తుంది. ఈ విద్య మానేసి ఏదైనా చూసుకోవటం మెరుగు అనుకుంటున్నారు. ఈ పోకడ గమనించాలి, గ్రహించడమే కాక విద్యను మించిన శక్తి వేరే లేదు. విద్యని ఉపయోగించుకునే విధానంలోనే అసలు అభివృద్ధి ఉన్నదని పిల్లలకు, తల్లిదండ్రులకు ఉదాహరణలతో వివరించవలసిన సమయం ఇదే. సంపాదన, ఉద్యోగం కాదు సంస్కారం, సమాజం, కుటుంబ వ్యవస్థ, స్వయంగా అవకాశాలు ఎన్నో అని గ్రహించటం ప్రస్తుత ఆవశ్యకత.

ఈ లెక్కల ప్రకారం గ్రామంలో పిల్లలు అంతా స్కూల్లో చదవడం లేదని తెలుస్తోంది. లేదా మానేసేవాళ్ళ సంఖ్య పెరుగుతోంది. అమ్మఒడి స్కీము వల్ల తాత్కాలికంగా కొంత నిలబడింది. ఆ నిధుల కోసం కొంతమంది మధ్యాహ్నభోజనం కోసం, మరి కొందరు బడిలో హాజరు కోసం పిల్లల్ని పంపుతున్నారు కూడా.



పిల్లలు ఏకమైతే కొత్త ప్రపంచం

పిల్లలకు అన్వేషణ అనే భావన విద్యనుంచే రావలసింది. అన్వేషణ లోనే ఆనందం వుంది, సమాధానంలో కన్నా అనే సత్యాన్ని తెలియ జేయాలి, తెలుసుకోవాలి అంటే ప్రయత్నించడంలోనే ఉంది పునాది, పురోభివృద్ధి. తెలిసిన జ్ఞానాన్ని నలుగురికి ఉపయోగించడంలోనే వుంది అసలు ఆనందం. అందరి అభివృద్ధి.

ఆత్మపరిశీలన (introspection) ఎవరికి వాళ్లు చేసుకుంటేనే అసలైన కొత్త ఆలోచనలు అభివృద్ధికి కారణం అవుతాయి. వ్యక్తిత్వం వికసించేది, అవకాశాలని సద్వినియోగ పరచుకోగలిగేది, ప్రతిభ బయటపడేది అప్పుడే.

అంతేగాని ప్రభుత్వం ఇస్తుందనే ఆలోచనలు కాదు. ఇంకొకళ్ల మీద ఆధారపడే అలవాటు చిన్నప్పటి నుంచి మాన్పించాలి. ఎవరికి వాళ్లు వ్యక్తిగా, ఇతరులతో కలిసిమెలిసి ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. జీవితం అంతా ఎప్పుడూ మనం అనుకున్నట్టు సాగకపోవచ్చు.

ఆ సందర్భాన్ని ఉపయోగించుకోగలగడంలోనే వుంది వ్యక్తి వికాసం. అప్పుడే పిల్లలు పిడుగులు అయ్యేది.

అయితే ఎవరి పిల్లలను వాళ్ళ తల్లిదండ్రులు ప్రేమించడం లేదని, సరిగా చూడడం లేదని కాదు. పిల్లలు నల్గురు పిల్లలతో కలసి మెలసి తిరిగినప్పుడే ఆలోచనలో పరిణితి వస్తుందని అనుభవజ్ఞులు చెపుతుంటారు.



కలసి చదవటంలోంచే మార్పు

అయితే పిల్లల ఇష్టం గాని, వాళ్ళ ఆకాంక్షలను గాని పెంపొందించకపోగా పరిగణనలోకి తీసుకోవడం లేదనేదే ఆవేదన. అతిగారాబం, విద్యకు డబ్బు ఖర్చు పెట్టడంలో తల్లిదండ్రులు సందేహించడం లేదు. అయితే వాటి ఆరా తీసుకుంటున్నారా అనేది ప్రశ్న.

"మంచి విద్య" అంటే అపోహలతో కొత్త అవకాశాలని గ్రహించలేక పోతున్నారా అనేది. చదువు అంటే డబ్బు పెట్టిందే కాదు ఒక మంచి పుస్తకం, ఏదో ఒక జీవిత చరిత్ర చదవటం వల్ల కూడా ఎంతో తెలుస్తుంది అని గ్రహించకపోవడమే. అదే పిల్లల భవిష్యత్తుకి సంబంధించిన విషయం.

దేశంలో పిల్లల్లో మాదక ద్రవ్యాలు అలవాటు పెరుగుతోందని విషయమే కాక, ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి అనేది గ్రహించటం.

ఇది ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. పిల్లలు, మరీ ముఖ్యంగా యువకుల్లో క్రిమినల్ అలవాట్లు పెరిగినట్లు కూడా తెలుస్తుంది దిన పత్రికల్లో వార్తలు ఈ విషయాలను చెప్పకనే చెప్తున్నాయి. గుర్తు చేస్తున్నాయి.

జీవితం అంటే పిల్లలకి అవగాహన చిన్న వయసులోనే, పోటీ ప్రపంచంలో అడుగుపెట్టకముందే, తల్లిదండ్రులు తెలియజేసే ప్రయత్నాలు చేయాలి. శతకాలు, కథలు, ఆటలు ప్రకృతి గురించి చెప్పడం ద్వారా ఈ విషయాలని చెప్పవచ్చు. చీకటి వెలుగులు, ఎత్తుపల్లాలు లాగా ఓటమి, గెలుపులు తాత్కాలికం. ఇంకొకరితో ప్రతిసారి ప్రతి విషయంలో పోటీ వేసుకునే ధోరణి నుంచి ఎవరికి వాళ్లు వాళ్ల పరిస్థితిని గ్రహించాలి. అధిగమించటం అంటే అవతల వాళ్ళని ఓడిరచ అవసరంలా.

అందరూ కలిసి వెళ్లి మెరుగు అవటం, సంతోషంగా ఉన్నప్పుడే అసలైన సుఖశాంతులు అనేది తెలియజేయాలి. తెలుసుకోవాల్సిన విషయం.

పిల్లల్ని ఇంకొకళ్ళతో ఎప్పుడూ పోల్చడం అనేది ప్రస్తుత వ్యవస్థ అలవాటు. తల్లిదండ్రులు సాధ్యమైన అంతవరకు ఈ తీరుని తగ్గించు కోవాలి. ఎవరి ప్రతిభ వాళ్లది. ప్రతిభకు అవధులు లేవు అని గ్రహించాలి హైస్కూల్ నుంచి బయటకి రాకముందే. ఈ ప్రతిభని గుర్తించాలి.



మంచి స్కూలే, పిల్లలు తగ్గుతున్నారు

క్రిస్టియనుల చర్చా కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనటమే కాక తల్లిదండ్రులతో పాటు అన్ని కార్యక్రమాలలో పిల్లలని చదివించటం, పాడించటం చిన్నప్పటి నుంచి జరుగుతుంది. స్థానిక రేడియోలో కూడా పిల్లల గొంతు తరచూ వినబడుతుంది.

హిందూ దేవాలయాలకు పిల్లలు వెళ్లడం అరుదు, తగ్గిపోయింది. సంవత్సరంలో ఒకటి రెండుసార్లు అది తల్లిదండ్రుల కోసం దేవాలయాల్లో పిల్లలు పాల్గొనడం తప్ప ఎక్కువగా కనబడదు. అదీ ఆడపిల్లలకే వాళ్ల నగలు, సొగసు ప్రదర్శనకు పరిమితమైనట్లుగా. ఈ విషయాన్ని గ్రహించినట్లు కనపడదు. మరి ముందు ముందు పరిస్థితి ఏమిటి? అంటీ అంటనట్లు, తెలిసీతెలియనట్లుగా తయారవ్వటం, దేవాలయాల్లో పిల్లల కోసం ఏమైనా ప్రత్యేక కార్యక్రమాలు వున్నాయా చేయాలి. బొమ్మల కొలువు ఇంటికే పరిమితమైన పండగ.

గ్రామంలో ఉన్న గ్రంథాలయం ఒకప్పుడు గ్రామ చైతన్యానికి కారణం. పెద్దలు, పిల్లలు ఒకే చోట పేపరు, పుస్తకాలు చదవడం, కలిసి అప్పుడప్పుడైనా చర్చించుకోవడం, ప్రత్యేక సమావేశాలకు వేదికగా ఉండేది. అట్లాంటిది ఇప్పుడు చూస్తే నాకు గుండె ఝల్లుమంటుంది.

అక్కడికి పిల్లలు వెళ్ళటానికి అవకాశాలు లేనట్టే. అక్కడ పిల్లలని ప్రత్యేకంగా ఆకర్షించే పుస్తకాలు గానీ, పత్రికలుగానీ ఏమీ లేవు. అదీ రెండు గ్రామాలకి ఒకే లైబ్రేరియన్ ఎక్కడినుంచో వచ్చి తాళం తీస్తాడు.



ఆడటం, పాడటం లోనే వుంది భవిష్యత్

ఆ సమయానికి పిల్లలు స్కూల్లో ఉంటారు. ప్రభుత్వ కార్యాలయం సమయం గ్రంథాలయానికా?

గ్రామంలో ఎస్. బి. ఐ బ్యాంకు శాఖ ఎప్పటినుంచో ఉంది. ఐనా దాంట్లో పిల్లలను ఆకర్షించే పథకాలు, అవకాశాలు లేవు. ఒక ఖాతా ప్రారంభించాలంటే 18 సంవత్సరాల వయసు, ఆధార్ కార్డు అవసరము లేదు. అయినా పిల్లలు కనపడరు. పిల్లల అలవాటు కోసం ఒక ప్రత్యేక పథకంతో వాళ్లంతటవాళ్ళు బ్యాంకు ద్వారా దాచుకోవడం నేర్చుకోటానికి అవకాశాలు కలగ చేయాలి. ప్రత్యేక శ్రద్ధ అవసరం.

గ్రామంలో పిల్లల్లో స్నేహం, స్నేహితులు ఉన్నట్లు కనపడదు. ప్రైవేటుకు వెళ్లే వాళ్లలో ఆ సన్నిహితం తప్పితే ఏదో ఒక హాబీలో విషయం గురించి ఆలోచించటం, చర్చించటం అనేది లేనేలేదు. పిల్లలు, పెద్దలు కలిసి ఈ విషయం గురించి మాట్లాడుకుండటం కానీ, కలిసి ఏమైనా ఆట (బ్యాడ్మింటన్, చెస్ లాంటివి) ల్లో కలిసి మా ఊరిలో వినలా. ఈ మధ్య హైస్కూల్ ఆటస్థలంలో క్రికెట్ ఆడడం చూశా రోజూ సాయంత్రం. అంటే పిల్లలు, పెద్దలు మధ్య ఎంత గ్యాప్ వచ్చిందో దాని ప్రభావం పిల్లల భవిష్యత్తు మీద ఏ విధమైన మార్పో ఆలోచించండి. అందుకే పిల్లలను గురించి ఎవరు ఆలోచిస్తున్నారు. ఏదైనా చర్యలు తీసుకుంటున్నారా, అసలు వాళ్ల వికాసం గురించి ఆలోచించారా అనేది నా ప్రశ్న. ప్రయత్నం కూడా.

పిల్లల్లో స్నేహం, స్నేహితులు చాలా ముఖ్యం. చిన్ననాటి స్నేహం సంవత్సరాల తరబడి వుండే స్నేహితుల కలయిక ఆత్మ విశ్వాసాన్ని కలగజేసి, బయట ప్రపంచాన్ని అర్థం చేసుకుంటానికి మార్గం అవుతుంది.



మంచి స్కూళ్ళు ఖాళీ అవుతున్నాయా?

ఆ స్నేహసంబంధాలు కుటుంబ సంబంధాలని బలపరుస్తాయి కూడా. సమాజంలో ముఖ్య సభ్యుడిగా ఆలోచింప చేయడానికి తోడ్పడతాయి. తాత్కాలిక సమస్యలు నుంచి ఉపశమనం కూడా దొరుకుతుంది. ఒంటరితనం అనే జాడ్యాన్ని స్నేహం దగ్గరకు రానీయదు. ప్రస్తుతం సగం మంది పిల్లలు ఒంటరితనంలో మునిగారా అనిపిస్తుంది. ఇది గమనించి గ్రామాల్లో తల్లిదండ్రులు స్నేహాన్ని, స్నేహితులని పెంచే విధంగా తోడ్పడాలి. అయితే ఆ పోకడలని గమనిస్తూ వుండాలి. జీవితంలో అసంతృప్తికి ఒక కారణం. చిన్నతనంలో స్నేహాన్ని అనుభవించకపోవటం వల్లే సూసైడ్ (ఆత్మహత్య) ధోరణికి కూడా కారణం అదే కావచ్చు కూడా.

అన్ని సౌకర్యాలు వున్న హైస్కూల్లో, ప్రాథమిక స్కూల్లో అన్నీ ఉచితమే అయినా అక్కడ విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. **'నాడు-నేడు'** తర్వాత ఈ స్కూలు అద్భుతం చూడడానికి. మరి పిల్లల సంఖ్య పెరగడంలా. ఇప్పుడు 210 కి తగ్గింది. అదే సమయంలో ఏముఖ్యమైన సౌకర్యాలు లేని ప్రైవేటు కాన్వెంటులో ప్రతిదానికి ఫీజు కట్టాల్సి అవసరం అయినా అక్కడ విద్యార్థుల సంఖ్య పేరుగుతోంది. ఇప్పుడు 300 కి పైగా వుంది.

ఎల్‌కేజీ, యూకేజీల సంఖ్య కూడా ఎక్కువే ఈ కాన్వెంటులోనే ఇక్కడ క్వాలిఫైడ్ అయిన ఉపాధ్యాయులు కూడా ఇద్దరే. హైస్కూలు, ప్రాథమిక స్కూలులో కూడా 10 మంది. అనుభవం ఉన్న ఉపాధ్యాయులే అయినా ఎందుకు ఈ పరిస్థితి? అట్లాగే, గ్రామంలో వున్న అయిదు అంగన్‌వాడీల్లో కూడా సంఖ్య తగ్గుతోందే గాని పెరగటంలేదు.



కలసిమెలసినప్పుడే మెరుపులు - ఉరుములు

అయిదింటిలో రెండు గ్రామంలో వేరు వేరుచోట్ల సొంత భవనంలో ఉన్నాయి. చాలా ఆశ్చర్యకరమైన పరిస్థితి. గ్రామంలో పిల్లలు తగ్గిపోతున్నారు. ఇదే సమయంలో ఉయ్యూరు, గుడివాడ వెళ్ళే 1-4 తరగతుల వాళ్ళ సంఖ్య పెరుగు పోతోంది గాని తగ్గటం లేదు.



కొట్లో నల్లపానీయాలు

చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రశాంతి కాన్వెంటుకు వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుంది. అయినా, గ్రామంలో ఎక్కడా ఏ విధమైన సమీక్ష జరగలా. సచివాలయంలో కూడా ఏమాత్రం అవగాహన వున్నట్టు లేదు.



అంగన్‌వాడీ పర్యవేక్షణేది?

దూసరపాలెం అంగన్‌వాడి సౌకర్యాలు పూర్తిగా లేకపోయినా, బాగా నిర్వహిస్తున్నారు. అయినా అక్కడ సంఖ్య 30 నుంచి 15 లోపుకి వచ్చింది. దూసరపాలెం ఎలిమెంటరీ స్కూల్లో కూడా పిల్లల సంఖ్య సగానికి తగ్గింది గత పది సంవత్సరాలలో. ఇప్పుడు ఒకే టీచరు.

ఇన్ని మంచి సౌకర్యాలు, ఇద్దరు చూసుకోటానికి ఉన్నా తగ్గిపోతు న్నారంటే, తెలుసుకోవలసిన అవసరం లేదా? ప్రాథమిక స్కూళ్ళు మూడింటిని చక్కగా ఈ మధ్య తయారు చేశారు **'నాడు-నేడు'** క్రింద. అయినా అక్కడ తగ్గుతున్నారు పిల్లలు.

పిల్లలు తారాజువ్వలు, తారలు కూడా

పిల్లల శక్తి సామర్థ్యాలు గమనించి, వాటిని త్వరగా గ్రహించి బయటకు తీసుకురావాలి. ఏదో రూపంలో ఆటలు, పాటలు, సంగీతం, ఆడుతూ పాడుతూ ఇంట్లో బయట కూడా వున్నప్పుడే అది సాధ్యం. దీనికి సౌకర్యాలు, సహకారాలు అవసరం. శతకాలు బోధన అందరికి తెలిసిందే. కాని ఎవ్వరు ప్రయత్నిస్తున్నారు ఇప్పుడు. అవకాశాలు కలుగచేయాలి.



ఆడుతూ – పాడుతూ నేర్చుకుంటాం

స్కూల్లో చదువుకోవటం వల్ల మాత్రమే పిల్లల పెరుగుదల, మానసిక వికాసం జరగదు. వ్యక్తిత్వం బయటపడేది అట్లాంటి అవకాశాలు వున్నప్పుడే.

ఇందుకు మా ఊరిలో ఏమైనా వున్నాయా? ప్రయత్నం ఉన్నాదా? నిరూత్సాహక పరిస్థితి. ఇంట్లో గాని, బయట గాని పిల్లలు ఏమి ఆటలు గాని, పాటలు గాని వున్నట్లు లేదు.

50 సంవత్సరాల క్రిందట పరిస్థితి మెరుగు అనే విధంగా. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించినట్లుగా లేదు. తల్లిదండ్రులకు టైము లేకపోతే, బయట అవకాశాలను వినియోగించుకోనీయాలి. అడ్డు తగలకూడదు. జనవరి 2023 జీవిత చరిత్రలపై గ్రంథాలయంలో శతకాల పఠన పోటీలు జరిపితే 15 మంది పిల్లలు పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహం చూపించారు.

మూడో తరగతి శాయిదుర్గ ఆపకుండా 9 శతకాల్లో పద్యాలు వల్లించటమే గాక అర్థాలు కూడా వివరించింది. అంటే శతకాలకి కాలం చెల్లలా ఇప్పుడు కూడా వాటి ద్వారా పిల్లలని పురికొల్పి ప్రోత్సహించడం అనేది గ్రహించాలి. ఆ తర్వాత, చదివిన జీవిత చరిత్రలోని మహానుభావుల ఏకపాత్రాభినయం ఊపందుకుంది. అద్భుత ప్రదర్శనలు జరిగాయి.

తరచూ అట్లాంటి కార్యక్రమాలు జరిగితే ఇంకా ఎన్నో విశేషాలను, ప్రతిభని ప్రదర్శించవచ్చు. పిల్లలు వాళ్లంతట వాళ్ళే గాని, కుటుంబంలో గాని చింతపిక్కల ఆట, చెస్, దాళి, వైకుంఠపాళి, క్యారం లాంటివి ఎవరికి తోచినవి వీలున్నంత వరకు జరగాలి. అప్పుడే పిల్లలు పిడుగులే కాదు తారాజువ్వలై దూసుకుపోతారు. ఇదంతా 14 సంవత్సరాలలోపే జరగాలి. అదే పది సంవత్సరాల క్రిందట నా "**తారలు దిగి వచ్చిన వేళ**" అనే పుస్తకంలో విపులంగా వ్రాశా. ఇప్పుడు మా ఊరిలో ప్రయత్నిస్తున్నా.

పిల్లలని పిడుగులనో, సిసింద్రీలనో ఎప్పుడంటాం? ఎందుకంటాం? ఉరుములు, మెరుపులతో వచ్చేదేగా పిడుగు. అనుకోకుండా ఆకస్మికంగా కూడా. అట్లాగేపిల్లలు ఎప్పుడూ ఊహ, ఉచ్చారణ గ్రహింపుతో ఉనికిని వ్యక్తపరుస్తారో... అప్పుడే అంటాం. అప్పుడే వాళ్ళు ఈ ప్రపంచంలో అడుగు పెట్టినట్లు.

పిడుగుబడే ముందు అర్జునా!అర్జునా!! ఫల్గుణా!ఫల్గుణా!! అన్నట్టు, పిల్లలని గురించి, వాళ్ల వాళ్ల తల్లిదండ్రులకు తెలియజేసే ప్రక్రియ. పిల్లల్లో అట్లాంటి గ్రహింపు వచ్చినప్పుడు ఆలోచించవలసింది పెద్దవాళ్లు. ముఖ్యంగా. మంచి, చెడుల గురించి తెలియజేసే సమయం కూడా.

ఆకాశంలో మబ్బులు ఏ విధంగా వేగంగా పిడుగుపడే ముందు పరిగెడుతూ వుంటాయో అదే విధంగా పిల్లల్లో కూడా మార్పులు వస్తున్నాయనేది గ్రహించవలసిన విషయం. ఏ విధమైన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలో కూడా ఆలోచించ వలసిన సందర్భం.



పిల్లల చిరునవ్వులోంచి వచ్చేదే

అట్లాగే పిల్లలని సిసింద్రీలు అని ఎప్పుడు అంటారు. ఎందుకు? పిల్లలు ఆలోచించి సందర్భానుసారంగా పెద్దలు, విజ్ఞులు వ్యవహరించే రీతిలో ప్రవర్తించినప్పుడు అనే మాట వీడు సిసింద్రీరా.

జీవితచరిత్రల గ్రంథాలయంలో 5 వ తరగతి విద్యార్థి కార్తికేయన్ నాలుగో తరగతి పిల్లాడిని పిలిచి **"సోడాబుడ్డి"** అని గేలి చేశాడు

ఇది నన్ను ఆలోచింపజేసింది. సహజంగా అట్లా ఎందుకు పిలిచాడు? ఉద్దేశం ఏమిటి? అని తెలుసుకుంటే ఆశ్చర్యం వేసింది.

సోడాబుడ్డి అంటే కార్తికేయన్ ఉద్దేశంలో కదిలిస్తే చాలు ఎక్కువగా మాట్లాడడం, ఏది అనుకుంటే అది మాట్లాడడం బిగ్గరగా.

నా చిన్న తనంలో సోడాబుడ్డి అంటే **"గ్యాస్"** కొట్టడం. నిజం అబద్ధాలకి సంబంధం లేకుండా ఊహించటం. మాట్లాడడం. తర్వాత నాకు తెలిసింది ఏమిటంటే ఊహతో ఆలోచించి ఇతరులతో చెప్పడం. ఆ విధానం భవిష్యత్‌కి మంచి పునాది అయ్యే అవకాశం వుంది అనేది గ్రహించటం?

సిసింద్రీలు పెద్దలకు ఆనందాన్నే కాదు, గౌరవాన్ని తేగలిగినవాళ్లు. పిల్లలు పిడుగులంటే వాళ్ళు పెద్దలని మించి ఆలోచనలు చేసే వాళ్లే అని. పిల్లలు భవిష్యత్‌కి బాట. ఇది ఆశాజనకం కాదా. వ్యక్తిత్వాన్ని తెలియజేసే అలవాట్లు, ఆలోచనలు రేకెత్తించడం కాదా?

ఓటు హక్కు వచ్చేవరకూ, అంటే 18 సంవత్సరాలు వరకు, అంతా పిల్లలే. ముఖ్యంగా హైస్కూల్ చదువు పూర్తిచేసేవరకు పిల్లలే కదా. విచక్షణతో ఓటరుగా బాధ్యతతో వ్యవహరించటమే గాక, భావి పౌరులుగా భావించగలిగినపుడే పిల్లలు పిడుగులా? సిసీంద్రీలా, సోడాబుడ్డిలా? అనేది ముందస్తు చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడాలి. వ్యక్తిత్వం ఏ విధంగా ఎవరికి వాళ్లు ఏర్పరచుకుని, అభివృద్ధి చేసుకున్నప్పుడు భవిష్యత్ ఆశాజనకంగా వుంటుంది. వుండాలి. మరి అప్పుడే కదా తల్లిదండ్రులు సంతోషించాల్సింది. అయితే పిల్లల భవిష్యత్ ఇప్పుడు ఏ విధంగా తీర్చిదిద్ద గలుగుతున్నాం? ఎవ్వరు ఎంత వరకూ ముందస్తు చర్యలు, జాగ్రత్తల పేరుతో తీసుకోగలుగుతున్నారు.

తల్లిదండ్రులు, బంధువులు, బంధుత్వం, బాంధవ్యాలు విలువలు ఎంతవరకూ కాపాడుతున్నారు? ఎట్లాంటి విలువలని పిల్లలకి కట్టబెడు తున్నారు అనేది ఎంత వరకు గ్రహించుతున్నాం? పిల్లలని ఏ విధంగా తీర్చిదిద్దుతారు?

అప్పుడే పిల్లల వ్యక్తిత్వానికి కొన్ని లక్షణాలు ఏర్పడతాయి. అవి కట్టు, బొట్టు రూపు రేఖలేగాక ఆలోచనా విలువలు, ప్రవర్తనా నియమాలను తెలియజేసే ఆలోచన, ప్రవర్తన అలవడినప్పుడే భావాలు, వాటిని వ్యక్తపరిచే విధానాలు కూడా. ఇవి పాఠశాల చదువు ద్వారానే గాక, ముఖ్యంగా తల్లిదండ్రులు, కుటుంబ వ్యవస్థ మీద కూడా ఆధారపడతాయి. ఎక్కువగా ఈ సంబంధాలకు సంఘీభావం సరిగ్గా ఉండటంకూడా ఒక కారణం. దెబ్బతిన్న మనోభావాలు, మానసిక స్థితిగతులు, ఒడుదుడుకులు, భవిష్యత్ మీద భరోసా లేకపోవడానికి, పిల్లల ఆత్మహత్యా ఆలోచనలు రావడానికి కారణం. మూలాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో గ్రహించామా!

ఏది ఏమైనా పిల్లలను **"గంగిరెద్దు", "గానుగఎద్దు"** వ్యవహారం లాగా తయారు చేయకూడదు కదా?పిల్లలకోసం ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపడితే ఫలితాలుతెలుస్తాయి.

పిల్లల పెరుగుదల, లోపాలకు భవిష్యత్‌లో బాధ్యతారహిత ప్రవర్తనకు బాధ్యులు ఎవరు? దానికి తల్లిదండ్రుల తీరుని, దృష్టిని ఏ విధంగా చూడవచ్చు?

అతిప్రేమా, గారాబమా, డబ్బుతో ఆ బాధ్యతని స్కూలుకో, ఉపాధ్యాయులకో ఇచ్చాంగదా అనుకోవటం వల్లనా? తల్లిదండ్రులు సంపాదనలో మునిగిపోవటం వల్లనా? తల్లులే సంసారాన్ని చక్కదిద్దు కుంటారనా?

ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుంది గదా (వేరు వేరు పథకాల ద్వారా) అనే నిర్లక్ష్యమా? తల్లిదండ్రులు దేశంలో, ప్రపంచంలో వచ్చిన, వస్తున్న మార్పులను గ్రహించ లేకపోతున్నారా అని తెలుసుకోవాలి.

విచిత్రం ఏమిటంటే చాలామంది తండ్రులకు వాళ్ళ పిల్లల చదువు సంధ్యల మీద కనీస అవగాహన వున్నట్టే లేదు. ప్రయివేటు టీచర్ దగ్గర, ప్రయివేటు స్కూల్లోనో చదివించినంత మాత్రాన బాధ్యత వాళ్లదే కాదు గదా?

అసలు దేశంలో వేగంగా వస్తున్న మార్పులు, అవకాశాలను గురించి *విద్య ఒక్కటే పిల్లలను బాధ్యతగల పౌరులుగానో, స్వతంత్ర ఆలోచనా పరులుగానో చేయదు* అని ఎన్నో పరిశోధనలు తెలియజేశాయి. తరగతి గది విద్య ఒక్కటే భవిష్యత్‌ని తీర్చిదిద్దడానికి చాలదని పెద్దలు గ్రహించినట్లు లేదు. మంచి మార్కులతో పాస్ అయినంత మాత్రాన జీవితంలో మంచి అవకాశాలు వస్తాయి అనే రోజులా ఇవి?

పిల్లలు బజారున పడ్డారా?

కొంతమంది పిల్లలు స్థోమత, అవసరాలకు సంబంధం లేకుండా ఉన్న ఒకటో, రెండో, ఐదు రూపాయలు పట్టుకొని అయిపోయేదాకా ఏదో ఒకటి కొని తినాల్సిందే. ఆ రోజుకి ఆ రోజు తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులు దాచుకోవచ్చు అని, పుస్తకము కొన్నవాళ్లు నేర్చుకోవడానికి వుపయోగించ వచ్చుననే ధ్యాస లేదు. దీనిని తల్లిదండ్రులు తెలియజేయాలి.

ఇట్లా కొని తినడం వల్ల ఆ తర్వాత వచ్చే అలవాట్ల అనారోగ్య ప్రభావం గురించి వివరించేవాళ్లు లేరా? ఉపాధ్యాయులు ప్రయత్నించి విసిగి పోయారా?

గ్రామంలో ఎవ్వరైనా స్కూలు దగ్గర షాపులలో ఇలాంటి తినుబండారాలు, చిరుతిండ్లు ఇతర అనారోగ్యాన్ని కలిగించేవి ప్రదర్శిస్తున్నారా? అమ్ముతున్నారా? అని తెలుసుకొని అట్లాంటివి అమ్మకుండా నియంత్రణకు ఎవరూ ప్రయత్నిస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. అసలు ''మందు బిళ్ళలు''పిల్లల్ని ఆకర్షించి అమ్ముతుంటే ఆశ్చర్యపడాల్సిన విషయం కాదా!



బజారు తిళ్ళకి అలవాటా...

అట్లాగే ఫోన్ కొంతమంది స్కూల్ కి కూడా మొబైల్ తీసుకు వెళుతుంటే అడిగేవాళ్లు లేరు. కొంతమంది పిల్లలు పొద్దున 6 గంటల నుంచి ప్రైవేటుకి, 9:30 నుంచి స్కూల్‌కి, మళ్లీ సాయంత్రం 6:00 నుంచి 8 గంటల వరకు ట్యూషనుకు వెళ్లడం చూశాను. ఇది చూస్తే తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల్ని సాధ్యమైనంత వరకు ఇంటి బయట ఉండేటట్టుగా చూస్తున్నారా అని అనిపిస్తుంది. కొంతమంది తల్లిదండ్రులు ఇద్దరూ పనులకు వెళ్ళటం వల్ల కూడా ఈ పరిస్థితి వచ్చిందనిపిస్తోంది.

ఖర్చు మీద అదుపు, హద్దు అవసరాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పాలి. ఉన్న దానిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలియచేసే విధానాలు అనేకం. స్కూల్లో వుండగానే తెలియాల్సిన విషయాలు.

పిల్లలను ప్రోత్సహించటం అంటే!

మా ఊరులో పిల్లలని ప్రొత్సహించిన సందర్భాలు, కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా? యువకులకు ఉపయోగపడే కార్యక్రమాలు అరుదు... ఆటలు, పాటలు, వినోదం, విజ్ఞానం దేనిలోనైనా, వ్యాపార జ్ఞానం, చొరవ తీసుకోవటం, మరేదైనా ఘనత సాధించడానికి గాని బాలలకు, యువకులకు ప్రోత్సాహం అంటే ఏమిటో తెలియదు.

తల్లిదండ్రులు ఇంటి దగ్గర ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తున్నట్టు లేదు. వాళ్ళకి తెలిసిందల్లా స్కూలుకి వెళ్ళే ముందు రూపాయో, రెండో, ఐదో జేబు ఖర్చులకు ఇవ్వటం వరకే.

అంతటితో తమ బాధ్యత తీరింది అనుకోవచ్చు. ఆ డబ్బుతో తమ పిల్లలుఏమి చేస్తున్నారో పట్టించు కోవటం లేదు. ఇది ప్రోత్సాహమా? కానే కాదు.

వ్యక్తిత్వాన్ని ప్రోత్సహించి గుర్తించే కార్యక్రమాలు, పిల్లల శక్తి సామర్థ్యాలను ప్రోత్సహించడం, ఇంట్లో, స్కూలులోనే కాక, అదనంగా బయట నుంచి కూడా అందటం అవసరం, ముఖ్యం. జీవిత చరిత్రల గ్రంథాలయ కార్యక్రమాలు ఏదో ఒక రంగంలో పిల్లలకి ప్రోత్సాహం ఇవ్వటం మొదలైన దగ్గరి నుంచి మా ఊరి పిల్లల్లో నూతిలో నీరు ఊరి ఉబికినట్లు, కొంతమంది పిల్లల్లో కొత్త ఉత్సాహం, ఉత్తేజం కనపడటం అతిశయోక్తికాదు. ఇది చదువుల్లో కూడా కనపడుతోంది. కాని దీనిని తల్లిదండ్రులు గ్రహించినట్లు లేదు.

గ్రామం పిల్లలది కూడా... కాదా?

ముదునూరులోనేకాదు, చాలా గ్రామాల్లో పిల్లలు ఏ విషయంలోనైనా నిర్ణయాలు తీసుకుంటున్నారా? వాళ్ళ కష్టసుఖాలను దృష్టిలో పెట్టుకుని ఏమైనా జరుగుతున్నాయా? ఇది ఒక అసందర్భ ప్రశ్నగా అనిపించవచ్చు.



నకిలీ నోట్లు ఎందుకమ్ముతారు

కాని, ఆలోచించండి. నిర్ణయాలు ఏవైనా వాళ్ళ అభివృద్ధి, వ్యక్తిత్వాన్ని పెంచే ప్రత్యేక విషయాలు జరుగుతున్నాయా? అట్లాగే, వాళ్ళని తప్పుడు దోవలో పెట్టే కార్యకలాపాలనైనా ఆపగల్గుతున్నారా? మచ్చుకైనా!

ఈ మధ్య జరిగిన ఒక సంఘటనను ఉదాహరణగా చెపుతాను. గ్రామంలో కొన్ని దుకాణాల్లో ఒక రూపాయికి పది (నకిలీ) నోట్లు (చూస్తే చెప్పటం కష్టం కూడా) ఇస్తుంటే స్కూల్ పిల్లలు ఎగబడి మరీ ఈ నోట్లు కొని ఆనందించారు. ఒకళ్ళకి ఒకళ్ళు చూపించుకుంటూ. అయినా తల్లిదండ్రులు గాని, గ్రామ పెద్దలు గాని పట్టించుకున్నట్టు కనపడలేదు.

వీటి ప్రభావం ఎంత ఘోరమైనదో తెలియకా? అలాగే చూయింగ్ గమ్ రూపాయి, రెండు రూపాయలు పెట్టి తినే అలవాటు పడ్డారనే విషయం తల్లిదండ్రులకు తెలియదా?

ఎన్నికల్లో పిల్లలని నాయకులు వాళ్ళ వాళ్ళ ప్రచారానికి వాడుకుంటారు. అయితే వాళ్ళు పిల్లల అభిలాష, ఆనందం, వికాసం కోసం ఏదైనా చేశారా? ప్రశ్నించుకోండి. కనీసం పిల్లల పార్కు, ఆడుకోవడానికి ఆటస్థలం కూడా ఎన్నో సంవత్సరాలుగా సమకూర్చు కోలేకపోయారంటే పిల్లలంటే ఎంత అజాగ్రత్తో తెలుస్తుంది. పంచాయతీ, సచివాలయం, ఏ ఇతర సంస్థలుగాని, కనీసం వంద రూపాయలు పిల్లల అభివృద్ధి కార్యక్రమాల మీద ఎన్నో సంవత్సరాలుగా ఖర్చుపెట్టింది లేదంటే అతిశయోక్తికాదు.

భారత దేశజనాభాలో పిల్లల శాతం 44%
సాలీనా బడ్జెట్‌లో పిల్లల అభివృద్ధికి ఖర్చు 2 శాతం కంటే తక్కువ.

పిల్లల విద్య, ఆరోగ్య విషయంలో మన రాజ్యాంగం ఆర్టికల్ 21, 28, 32 లలో అద్భుతంగా ఆలోచించి గమ్యాన్ని కూడా సూచించింది. అయితే ఆ లక్ష్యాల ఏది కూడా 75 సంవత్సరాల కాలంలో మన ప్రభుత్వాలు చేరుకోలేకపోయాయి.

గత 40 సంవత్సరాలలో ఎన్నో శాసనాలు, సంస్థలను కూడా స్థాపించారు. ఎన్నో ప్రణాళికలు కూడా ప్రవేశపెట్టారు.

అయినా ఇప్పటి పరిస్థితి ఏమిటి? స్కూలు మానేసే వాళ్ళ సంఖ్య పెరుగుతోందే గాని తగ్గటం లేదు. 8, 10 తరగతుల తర్వాత విలువలు లేనిది విద్య మిగిలిపోయింది. దీన్నిబట్టి పరిస్థితి ఎంత విషమంగా వుందో అర్థంచేసుకోవచ్చు. ఇప్పటికీమా ఊరిలో 20 శాతం పైగా పెద్దలు చదవలేని వాళ్ళే అంటే అర్థం ఏమిటి?

ప్రధానోపాధ్యాయులు ఇతర పనుల్లో మునిగి తేలుతున్నారు. ఉపాధ్యాయుల జీతాలు పెంచినా అసంతృప్తితో ఉన్నారు. విద్య రూపురేఖలే మారిపోయాయి. మార్కులు, గ్రేడు, పాస్ కావటం వరకే, ఆ తర్వాత ఉద్యోగం కొరకే అన్నట్టు వుంది. ప్రాథమిక విద్యావిధానంతో పాటు బోధన విషయంలో కూడా పరిస్థితి అంతే. ఎన్నో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయకపోవడం.

‘కొంటేనే తెలుస్తుంది విద్యవిలువ’ అనిపించే రీతిగా తయారైంది. పరిస్థితి తీవ్రత ఏమిటో గ్రామంలో తల్లిదండ్రులకు, పెద్దలకు అవగాహన వుందా? మరి ఉంటే ఎందుకు పట్టనట్లు ప్రవర్తిస్తున్నారు?

కుటుంబంలో కూడా ఎవరికి వారు నాకేంటి అనే స్థితి కనబడుతోంది. రైతాంగం పడుతున్న అవస్థలు, ఆర్థికంగా కుంగిపోవడం ఈ పరిస్థితులకు కారణమా?

కనీసం పాఠశాల విద్యని కాపాడుకోలేమా? మా ఊరి ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత పిల్లల సంఖ్య 35. గత పదేళ్లలో 100కు, 70కి దిగజారింది. ఎందుకిలా జరుగుతుంది? ఎందుకని ఏడాదికీ, ఏడాదికీ అంత తేడా. ఇప్పుడున్న 35వచ్చే యేళ్లలో మరెంత తగ్గుతుందో చూద్దాం.

పిల్లల ఆరోగ్య విషయంలో ఎంతో ప్రగతి సాధించాం అనడంలో సందేహం లేదు. ఎన్నో వ్యాధులను అడ్డుకోగలిగాము.

ఎన్నో ప్రణాళికలు మంచి ఆచరణలతో ఇది సాధ్యపడింది. ఐతే పిల్లల తిండి అలవాట్లు ఆందోళనకరంగా ఉంటున్నాయి. బ్రష్, పేస్టుతో పండ్లు తోముకోవటానికి చిన్న పిల్లల నుంచి 70 సం.ల పైబడిన వారు కూడా అలవాటు పడ్డారు. (ఇంటి ముందు వేపచెట్టు ఉన్నవాళ్లు కూడా), అది సంపదకి గుర్తు అన్నట్టు బజారు తిండ్ల అలవాటు సహజమైపోయింది.

మా ఊరి మధ్య బజారుకి వెళ్ళగానే 15- 25 వయస్సుగల ఒకళ్లిద్దరు యువకులు ఎవరైనా రూపాయి ఇస్తారా? అని తిరుగుతూ ఉంటారు. మందుబిళ్ళలు కొనటానికి అనుకుంటా. ఇంటి బయట ఏదో ఒక ఆట ఆడే పిల్లలు, యువకులు లేరుఇప్పుడు. అందువల్ల పిల్లల్లో ఒంటరితనంతో నిస్పృహ పెరుగుతోంది. ఈ సమస్యను పట్టించుకోవాలి. నివారణ చర్యలు ఆలోచించాలి, ఆచరణలో పెట్టాలి. అదే పిల్లల భవిష్యత్తుకు బాట.

మా ఊరి స్కూల్లో ప్రవేశించిన తర్వాత మానేసే వాళ్ళ సంఖ్య 100 దాకా ఉంటుంది. వీళ్ళకోసం గ్రామంలో ఏమైనా కార్యక్రమాలు, సౌకర్యాలు వున్నాయా? కనీసం అప్పుడప్పుడు శిబిరంగానీ, కౌన్సెలింగ్ కానీ జరిగినట్లు కూడా లేదు.

పిల్లలు జీవిత విలువలను ఎక్కడ నుంచి ఎప్పుడు తెలుసుకుంటారు? 5-6 సంవత్సరాల వరకు ఇంట్లోనే మొదలవ్వాలి గదా? 7, 12 మధ్యలో ఇంటితో పాటు స్కూల్లో కూడా బయట విషయాలు చూడడం, వినటం, చదవటం మొదలైన మార్పులు కూడా మొదలవుతాయి. ఇవి సొంత ఆలోచనలు, అనుభవాలు, ఊహలతో ముడిపడిన వ్యవహారాలని, గ్రహించాల్సిన విషయం.

పిల్లల ప్రణాళిక

ప్రతి గ్రామానికీ పిల్లల అభివృద్ధి ప్రణాళిక అవసరం. 200, 300 మంది పిల్లలు (3 నుంచి19 సంవత్సరాల వయస్సు) ను దృష్టిలో పెట్టుకుని ఒక కనీస ప్రణాళిక రూపొందించాలి. 200 మంది దాకా ఆరు సంవత్సరాలలోపు పిల్లలు, 100 మంది దాకా 14 సంవత్సరాల పైబడిన వాళ్ళు. వీళ్ళలో కనీసం సగం మందిని గుర్తించి ప్రత్యేక సదుపాయాలు, సలహాలను ఆలోచించి, కార్యక్రమాలను చేయాలి. మా ఊరి ముఖ్యులు అశోక, శ్రీనివాసరావు, కొల్లి రాజారావు, శేఖర్, యాదవ్, కలపాల విద్యాసాగర్, సత్యనారాయణ మాష్టరు గారు, సంధ్య డానియేల్ లాంటి వాళ్ళతో ఈ ప్రణాళిక అమలు పరచవచ్చు. పాఠశాల కార్యక్రమాలకు రాజకీయపార్టీలు, కులాల కుంపట్లతో ముడిపెట్టకూడదు, వాటికి అతీతంగా జరగాలి.



ఈ వయస్సు ఎండమావి కాకూడదు

పిల్లలు, యువకులదే కదా భవిష్యత్! మరి ఆ భవిష్యత్‌ని గురించి అంతా ఆలోచించాలి కదా! ఎట్లా వుండాలి? బడిపిల్లల ఆలోచనలని పరిగణనలోకి తీసుకోవాలి. ఏఏ సౌకర్యాలు వుండాలి? గ్రామంలోని సంస్థలు, పాఠశాలలు, పంచాయతీ, సచివాలయం, కోఆపరేటివ్ సొసైటీ (సహకార సంఘం) లాంటి సంస్థలు పిల్లలు, యువకుల కోసం ఏమి చేయాలో ఆలోచించాలి గదా? కొంతమంది చొరవ తీసుకుని గ్రామానికి పిల్లలు, యువకుల ప్రణాళికలే కాక వచ్చే పది సంవత్సరాల్లో గ్రామం ఎట్లా వుండాలో ఆలోచించాలి గదా?

జీవిత సత్యాలు తెలియొద్దా?

పిల్లలకి జీవితం, చావుబతుకులంటే అవగాహన 12 యేళ్లకైనా రావాలిగా! ఎట్లా వస్తుంది? చూడటం, చదవటం, అనుభవం వల్ల, తల్లిదండ్రుల ద్వారా, అమ్మమ్మ కథల ద్వారా వచ్చినప్పుడే అవగాహన పెరుగుతుంది

బుద్ధుడు ఎప్పుడు ఎట్లా అయ్యాడో పాఠాల్లో చదివి వుంటారు కదా. మానవుల కష్టాలు తెలియకుండా రాజమందిరంలో పెంచబడిన గౌతమునికి – శవాన్ని దహనానికి తీసుకువెళ్లటం, రోగాలు, ముసలితనం చూసిన తర్వాత లోకజ్ఞానం కలిగింది. మనిషికి కష్టాలు సహజం అని గ్రహించాడు. చూసినప్పుడే గదా ఆలోచనలు చిన్న యువరాజు మనస్సులో రేకెత్తాయి! మరి మనం పిల్లలు అట్లాంటి వాటిని చూడకుండా ఉంచుతున్నాం. చుట్టుపక్కల బంధువులు చనిపోయినప్పుడు కూడా పిల్లలను దూరంగా పెడతారు. మా కుటుంబంలో మంగళగిరి మామ్మ అనే పెద్దావిడ చనిపోతే ఎంతోమంది పొరుగు ఊళ్లనుంచి కూడా వచ్చారు. కాని పక్కఇళ్లలోని పిల్లలు ఒకళ్ళు కూడా కనపడలేదు. ఆ మామ్మ చేసిన ఎన్నో మంచిపనులు పిల్లలు కూడా తెలుసుకునే అవకాశం కదా? ఇంకా పిల్లలను అట్లాంటి జీవిత సత్యాలు, మరణం వంటివి తెలియనీయకుండా దూరం పెట్టాలని ప్రయత్నిస్తున్నాం. అంటే తెలియగూడదనేగా! అదే విధంగా శరీరంలో వచ్చే మార్పులు గురించి ఆడపిల్లలు, మగపిల్లల విషయంలో కలిసి మెలిగే విషయంలో కూడా.

నిరుత్సాహ ముఖాలా?

పిల్లల ముఖకవళికలను కొన్ని రోజుల పాటు గమనిస్తే ఒక విధమైన నిరుత్సాహం కనపడుతుంది, ఉత్సాహం కనపడదు. ఇది స్కూలులో మార్కులకు సంబంధించింది కాదు. భవిష్యత్ మీద నమ్మకం కనపడక పోవటం. కొంత భయం, అపనమ్మకం కూడా కారణాలు. పిల్లలకు ధైర్యం చెప్పి కొత్త ఆలోచనలని, మెచ్చుకునే వాళ్ళు లేకపోగా, విమర్శించే వాళ్ళే ఎక్కువ. ప్రోత్సాహం ఇంటిదగ్గరే కాక, స్కూల్లో కూడా లేకపోవటం చూస్తున్నాం.

దేశంలో ఇంతమంది పిల్లల ఆత్మహత్యలు, ఇల్లు వదిలి పారిపోవటం ఎందుకు జరుగుతున్నాయి? ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏటేటా ఈ సంఖ్య పెరుగుతుంది గాని తగ్గటం లేదు. వారితో చదువుతున్న వాళ్ళ శాతం ఎక్కువ. మరి ఐ.ఐ.టి. లో వున్న మేధావులైన విద్యార్థులు కూడా ఎందుకు నిరుత్సాహానికి లోనౌతున్నారు? 2022-23 సంవత్సరంలో ఐ.ఐ.టి., మద్రాసు, ముంబైలలో కూడా ఈ ఆత్మహత్యల సంఖ్య తగ్గలేదు. దేశ రాజధాని ఢిల్లీలో రోజుకి సగటున 20 మంది పిల్లలు కనపడకుండా పోతున్నారు.

ఎన్నో ప్రణాళికలు, పథకాలు అమలు జరిగినప్పటికీ ఎందుకని మన గ్రామాల్లో, దేశంలో సగం మంది చిన్నపిల్లలు తక్కువ బరువు వున్నారు.

వాళ్ళ పెరుగుదల సరిగా, వారి వయసుకు తగినంతగా లేదు, అని గణాంక వివరాలను బట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022 లో తెలియ పరచింది.

ఈ పథకాలు ప్రభుత్వాలు తగినంతగా నిధులు ఇవ్వటం లేదని, బడ్జెట్‌లో చూపించినా ఖర్చు పెట్టడం లేదని నివేదికలు చెపుతున్నాయి. మన దేశ జనాభాలో నూటికి 44 శాతం పిల్లలే ఉన్నారు. అయినా వీరి కోసం బడ్జెట్‌లో వీరికి రెండు శాతం డబ్బు కూడా ఖర్చుపెట్టడం లేదు.

మొన్న (2023) విడుదలయిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత 66 శాతమే. పెద్దగా పెరిగినట్లు లేదు. ముఖ్యంగా బాలుర విషయంలో. బాలికల కన్నా ఎంతో తక్కువ ఉత్తీర్ణతేగాక, వ్యత్యాసం ఇంకా పెరుగుతోంది. ముందు ముందు దీని ప్రభావం ఊహించాలి, గ్రహించాలి.

బాలురు, యువకుల్లో తాగుడు, తిరుగుబోతుతనం, మాదకద్రవ్యాల బానిసలు కావటం కూడా కారణాలు. క్రమశిక్షణ నేర్పడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ఉన్నది. ఆటపాటల్లో చురుకుగా ముందున్న వాళ్లే చదువులో కూడా ముందుంటారనే విషయాన్ని గ్రహించలేక పోతున్నాం. యువకుల్లో దురలవాట్లు, కుటుంబ వ్యవస్థ అనర్థాలు పెరగటం కూడా కారణమే. రోజూ వార్తాపత్రికల్లో ఎన్నో అత్యాచారాల గురించి చదువుతూ వుంటాం. అయినా తల్లిదండ్రులు నిస్సహాయ స్థితిలోకి జారుకున్నారా అనిపిస్తుంది.

ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు వచ్చిన 12 గంటల్లోనే ఆశించిన మార్కులు రాలేదని మనస్తాపానికి గురై కొంతమంది విద్యార్థులు బలవన్మరణానికి గురయ్యారు. మొన్న ఏప్రిల్‌లో తొమ్మిదిమంది ఆత్మ హత్యలకు గురైనవారి ఫొటోలు **ఈనాడు**లో పేర్లతో సహా ప్రచురించారు. ఒకళ్లు చెరువులో దూకితే, ఇంకొకళ్లు పురుగుల మందు తాగి, ఇంకొకళ్లు ఇంట్లోనే ఉరివేసుకుని, రైలు కిందపడి ఇట్లా ఆత్మహత్యలకి గురయ్యారంటే,

జీవితం అంటే వాళ్ళ దృక్పథం ఏమిటి? వాళ్ళకి చిన్నప్పటి నుంచి మార్కులు తక్కువ వచ్చినా అది మంచి అవకాశాలకి ఆటంకం కాదు అనే విషయం తెలియకపోవటమే కాదా?

బంధుత్వం, బాధ్యతతో ముడిపడి ఉంటుందని సుప్రీంకోర్టు ఈ మధ్య వచ్చిన తీర్పులో చెప్పింది. ఇదే తీర్పు ఆడపిల్లల కుటుంబ బాధ్యతలను, బాంధవ్యాలను గుర్తు చేస్తోంది.

12 నుంచి 14 సంవత్సరాలురాగానే ఎగిరి పోవాలనుకునే పిల్లల్లో కొంత ఆలోచనని గుర్తుచేస్తుంది. తల్లిదండ్రులతో గౌరవంగా జీవించడమే కాక భవిష్యత్‌ని గురించి జాగ్రత్తలు తీసుకునే విధంగా ఉండాలి. ఈ తీర్పు ఆడపిల్లల్లో తల్లిదండ్రులను గౌరవదృష్టితో చూడడం, కుటుంబ ఆస్తిలో హక్కుగానే కాక బాధ్యతగా కూడా చూడాలనేదే ఈ తీర్పు ఉద్దేశం.

తల్లిదండ్రులు పిల్లలని చిన్నప్పటి నుంచి పెంచే విధానం, చెప్పే విధానంలో పిల్లలు చదివేవిషయాల నుంచి మంచిచెడులు, బాధ్యత, బాంధవ్య హక్కుల గురించి తెలుసుకునే అవకాశాలు కలుగజేయాలి. ఈ తీర్పు పిల్లల్లో చిన్నప్పటి నుంచి అవగాహన వుండాలని గుర్తు చేస్తుంది. అట్లాగే ప్రకృతి, సంరక్షణ, బాంధవ్యాల గురించి కూడా పిల్లల్లో అవగాహన కలగజేయాలి.

కుటుంబం సత్సంబంధాలు

పిల్లల పెరుగుదల, పెంపకంలో తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబ సభ్యులు, అక్క చెల్లెళ్లే కాక అమ్మమ్మ, నాయనమ్మ, తాతలు కూడా తోడ్పడతారు. అందుకే అందరూ ఉన్నవాళ్లు అదృష్టవంతులు అంటారు. వాళ్లతో కలిసి మెలగటం, మాట్లాడటం వాళ్ళ పాటలు, కథలు ఎంత వింటే ఆ పిల్లల మానసిక వికాసం వేగంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో, బంధువులతో కనీస పరిచయాలు కూడా అంతే ముఖ్యం. అట్లాగే బంధువుల గ్రామాలు, ఊళ్లు అప్పుడప్పుడు వెళ్లడం ముఖ్యంగా వాళ్ళంతట వాళ్ళు వెళ్లడం ఇంకా మంచిది. అవన్నీ కూడా ఆలోచనలను రేకెత్తించడానికి, ఊహా పరిజ్ఞానాన్ని పెంచడానికి ఎంతగానో ఉపయోగ పడతాయి. ఈ విషయం పెద్దయిన తర్వాత గాని గ్రహించలేరు.



కలసిమెలసినప్పుడే
మెరుపులు - ఉరుములు

పిల్లల చేత ఇంట్లో ఏదో ఒక పని చిన్నదో, పెద్దదో చేయించాలి. బాధ్యతలు బాధ్యులుగా చేసినపుడే మొదలు అవుతాయి. మరీ ముఖ్యంగా గారాబం, అతిగారాబానికి తేడా తల్లిదండ్రులు గ్రహించాలి. నిగ్రహం పాటించాలి. స్కూలుకు వెళ్లే పిల్లలకు డబ్బు ఇస్తే ఎందుకు ఏ ఉద్దేశంతో ఇస్తున్నారో గుర్తుంచుకోవాలి. అతి గారాబమూ పిల్లలకి హాని కలిగిస్తుంది.

నలుగురితో కలిసిమెలిసి మెలిగే విధానాలు, అలవాట్లు, విభేదాలను వాళ్లంతట వాళ్ళే సరిదిద్దుకునే విధంగా పిల్లలు చిన్నప్పటి నుంచీ తెలుసుకోవాలి.

చాలామంది పిల్లల్లో అభద్రత, భయం, అపనమ్మకం ఇటీవల పెరుగుతున్నాయి. ఆత్మవిశ్వాసం, నమ్మకం పెరిగేలా పిల్లల పెంపకం ఉండాలి. తల్లిదండ్రులు ఈ విషయాన్ని, ముఖ్యంగా ఆడపిల్లల విషయాలు తెలుసుకుంటూ ఉండాలి, గ్రహిస్తూ ఉండాలి. కుటుంబంలోనే గాక పిల్లలకు కొన్ని నియమాలు, నిబంధనలు, నిబద్ధతలు తెలిసే విధంగా చూడాలి. ప్రత్యేకంగా వాళ్లు గ్రహించే విధంగా, వారికి అర్థమయేలా వివరించాలి.



ఉప్పొంగిపోతున్న పిల్లల ఉత్సాహం

పిల్లలని పొగడ్తలతో పెంచడం కాదు, పొగడ్తకూ, ప్రోత్సాహానికి తేడా తెలుసుకోవాలి. తల్లిదండ్రులు చిన్నవయసులోనే పిల్లలకు ప్రమాదకరమైన అలవాట్ల వల్ల నష్టాల గురించి అవగాహన కల్పించాలి. ప్రోత్సాహం, మంచి, చెడుల గురించి తెలియజేసే విధంగా ఉండాలి.

గర్వం, గర్వించడం ఒకటి కాదు. గర్వించడం ఏదో మంచి పని చేస్తూ సాధించిన భావన. ***'గర్వం నేనే, నాకే తెలుసు'*** అని ఊబిలో దిగబడటం అని చిన్నప్పటి నుంచి తెలుసుకోవాలి, హైస్కూలు పూర్తి చేయకముందే. ఇవన్నీ కుటుంబ విలువలు, సంబంధాల నుంచి తెలుసుకోవలసిన విషయాలు.

యువకుల మందా, మద్యమా?

మా ఊరిలో (బయట ఎలాంటి బోర్డు లేకుండా) ఒక ప్రభుత్వ మద్యం దుకాణం నడుస్తోంది. రోజుకి ఒకటిన్నర లక్షరూపాయల మందు (ఒక్కొక్క సీసా 150 రూపాయలు) ఆదివారాల్లో ఇంకా ఎక్కువ అమ్ముతారు. ఇక్కడ 5, 6 పేర్లతో అమ్మే లిక్కర్, (సారా, మద్యం) ఇంతకు ముందు ఎక్కడా వినలేదు.

ఈ ప్రభుత్వ మద్యం దుకాణంలో నల్గురు యువకులు (ఇద్దరు కాపలాదారులు) పనిచేస్తున్నారు. ఒక తను ఎం. బీ. ఏ. చదివాడు. ఇంకొకరు కంప్యూటర్ డిగ్రీ చేశాడు. వేరొకతను డిగ్రీ పూర్తి చేశాడు. '*వేరే గత్యంతరం లేక ఇక్కడ పనిచేస్తున్నాం*' అని నాకు చెప్పారు. షాపు బయట కాకుండా, లోపల మద్యం అమ్మే కౌంటరు దగ్గర ***"పిల్లలకు అమ్మబడదు"*** అని రాసిన చిన్న గుడ్డ బ్యానర్ కట్టబడి వుంది.



ప్రభుత్వం ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతోనే నడుస్తోంది గదా. దీని మీద చర్యలు తీసుకోరు అని కూడా ఈ యువకులు నాకు సమాధానం చెప్పారు. అంటే తెలిసి తెలిసి ఈ ఊబిలోకి దిగినట్లు గత్యంతరం లేక

అనేగా? మా ఊరిలో దాదాపు 120, 140 మంది రోజూ తాగాల్సిందే అంటే 150, 300 రూపాయలు. వారి రోజువారీ ఆదాయంలో నాలుగో వంతు. వీరిలో 20, 30 మంది యువకులు (35 యేళ్ల లోపువారే).

పిల్లలు ముఖ్యంగా యువకులు మార్పు తీసుకురాగలరు, సందేహం లేదు. మరి ప్రయత్నం ఎందుకు జరగటం లేదు. నలుగురైదుగురు కలిసి గ్రామానికి వాళ్ళ సమాజానికి ఎనలేని సేవ చేయడానికి ఇది ఒక అద్భుత అవకాశం. అదే, ఈ మద్యపాన నిషేధం. కనీసం అరికట్టడమైనా చేయవచ్చు గదా. ఇంతకన్నా ముందు తరానికి ఉపయోగపడే గొప్ప కార్యక్రమం యువజన సంఘాలకి ఏముంటుంది? ఇతరులకు ఆదర్శం అయ్యేలా కొన్నిచోట్ల మహిళలు కూడా, తమ కాపురాలు కూలి పోతున్నాయని నిరసన ప్రదర్శనలు చేశారు.

కనీసం ప్రయత్నం అయినా చేయాలిగా. మందు అమ్మేచోట "*మీకు జీవితబీమా (ఇన్సూరెన్స్) ఉందా?*" అని బయట ఒక బోర్డు పెట్టడంతో ప్రారంభించి సరైన ప్రమాణాలతో తయారైన మందుసీసాలనే అమ్మే విధంగా ప్రయత్నించ వచ్చుగదా? కల్తీలు, ప్రమాదకరాలు తాగకుండా చూడవచ్చు. నిరుద్యోగులుగా తిరిగే యువకులకు ఇదొక బృహత్తర కార్యక్రమం. పిల్లల్లో ఈ అవగాహన వస్తే కొంత మంది ఆరోగ్యాన్నయినా కాపాడవచ్చు.



మందు సీసాలా! శవాల గుట్టలా?

మద్యం దుకాణపు పరిసరాల్లో చూస్తే సీసాల గుట్టలు శవాల గుట్టలా కనిపిస్తుంటాయి. ఇక కొనేవాళ్ళని చూస్తే వాళ్లు అనారోగ్యంతో దీనావస్థలో వున్నారని తెలుస్తుంది.

ప్రభుత్వం దుకాణాల దగ్గర ఉచిత వైద్య సౌకర్యాన్ని, కనీసం ప్రథమ చికిత్స ఏర్పాటు చేయాలి. మద్యం కొనేవారికి వారంలో ఒక్క రోజైనా వైద్యసేవలు అందుబాటులో వుంటే మంచిది.

గ్రామస్థులు ఎవరికీ ఈ సమస్య పట్టినట్లులేనే లేదు. ఎందుకంటే అది "***ప్రభుత్వ దుకాణం***" గదా!

అమెరికా తేజాలు మన దేశ సంతతి పిల్లలే



అమెరికాలో మన పిల్లలపరిస్థితి అద్భుతం, గర్వించదగినది. ఎక్కువ మంది వాళ్ళ తల్లిదండ్రులు మన గ్రామాల నుంచి వెళ్లినవాళ్లే గదా! అమెరికాలో మన తెలుగు పిల్లల పెంపకం, చదువు, సంధ్యలు, అభివృద్ధి అమెరికా వాళ్ల పిల్లలు, అక్కడి ఇతర దేశస్తుల పిల్లలకన్నా కూడా ఎంతో మెరుగ్గా వుందని అమెరికా ప్రభుత్వ సంస్థలే చెబుతున్నాయి. మరి మన పిల్లలు ఇక్కడ ఎందుకని అంత ప్రగతిని సాధించలేకపోతున్నారో ఆలోచించుకోవలసిన విషయం కాదా?

భారత సంతతి అమెరికాలో ముందంజలో వుండటానికి బీజాలు ఎప్పుడు, ఎట్లా పడ్డాయి? సరిగ్గా 50 సంవత్సరాల కిందటి విషయం. తణుకు దగ్గర వేల వెన్ను గ్రామం నుంచి వెళ్ళిన చిట్టూరి రత్నం ఇండియా నుంచి వచ్చిన వాళ్ళ పిల్లలు అమెరికాలో పోటీ ప్రపంచంలో ముందు వుండాలంటే, భాష ముఖ్యం.

భాషలో స్పెల్లింగ్‌లో మనం ముందుండి ప్రశంసలు పొందితే ఎన్నో రకాలుగా పిల్లల దృష్టి, దృక్పథాలు గొప్పగా వుంటాయని '***స్పెల్లింగ్‌బీ***' అనే కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగింది. నార్త్, సౌత్ ఫౌండేషన్ (సంస్థ) పేరు మీదుగా అప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఎన్నో వందల మంది పిల్లల అభివృద్ధికి తోడ్పడింది. చికాగోలో ఈ సంస్థ స్థాపించడంలో నేను, ఇంకా ఎందరో కూడా రత్నం గారికి తోడుగా వున్నాం.

అమెరికా జనాభాలో భారతీయులు (ఇండియన్స్) ఒక శాతం మాత్రమే.

(నూటికి ఒక్కరు) కోటీశ్వరుల్లో (బిలియనీర్లు) నూటికి8 మంది మన భారతీయులే. శాస్త్ర, సాంకేతిక, యాజమాన్య రంగాల్లో 80 శాతం విద్యార్థులు కూడా మన దేశస్తులే. అమెరికాలో ఇండియన్ సగటు ఆదాయం అమెరికా, చైనా, కొరియన్‌ల కన్నా కూడా ఎక్కువ. ఇండియన్ పిల్లలు ప్రగతి, వికాసం, ఉన్నతిలో కూడా ఎంతో ముందు ఉన్నారనేది ఈ మధ్య అమెరికన్ సెన్సస్ బ్యూరో లెక్కల్లో తేల్చిన విషయం. మరి అక్కడ పిల్లలు అంత పురోభివృద్ధి చూపటానికి కారణం ఏమిటి? ఇదంతా గత 30, 35 సంవత్సరాలలో జరిగిన విషయం.



నార్త్-సౌత్ ఫౌండేషన్ గుర్తు చేసుకుంటూ

దీనికి కారణం తల్లిదండ్రుల పాత్ర. కుటుంబ వ్యవస్థ. ముఖ్యంగా తల్లి పాత్ర. తల్లిదండ్రులు పిల్లలతో గడిపే ఎక్కువ సమయం. ప్రకృతిని గౌరవించటం, వాళ్ళకి ఇచ్చే సలహా సంప్రదింపులు. కష్టపడే అలవాటు. కొన్ని నిబంధనలు, విలువలకి కట్టుబడి వుండడం.

అమెరికా పిల్లల్లో అసూయ భావాలు రాకుండా చూసుకునే స్నేహ స్వభావాలే కారణాలని ఎంతో మంది విశ్లేషకుల అభిప్రాయం. ఇండియా పిల్లలు అమెరికాలో ఎట్లా గంభీరంగా, గౌరవంగా ఉండగలుగుతున్నారో రత్నం స్థాపించిన నార్త్, సౌత్ ఫౌండేషన్ వాళ్ళ స్పెల్లింగ్‌బీ తర్వాత **తానా** (Telugu American North Assosiation. TANA) ముఖ్యమైన సమైక్యతా కార్యక్రమాలు నిర్వహించి అట్లాగే **ఆటా ఇంకా** అనేక సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. ఇవి పిల్లల్లో విజ్ఞత, వివేకాన్ని పెంచే కార్యక్రమాలే అని గుర్తుచేశారు. అక్కడ పుట్టి, పెరిగిన పిల్లలు భారతీయ సంస్కృతిని మరువకుండా ఉంచటానికి తెలుగు భాష, సంగీతం, నాట్యం వంటివి శ్రమకోర్చి నేర్చుకుంటున్నారు. మరి మనం మన గ్రామాల్లో ఈ విషయాలు తెలుసుకుని స్ఫూర్తి పొందాలి గదా!

2 ఆలోచనా ధోరణిలో మార్పు

టెలివిజన్, చేతిలో ఫోన్, ఎన్నో యాప్‌లు బడిలో ట్యాబులు వచ్చిన తర్వాత కూడా అదే ధోరణి. కొత్త ఆలోచనల మీద దృష్టి నిలపలేక పోవటం 12 నుంచి19 సంవత్సరాల పిల్లల్లో కొట్టొచ్చినట్లు కనపడుతుంది. చుట్టుపక్కల వాళ్లు చేసిందే చేయడం కనపడుతుంది. చదువుతోపాటు ఈ కొత్త పరికరాలు వాడటం మొదలు పెట్టినప్పుడు కొత్త ఆలోచనలు వస్తాయి, కొత్త పంథా ప్రయత్నిస్తారని అనుకోవడం సహజం.



10-12 సంవత్సరాల నుంచే మోటార్ సైకిల్

సరికొత్త అవకాశాల గురించి తెలుసుకోవాలనే కుతూహలం యువతలోకాన రాదు. గ్రామంలో వున్న జీవితచరిత్రల గ్రంథాలయంలో 800 మంది జీవిత చరిత్రల పుస్తకాలు వున్న విషయం తెలిసినా వెళ్ళి తెలుసుకోవాలనే కుతూహలం లేదంటే ఏమనాలి? సామాన్య యువకులు ఎట్లా ప్రజ్ఞావంతులయ్యారు? ఎట్లా కోటీశ్వరులయ్యారు? ఎట్లా కొత్త టెక్నాలజీని తీసుకువచ్చారు? కొత్త విషయాలని తెల్సుకోవాలనే ఉత్సాహం పిల్లల్లో తక్కువ అనిపిస్తోంది.

రోజంతా ఖాళీగావుండి, తిరిగే అలవాటు కనపడుతోంది. ఎన్నో రోజులుగా యువకులలో ***'తెలుసుకుందాం'*** అనే కుతూహలం కనబడక పోగా తెలుసుకోవడం నామోషీగా కొంతమంది భావిస్తున్నారు. ఏదో ఎవరో తెచ్చి పూవుల్లో పెట్టి అందించాలి, వచ్చి పిలవాలి అనే ధోరణి నుంచి బయట పడాలి. సంవత్సరం నుంచి పెద్ద ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాను.

3 నుండి 7 సంవత్సరాలు పిల్లల మానసిక వికాసానికి అత్యంత ముఖ్యమైనవి. ఈ 3, 4 సంవత్సరాలలో వాళ్ళ దినచర్య, భవిష్యత్ ఏ రీతిలో వుండబోతుందో తెలియచేసేవి. పిల్లలతో కలసి మెలసి భోజనం చేయటమే కాక ఏదో ఒక విషయం మీద మాట్లాడుకోవటం లాంటివి ఎంతో అవసరం. ఇది తెలిసిన తల్లిదండ్రులు కూడా చేయలేకపోతున్నారు. మా గ్రామంలోనే కాదు, చాలా గ్రామాల్లో, చాలా కుటుంబాలలో ఇదే పరిస్థితి ఉన్నది.

అట్లాగే, పిల్లలు 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసులో అంగన్‌వాడీలోనే కాక ఆ తర్వాత ప్రాథమిక, హైస్కూల్లో ఎట్లా చదువు తున్నారు, ఏమి తింటున్నారో కూడా తెలుసుకోటానికి తీరిక వుండటం లేదా? ఉపాధ్యాయులని కలసి, పిల్లల పోకడలను తెలుసుకోవడం ఎంతో ఉపయోగం. ఈ కనీస బాధ్యతను ఎందుకు గ్రహించటం లేదు? గ్రహించినా ఎందుకని ఆ బాధ్యతని నిర్వహించ లేకపోతున్నారు. ప్రైవేటు, పెద్ద కాన్వెంటు, ఇంగ్లీషు స్కూల్లో ఎంతో డబ్బు పెట్టి చదివించుతున్నామనే సంతృప్తితో సరిపెట్టుకుంటున్నారు. రోజూ ఇచ్చే డబ్బుతో పిల్లలు ఏమి చేస్తున్నారో, కొంటున్నారో, తింటున్నారో కూడా తెలుసుకోరు. తెలిసినా పట్టీపట్టనట్లు ఊరుకోవడం జరుగుతోంది. ఈ లోపు అనర్థాలు జరిగిపోతూనే వున్నాయి. చాలామంది తల్లిదండ్రులు డబ్బులు ఇస్తున్నాము కాబట్టి పిల్లల బాధ్యత ఉపాధ్యాయులది, స్కూలుది అని సరిపెట్టుకుంటున్నారు. ఇది సరైన ఆలోచన కాదు. పిల్లల భవిష్యత్‌ని అధోగతి స్థితిలోకి నెట్టటమే కాదా?

కాన్వెంటుకు, స్కూలుకి పంపటమే కాక, మళ్ళీ ఆదే పిల్లలని ఆ తర్వాత ఇంకా ప్రైవేటుకి పంపటాన్ని ఏమనాలి? కొందరు పిల్లలని సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటే వుండేలా చూస్తున్నారు. అందుకు కారణాలు వేరు వేరు.

తల్లిదండ్రులు పిల్లల చదువుల గురించి పట్టించుకుని శ్రద్ధ తీసుకోకపోతే గ్రామంలో ఇంకెవరు ఆలోచిస్తారు? మా ఊరిలో తల్లిదండ్రులతో పాటు, విద్యావ్యవస్థలతో పాటు ఇతర సంస్థలు, సంఘాలు కలసి ఎప్పుడైనా ఊళ్లో పిల్లల బాగోగులు ఆలోచించారా? పిల్లల భవిష్యత్‌ని తీర్చిదిద్దే ఏర్పాట్లు ఏమైనా చేసారా? ఇది అన్ని స్కూళ్ళు, అంగన్‌వాడీలే కాక పంచాయతీ, సచివాలయం, ఆరోగ్య వ్యవస్థ, పాలకేంద్రం, సహకార సంఘం, గుడులు, చర్చిలు (క్రైస్తవ ప్రార్ధనా మందిరాలు) కూడా కలిసి తరచుగా ఆలోచిస్తూ ఉండాలి. కనీస ప్రణాళికను నిర్ణయించుకొని దానిని అమలు చేయాలి. ఆడుకోవటానికి ఒక పార్కు వంటి సౌకర్యాలు కలగచేయాలి. మా ఊరి బాలోత్సవానికి జీవితచరిత్రల గ్రంథాలయ ప్రయత్నానికి (2024లో) గ్రామం సహకరించాలి. అప్పుడే మా ఊరు ఇతర గ్రామాలకి ఆదర్శంగా నిలుస్తుంది.

గ్రామంలో 3 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వరకు వయసు గల పిల్లలు హైస్కూలు తరువాత ఏ చదువుకి, ఎక్కడికి వెళ్ళాలి? అవకాశాలు ఏమిటి? అని భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయం తీసుకునే వరకు పిల్లలు పిడుగులు, సిసింద్రీలే కాదు తారలు కూడా అవటానికి అవకాశాలు కలుగచేయాలి. తారల లాగా ప్రకాశించటానికి అవకాశాలు ఎన్నో. ఇప్పుడు ఇంకా ఎక్కువ ఉన్నాయి. పెద్దలు అట్లాంటి సలహాలు, సూచనలు తెలుసుకుంటూ, పిల్లల పురోగతికి మార్గాలు ఏర్పరచాలి కదా?

గ్రామంలో పాఠశాలల పరిస్థితి

గ్రామంలో ప్రాథమిక విద్య ఎంత అధ్వానంగా వున్నదో **'ప్రథమ్'** అనే సంస్థ 2022 సంవత్సరానికి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రాష్ట్రంలో 100 కి పైగా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల పిల్లల చదువులను పర్యవేక్షించగా తేలిన ఫలితాలు ఆందోళనకరంగా ఉన్నాయి. మా ఊరూ అందుకు మినహాయింపు కాదు.

అసలు ప్రైవేటు స్కూల్లో చదివే వాళ్ళల్లో నాలుగో భాగం పిల్లలు మళ్లీ ప్రైవేటుకు ఎందుకు వెళ్లాల్సి వస్తుంది? ఎందుకు పంపుతున్నారు? ఇంట్లో చదువుకోవటానికి అవకాశాలు లేక ఎలిమెంటరీ స్కూల్ పిల్లలు కూడా నాలుగోవంతు పిల్లల్ని ప్రొద్దున, సాయంత్రం ప్రైవేటుకు పంపిస్తారు ఎందుకని? ఏమిటి ఉద్దేశం? దీనివల్ల చదువు ఏమైనా మెరుగయిందా? చదువు మానేసిన వాళ్ల సంఖ్య 9–10 తరగతి తర్వాత తగ్గిందా? గ్రామంలో ఎవరైనా ఆలోచించారా? ఆరా తీశారా!



జెండా వందనం రోజు ఎలిమెంటరీ స్కూల్లో

ప్రైవేటు స్కూలు పిల్లల ధ్యాస వల్లె వేయటం (బట్టీ పట్టడం లాంటివి) వల్ల మెరుగుగా కనబడుతున్నది. వాస్తవమైనా తెలుగు, ఇంగ్లీషు అక్షరాలు, పదాలు, వాక్యాలు, పాఠాలు చదవగలిగే వాళ్ళు తరగతిలో ఐదో వంతు దాటరు. ప్రైవేట్ స్కూళ్లలో కూడా మూడు నుంచి ఐదు తరగతుల వాళ్లలో దాదాపు అంతే.



మంచి స్కూలే, పిల్లలు తగ్గుతున్నారు

ప్రశాంతి స్కూల్లో చదివే పిల్లల్లో, ఏమాత్రం సౌకర్యాలు లేకపోయినా, పద్ధతి, క్రమశిక్షణ (డిసిప్లన్) మెరుగ్గా వుందని గమనించాను.

మా గ్రామంలో అయిదు అంగన్వాడీల్లో కలసి 5 సంవత్సరాల లోపు పిల్లలు పట్టుమని యాభై మంది లేరు. (జనవరి 23) ఇది రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో ప్రాథమిక స్కూళ్ళల్లో పిల్లలు ఇంకా తగ్గుతారనే దానికి సంకేతమే. అంటే భవిష్యత్ ఏమిటి? పిల్లలని ప్రైవేటు స్కూళ్ళకి 3, 4 సంవత్సరాల నుంచే పంపుతున్నారు. కొంతమందిని బస్సుల్లో ఉయ్యూరు పంపుతున్నారు.

అంటే ఒక గంట వెళ్ళటానికి, రావటానికి ఒక గంట, పడుతుంది. పొద్దున్నే వెళ్ళి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటారు. అంటే పిల్లల **"పెంపకం"** ఎవరిది??



నేల మీదనే 7 వ క్లాసు

స్కూల్లో ఒక తరగతిలో 10 నుంచి 30 మంది పిల్లలు ఉంటే, అది అక్షర జ్ఞానము, లోకజ్ఞానం లేని వారిలో వ్యక్తిత్వ వికాసానికి అవకాశం ఎట్లా అవుతుంది? మరీ ముఖ్యంగా ఈ స్కూళ్ళల్లో పుస్తక కంఠస్తం తప్పితే ఆట, పాటలాంటి కలసిచేసే వినోద, విజ్ఞాన కార్యక్రమాలు అరుదు. కథలు చెప్పగలవాళ్ళు, గుర్తు చేసుకునే వాళ్ళు తక్కువ.

ఇంకా విశేషం ఏమిటంటే పిల్లల్ని ఈ ప్రైవేటు స్కూళ్ల నుంచి వచ్చిన తర్వాత మళ్లీ స్థానిక ప్రైవేటుకి పంపటం. దాదాపు 75, 85 మంది పిల్లలు గ్రామంలోని ముగ్గురు ప్రైవేటు గురువుల ఇళ్లకు వెళతారు.

ఇక్కడ ఎట్లాంటి సౌకర్యాలు, తరగతి గదులు లేవు. అయినా ఎల్‌కేజీ నుంచి 9, 10 తరగతుల వరకు ప్రైవేట్లు ఉదయం ఆరు నుంచి ఎనిమిది వరకు, మళ్ళీ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది వరకు చెపుతారు. అది అయిపోయిన తర్వాత ఇంటి దగ్గర మళ్లీ ప్రయివేటు చెపుతారు.



జీవిత చరిత్రల గ్రంథాలయ వార్షికోత్సవ జిల్లా విద్యాశాఖాధికారిణి

ప్రభుత్వం నడిపే స్కూళ్లు వచ్చేపది సంవత్సరాలలో ఖాళీ అవుతాయా అనే రీతిలో వుంది ఇప్పటి పరిస్థితి. గ్రామాల్లో విద్య మిథ్యా అన్న రీతిలో అయోమయంగా వుంది. దాని ప్రభావం, బాధితులు పిల్లలేగా అంటే కుటుంబాలు, గ్రామ వ్యవస్థ భవిష్యత్ ఇంకా అయోమయమై పిల్లల పరిస్థితి ప్రశార్థకం కావటమే. అది గ్రామ దుస్థితికి సూచనే కదా!

మా ఊరినుంచి 5, 6 బస్సుల్లో (నాలుగు బస్సులు ఆర్టీసీవి) పిల్లలు ఎక్కువగా ఉయ్యూరు వెళ్తారు. దాదాపు 60 మంది దాకా పిల్లలు స్కూలు బస్సుల్లో మా ఊరి నుంచి బయలుదేరి 5, 6 చోట్ల ఆగుతూ, ఎక్కించుకొని గంట తర్వాత స్కూలుకి చేరుకుంటారు. మళ్లీ సాయంత్రం గంటకు పైగా అదే బస్సులో ప్రయాణం చేసి తిరిగి వస్తారు.

అంటే రెండు గంటల పైగా సమయం ప్రయాణానికే వృధా అవుతుంది. బస్సులో ఏదో ఒక రకమైన, చిన్న, చిన్న తగాదాలతో స్కూల్‌కి వెళ్లడం, స్కూల్ నుంచి రావడం జరుగుతుంది. బస్సు కోసం ఉదయం 10 నుంచి 20 నిమిషాలు రోడ్డు మీదో, కొట్ల ముందో ఎదురు చూస్తూ ఉంటారు. ఈ బస్సు ప్రయాణం వల్ల పిల్లల మధ్య స్నేహభావాలు కూడా ఉన్నట్లు కనబడదు. బస్సుల్లో వెళ్లే వాళ్లలో ఆరు సంవత్సరాల లోపు వాళ్లు కూడా ఉన్నారు. తల్లిదండ్రుల ఆలోచన ఏమై ఉండాలి? ఆత్మ విశ్వాసమా అని కూడా అనవచ్చేమో! ఊళ్లో స్కూలు, ఎలిమెంటరీ స్కూలు ఉన్నా, అన్నీ వుచితమైనా కూడా పొరుగూళ్లకు ఖర్చుతో పంపుతున్నారు.

మిథ్యలో విద్య, భ్రమలో గ్రామాలు

మొన్న జనవరి 31, 2023 న పార్లమెంటులో దేశ ఆర్థిక పరిస్థితిని గురించి ఇచ్చిన రిపోర్టులో ప్రాథమిక సెకండరీ విద్యను గురించి కూడా అందులో చర్చ చేయబడింది. అది చదివి నేను ఆశ్చర్యపోవడమే గాక ఇదా నేను ఇన్ని సంవత్సరాలు ఢిల్లీలో ఉండి చేసింది అని కొంత సిగ్గుపడ్డాను. గ్రామంలో ఉండి రోజూ చూస్తూ, స్థానికులతో మాట్లాడుతూ ఉంటే గాని అసలు విషయం తెలియదు అని గ్రహించాను. పార్లమెంటులో, ప్రభుత్వాలు, దేశాన్ని గురించి ఇచ్చే లెక్కలకి స్థానికంగా గ్రామంలో ఉండే పరిస్థితికి పొంతన లేకపోవడమే గాక పూర్తి విరుద్ధంగా ఉందని గ్రహిస్తే మనం ఊహాల ప్రపంచంలో ఉంటున్నామా అనిపిస్తుంది. మరి మన దేశ అధ్యక్షురాలు పార్లమెంటును ఉద్దేశించి మొన్న మాట్లాడిన విషయంలోనూ అంతే. ముఖ్యంగా పిల్లలు వాళ్లు చదువుసంధ్యల గూర్చి. ఆడపిల్లల విషయంలో గణాంకాలు ఇంకా ఆశ్చర్యం కలిగించాయి.

దేశం మొత్తానికి లెక్కలు భ్రమ అనిపించక తప్పదు. స్థానిక గ్రామ పరిస్థితులు, పోకడలు గమనిస్తే కొంతమందికి విద్య మీద విరక్తి ఎందుకు కలుగుతుందో అర్థం అవదు. లెక్కల్లో చూపించబడే భారత్, గ్రామంలో ఉన్న పరిస్థితి వేరు అని చాలామందికి తెలిసినదే.

2035, 2040 సంవత్సరాల్లో మా ఊరి భవిష్యత్తు ఇప్పటి 200 నుంచి 400 మంది పిల్లలపై (మూడు నుంచి పదకొండు సంవత్సరాల మధ్య) మీద ఆధారపడి ఉంటుంది. ఈ 200, 400 మంది పిల్లలు ఏ విధంగా పెరుగుతారు? ఎట్లాంటి శిక్షణ, క్రమశిక్షణ, ఆలోచనలతో పౌరులవుతారు, వ్యక్తిత్వంతో ఓటర్ల బాధ్యత భావాలతో పెరగటం మీద ఆధారపడుతుంది.



భవిష్యత్ బస్సుకోసం ఎదురు చూడటం, రోజూనా?

మరి ఈ 200, 400 మందిని ఇప్పుడు తీర్చిదిద్ద లేకపోతే, అభివృద్ధి, మెరుగైన గ్రామాలను ఎట్లా చూడ గలుగు తున్నాం? ఇప్పుడు ఈ 200, 400 మందికి ఎట్లాంటి అవకాశాలు కలుగ జేస్తున్నాం? అవగాహనతో కావలసిన సౌకర్యాలు కల్పించి, తగిన శిక్షణకు అవకాశం ఇస్తున్నామా? గ్రహిస్తున్నామా? ఇదే ఇప్పటి ఆలోచన. వీరికి అవసరమైన ప్రణాళిక ఏమైనా వుందా? ఈ పిల్లల్లో కొంతమందిని రోజుకు రెండు మూడు గంటలు బస్సుల్లో పంపించడానికి వెనకాడం, కానీ ఈ పిల్లలు కనీసం ఒక గంట ఆడుకోవడానికి, పాడుకోవడానికి, వినోదం, విజ్ఞానం కోసం సౌకర్యాలు చేయలేమా? ఏమైనా ఆలోచించారా? అవకాశాలు ఉన్నాయా ఊరిలో? ఆలోచించండి.

మా ఊరులో ఐదు అంగనవాడీలు అన్నిటిలో పిల్లల సంఖ్య సగానికి తగ్గిపోయింది. రెండు దూసరిపాలెంలో విజయలక్ష్మి, మాలపల్లిలో ఝాన్సీ అంగన్వాడీలను శ్రద్ధగా నిర్వహిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక పోయిన అప్పటికీ, జీతాలు నెలల తరబడి అందకపోయినా, స్థానికులు వాళ్ళకి ఏ మాత్రమైనా సహకరిస్తున్నారా? ప్రత్యక్షంగా చూస్తేగాని తెలియదు పరిస్థితి. అంగన్వాడిలో కనీసం సమయానికి పాలు, కోడిగుడ్లు ఇచ్చి జాగ్రత్తగా ఆయా చూసుకుంటున్నందుకు ఆయాని, టీచర్ని ఇద్దరిని అభినందించాలి. పిల్లలకు రెండు, మూడు యేళ్ల నుంచే బ్రష్, పేస్టు పెట్టి పొద్దున్నే మొహం కడుక్కోవటానికి అలవాటు అయ్యారు.

అంటే దానికి ఎవరు బాధ్యులు? వేపపుల్ల, పళ్లపొడి పిల్లలకి మంచిది అని మరిచి తల్లిదండ్రులు రెండు సంవత్సరాల నుంచే బ్రష్ వాడటం అదో గొప్పఅలవాటు అనుకుంటున్నారు. గ్రామంలో దాదాపు 175 మంది 3 నుంచి 5 ఏళ్ల పిల్లలు వుంటే, ఇప్పుడు 60, 70 మందే 5 అంగన్ వాడీల్లో వున్నారు. తల్లిదండ్రులు కొంతమంది మూడో సంవత్సరం రాక ముందే ప్రైవేటు స్కూలుకి పంపిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే దాదాపు 40 మంది 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలని బస్సుల్లో పంపటం. దాదాపు 35, 45 మంది 3 నుంచి 5 యేళ్ల పిల్లల్ని స్థానిక ప్రైవేటు స్కూలుకి పంపుతున్నారు.

అక్కడ వాళ్ళకి కావలసిన కనీస ఆరోగ్య, ఆహార సౌకర్యాలు, ఆట, పాటల వ్యవస్థలు కనబడవు. అంగన్‌వాడీలకు, ప్రాథమిక స్కూలుకి వెళ్ళకుండా ప్రయివేటు పాఠశాల వారు ఈ పిల్లలని ***'ఒక సంవత్సరం ఉచితం'*** అనే పేరుతో వాళ్ళ స్కూలుకి రాబట్టు కుంటున్నారు.

వంటపట్టని వీడియో చదువులు

ఈ మధ్య వీడియో చదువులు చాలా ఆర్భాటంగా మొదలయ్యాయి. అయితే, ప్రయోగ రూపంలో కాక రాష్ట్రం అంతటా ఆంధ్రప్రదేశ్ లో ఎనిమిదో తరగతి పిల్లలకు ఆన్‌లైన్ పాఠాలు. ఏ విధమైన పరిశోధన చేయకుండానే, పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వడం జరిగింది. స్మార్ట్ ఫోనుల్లో కూడా ఆదేశాలు జారీ చేయడం జరుగుతోంది.

ఇలాంటి ఆధునిక పరికరాలు ఉపయోగించటం మంచిదే. అయితే తగినంత ముందుగా పరిశోధనలు చేసి, అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. నమూనాగా కొన్ని నిర్వహించిన తర్వాతనే పాఠ్యాంశాల్లో భాగం చేయాలి.

అలా కాకుండా అర్ధంతరంగా ప్రవేశపెట్టడం అపోహలు, అనర్థాలకి కారణం అవుతాయి అని ప్రభుత్వాలు గ్రహించినట్లు లేదు. ఏదో చేశాము అనే ఆత్రుత ఎక్కువ కనపడుతుంది. పిల్లలు ట్యాబ్‌ల లాక్ తీసేసో, మరచిపోయో, వాటిని ఇతర కార్యక్రమాలు చూడడానికి ఉపయోగించు తున్నారు. 10 నుంచి 20 శాతం విద్యార్థులు మూడు నెలల్లోనే దుర్విని యోగం చేశారు. తల్లితండ్రుల దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లడం కూడా జరిగింది. అయితే ఎట్లా ఎదుర్కొనాలి అనే విషయం తెలిసేసరికి మా హైస్కూల్‌లో పరిస్థితిని గ్రహిస్తే కొత్త ప్రయత్నం 20 శాతం ఉపయోగ పడితే విశేషతే. అయితే దీనివల్ల దుర్వినియోగం, దుర్వ్యసనాల ధోరణే కనపడుతోంది. ఈ ప్రయత్నం ప్రయోజనకరం అనుకోవటం ఎక్కువ.

దీనిని ఒక ప్రయోగంగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటూనే పిల్లలు పిడుగులు, సిసింద్రీలు కావడానికి ఈ కొత్త టెక్నాలజీ అవకాశాలు ఉపయోగకరంగా ఉంటాయి. మరి ఆ ధోరణి, ఆ ప్రయత్నం ఏది?

ఎవరు చేస్తారు? ఈ కొత్త ప్రపంచంలో అద్భుతమైన మార్పులు రావాలంటే పిల్లల పాత్ర, భాగస్వామ్యం తప్పక ఉండాలి. అప్పుడే మార్పును ఊహించవచ్చు. (వ్యాపారులు, రాజకీయ నాయకుల అవసరాలు కాదు.)

ప్రభుత్వ స్కూళ్లలో అంతా ఉచితం అనేది భ్రమ

చాలామంది తల్లిదండ్రులలో ఉన్న భ్రమ ఏమిటంటే '***డబ్బులు పెడితేనే మంచి చదువు వస్తుంది.*** '***ఎంత ఎక్కువ ఖర్చు పెట్టితే అంత గొప్ప చదువు***' అనుకోవటం భ్రమ. అంటే వాళ్ళ ఉద్దేశంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత విద్యాలయాల్లో ***అంతా ఉచితం*** కాబట్టి దాని నాణ్యత తక్కువ. ఇది చాలా త్రీవమైన విషయం. దీన్ని గురించి ఎవ్వరు మాట్లాడరు. పైగా ప్రభుత్వం అంతా ఉచితం అనే భ్రమని పెంచుతోంది. ఈ స్కూల్లో వసతులు, భోజనం, పుస్తకాలు, దుస్తులు, అనుభవం గల ఉపాధ్యాయులు అంతా, అన్నీ ఉచితమే అనుకోవటం కూడా మరో భ్రమే. ఎందుకంటే, ఈ ఖర్చు అంతా ప్రభుత్వం ప్రజల దగ్గర నుంచి అనేక రకాలుగా పన్నుల రూపంలో వసూలు చేసిందే. ఇది గ్రహించాలి. నాయకులు కూడా ఈ విషయాలు ఎందుకని తెలియచేయరో మరి!

ఎనిమిదో తరగతి తర్వాతనే ఎందుకని కొంత మంది చదువు మానేస్తున్నారు? పరిశీలిస్తే, స్కూల్లో విద్య అంటే ఒక విధమైన నిర్లక్ష్యం కనపడుతుంది. దీనికి కారణం వెంటనే ఉద్యోగం దొరకకపోవటమే.

ప్రభుత్వ స్కూల్లో ఎన్నో సౌకర్యాలు ఇస్తున్నా, చదువు సరిగ్గా చెప్పరనే వాడుకని ప్రచారం చేసి, ప్రయివేటు స్కూల్లో చదివితే ఉద్యోగం వచ్చే అవకాశాలు ఎక్కువ అనే భావనతో ప్రయివేటు స్కూల్లోనేర్యాంకులు వస్తాయి అనే భ్రమ కూడా ఈ స్థితికి కారణం.

స్కూలు బ్యాగ్... గాడిద బరువా?

రోజూ, ఒక్కసారయినా, కనిపించే దృశ్యం. 10 యేళ్లలోపు బడి పిల్లలు కూడా **"గాడిద బరువు"** తో స్కూలుకు వెళ్లి మళ్లీ సాయంత్రం మోసుకుంటూ వంగి, వంగి బరువైన సంచులను ఈడ్చుకుంటూ నడుస్తూ కనబడతారు. ఒక్కొక్కరిది 8 నుంచి 11 కిలోల బరువు బడిసంచి. ఈ దుస్థితిని రోజూ చూస్తూ పట్టించుకోని తల్లిదండ్రులు, పిల్లల చదువుని గురించి ఏమి పట్టించుకున్నట్లు కనబడరు. ఈ విషయంఎన్నో యేళ్ల నుంచి నేను తల్లిదండ్రులతో మాట్లాడుతూనే వున్నప్పటికీ ఫలితం లేదు. గత పదేళ్లలో సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) కూడా ఈ విషయంలో రెండుసార్లు సూచనలు చేసింది.



స్కూల్ బ్యాగ్ బరువు

అయినా ఫలితం కనబడదు. ప్రాథమిక తరగతుల్లోకి వెళ్లే పిల్లలను చూస్తేగాని ఈ పరిస్థితి అర్థం కాదు. దూరం నుంచి వచ్చే పిల్లల దుస్థితి చెప్పక్కరలేదు. 7వ తరగతి పిల్లలు సంచి మోసే విధానం, నడిచే విధానం చూసి దాని ప్రభావం ఆడ, మగపిల్లల మీద ఏ విధంగా ఉంటుందో గమనించవచ్చు.

మరి స్కూల్లో సమయం టేబుల్ వుంటుంది గదా, రోజూ అన్ని పుస్తకాలు తీసుకెళ్లాల్సిన అవసరం ఏమిటి? క్రమశిక్షణ అక్కడినుంచే గదా మొదలయ్యేది. ప్రభుత్వం ఇచ్చే బ్యాగ్‌లు కొన్ని నెలల్లోనే చిరిగిపోతే పుస్తకాలని రెండు చేతులతో పట్టుకుని స్కూలుకి వచ్చే వాళ్ళ సంఖ్య పెరుగుతోంది.

ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్లో పిల్లలు గాడిద బరువు బ్యాగ్ కాక, ఎండలు మండుతున్నా బూట్లు, టై కట్టాల్సిందే. వీటి అవసరం ఏమిటి అని అడిగేవాళ్లు లేరు. కొంతమంది విద్యార్థులు రోజూ బస్సుకోసం దాదాపు 10 నుంచి 20 నిమిషాలు ఎదురు చూస్తూ వుంటారు. అంటే రోజుకు 30–40 నిమిషాలు స్కూలు బస్సులో వెళ్లి, మళ్లీ సాయంత్రం 30 – 40 నిమిషాలు బస్సులో రావడం జరుగుతుంది.



ఇన్ని పుస్తకాలు, ఇట్లా క్లాసులకి కొంతమంది

దీనిని ఎవరైనా, ఎప్పుడైనా గ్రహించారా? లేదా? అందుకే మా ఊరి జీవితచరిత్రల గ్రంథాలయంలో '**దినచర్య**' ని వివరంగా రాయించే ప్రయత్నం జరిగింది.

పిల్లలు వారి దినచర్య కాక తల్లి దినచర్య ఒక వారం పాటు గమనించి రాయటం. హైస్కూల్‌లో 7వ తరగతి పిల్లలని ఆ విధంగా దినచర్య రాయమని ప్రస్తావన చేస్తే రాస్తామని చెప్పి వారం తర్వాత ఒక్కళ్లు కూడా రాయలేదు. దినచర్య రాయగలిగితే పిల్లల్లో క్రమశిక్షణ, అవగాహనలు కలిగి, వాళ్లంతట వాళ్లే తెలుసుకుంటారు. కాని ఒకరిద్దరుతప్ప మిగతా పిల్లలు, ఉద్దేశం చెప్పిన తర్వాత కూడా రాయలేకపోయారు. ఇది దేనికి సంకేతం?

ఆరు సంవత్సరాల తర్వాతే తరగతి

చాలామంది తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను ఎంతత్వరగా ఇంట్లో నుంచి స్కూలుకో, ప్రయివేటుకో పంపాలని చూస్తారు. ఇందుకు కారణాలు వేరు వేరు. కొంతమంది తల్లిదండ్రులు ఇద్దరూ ఏదో పనికో, ఉద్యోగరీత్యానో ఇంట్లో నుంచి పొద్దునే వెళ్ళి సాయంత్రం గాని రారు. కొంతమందికి వాళ్ళపిల్లలను ఎట్లా పెంచాలో తెలియక. కొంత మంది పిల్లలని ఎంత త్వరగా చదువులో పెట్టితే అంత త్వరగా ''పైకి'' వస్తారనో, ముందు వుంటారనో అనుకుంటారు. ఇంకా కొంత మంది పిల్లల బాధ్యత ఇంకెవరి చేతిలోనో పెట్టాలని చూస్తారు. డబ్బులు ఇస్తే పెంచే బాధ్యత వస్తుందనుకుంటారు. కొంతమంది స్కూల్లో అన్నం పెడతారు, బట్టలు ఇస్తారు, అమ్మఒడి సహాయం అందుతుందని కూడా పంపిస్తారు.

అయితే మూడు సంవత్సరాలు తర్వాతే అంగన్‌వాడీకి పంపవచ్చు అనే కాకుండా ఇంకా త్వరగానే పంపాలని చూస్తారు, పంపిస్తారు. అట్లాగే ఒకటో తరగతిలో అయిదు సంవత్సరాలకి కాని చేర్చరాదు.



భవిష్యత్ ప్రస్తావన అంగన్‌వాడీ నుంచేగా...

అయినా ఆ లోపే స్కూల్లో చేర్చటానికి ప్రయత్నిస్తారు. మరి ఇప్పటికీ నుంచి ఆరు సంవత్సరాలు పూర్తి అయిన తర్వాతే ఒకటో తరగతిలో చేర్చుకుంటారు. ఈ మార్పు ప్రభుత్వం ఇప్పుడు (2023) ఎందుకు చేసింది. అయిదు బదులు ఆరు సంవత్సరాలకి ఎందుకు పెంచారు. అంటే పిల్లలు వాళ్ళ ఇంటి దగ్గర తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలు దగ్గర వుంటేనే మంచిది అనే గదా? మరి ఇప్పుడు పిల్లలు ఇంట్లో ఎంత తక్కువ టైము వుంటే అంత మంచిది అనే దృష్టిలో ఉన్నారుగా.

“సర్” అనే కొత్త సినిమాలో విద్యని ఏ విధంగా వ్యాపారం చేసి, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారనే విషయాన్ని అద్భుతంగా చూపించారు.

తెలుగు, తమిళంలో వచ్చిన సినిమా ఇది. మురళి అట్లూరి దర్శకులు. విద్యని ఏ విధంగా వ్యాపారంగా మార్చారు?

విద్యార్థులను ఖాతా దారులుగా **"కష్టమర్లు"** గా చూస్తున్నారు అనేదే కాకుండా అట్టడుగు వర్గాల పిల్లలకి విద్యావకాశాలను ఏ విధంగా దూరం చేస్తున్నారో కూడా చూపారు.

తల్లిదండ్రులు ఎక్కువ ఫీజు కడితే ఎక్కువ విద్య అనే భ్రమలో వున్నారో, తాత్కాలిక తాయిలాల కోసం పిల్లల భవిష్యత్‌ను ఏ విధంగా నిర్లక్ష్యం చేస్తున్నారో చక్కగా చూపించారు. విద్యావ్యాపారులు, డబ్బు లేకపోతే పిల్లల ప్రతిభని ఎట్లా నిరోధిస్తున్నారో కూడా చూపించారు.



నేల మీద 7వ క్లాసు

మా ఊరి ఉన్నత పాఠశాల పరిస్థితి దయనీయం. గ్రామస్తుల సహకారం ఏమాత్రం ఉన్నట్లు కనపడదు. పిల్లలు లోపలికి వెళ్లడానికి, సైకిళ్లు పెట్టుకోడానికి సరైన సౌకర్యం లేకపోగా, ఏడో తరగతి విద్యార్థులు బయట నేలమీద కూర్చొని పాఠాలు వినటం చూసి ఆశ్చర్య పోవాల్సిందే.



ఈ వయస్సు ఎండమావి కాకూడదు.

మరింత ఆశ్చర్య పోవలసిన విషయాన్ని ఇంత దీన పరిస్థితుల్లో కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు కూడా ఏమాత్రం పట్టించు కున్నట్లు కనబడదు. గ్రామ సచివాలయం కూడా.

మూడు నెలల్లో రెండుసార్లు ప్రధానోపాధ్యాయురాలు పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు మీటింగ్ పెడితే ఒకళ్ళు మాత్రమే వచ్చారు. మొన్న ఫిబ్రవరి 23 తేదీన పదవ తరగతి విద్యార్థులు స్థితిగతులు తెలుసుకోవాలనే సమావేశం పట్ల కుతూహలం ఏ మాత్రం కనపడలేదు. ఇది నిర్లక్ష్యమా? వీటన్నిటికీ తోడు గ్రామవిద్యా కమిటీ వలన ఏమి ఉపయోగం లేకపోదు. హైస్కూలు నిర్వహణలోనే గాక **'నాడు-నేడు'** నిర్మాణ కార్యక్రమాల నిర్వహణ నిరుత్సాహంగా ఉందని చెప్పక తప్పదు. ఒక మంచి ఆలోచనను నీరు కార్చటం అంటే ఇదే. ఉపాధ్యాయులు ఈ పనుల్లో పడి పాఠాలు, క్రమశిక్షణ విషయంలో కుంటుపడినట్లు కనబడుతూనే ఉంది. దీనికి బాధ్యులు ఎవరు? గ్రామస్తులు ఏమాత్రం గ్రహించినట్టే గాక పట్టీ పట్టీనట్లు ఉంది. ఇది నిరుత్సాహకరమైన, ఆందోళన చెందవలసిన విషయం. చదువుకు సంబంధం లేని కార్యక్రమాల్లో ఉపాధ్యాయులకు బాధ్యత అంటగట్టడం భావ్యమా? గ్రామస్తులు ఎవరూ ముందుకు వచ్చి అంగన్ వాడి సౌకర్యాలు, నిర్వహణలో కూడా సహకరించటం ఏమీ లేకపోవటం ఇంతకన్నా నిరుత్సాహకరమైన విషయం.

ఐ.టి.ఐ. అయితే త్వరగా అయిపోతుందని తొందరగా ఏదో ఒక ఉద్యో గం వస్తుందని ఆశించి చదువుతారు. మరి ఐ.టి.ఐ. చదివిన వాళ్లకే కాదు ఇంజినీరింగ్ చదివిన వాళ్ళకి కూడా ఉద్యోగాలు అందరికీ రావటం

అసాధ్యం అని ప్రభుత్వం చెబుతోంది. నీతి అయోగ్ రిపోర్టు బయటపెట్టిన విషయం(ఫిబ్రవరి 2023). ఐనా ఐ.టి.ఐ. వెళ్ళేవాళ్ళే ఎక్కువయ్యారు.



ఆడుతూ – పాడుతూ నేర్చుకుంటాం.

ఈ 80, 90 మందిలో ఏదో ఒక కోర్సు చేస్తున్న వాళ్లు 20–30 లోపే. అంటే 50 నుంచి 60 మంది ఖాళీగా వున్నట్టు. అప్పుడప్పుడు ఏదో ఒక ఆలోచనను ఆచరణలో పెడుతున్నారు. ఏదో ఒక చిన్న వ్యాపారం లాంటివి చేసే ప్రయత్నంలో ఉన్నారు. అలాంటి వాళ్ళకి సలహా, సంప్రదింపులు గాని స్థానికంగా గ్రామంలో ఎవరూ ఇస్తున్నట్లు కనపడదు. మహిళలకి డ్వాక్రా సంఘాల ద్వారా కొన్ని అవకాశాలు ఉన్నాయి. ఐనా ఆ సభ్యులు విద్యావంతులను ఏమాత్రం ఉపయోగించుకోవడం లేదు.

అవకాశాలు లేక తెలియక, సలహా ఇచ్చేవాళ్ళు లేకపోవడం వల్లనే నిరాశ కలుగుతుంది. గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి సచివాలయం ఉంది. అందులో దాదాపు ఐదారు మంది ఏదో ఒక సలహా సంఘంలో సభ్యులుగా ఉన్నారు. వాళ్లు కూడా యువకులే.

30 సంవత్సరాల లోపు వాళ్ళు ఐదారుగురు యువకులు బ్యాంకుల దగ్గర నుంచి అప్పు తీసుకుని ఆటోరిక్షాలో, మోటార్ సైకిళ్లు కొనే ప్రయత్నాలు చేస్తున్నారు. యువకులకు, హైస్కూలు పూర్తిచేసిన వారికి, మానేసిన వాళ్ళకి సలహా అందుబాటులో వుందా?



సంధ్య పర్యవేక్షణలో చదువుతో పాటు ఆటపాట

సచివాలయంలో పనిచేసే యువకులు ఉత్సాహవంతులే. అందులో ఎవ్వరూ మా గ్రామస్తులు కాదు. బయట నుంచి రోజూ వచ్చే వాళ్లే. అంతేకాదు, వాళ్లంతా ఏదో ఒక ఉద్యోగానికి పరీక్షలు రాయడంలో తలమునకలుగా ఉన్నవారే. వాళ్ల ధ్యాస అంతా మంచి ఉద్యోగం కోసమే గదా? అట్లాంటి స్థితిలో గ్రామంలో కొత్త ఆలోచనలకి, ఉత్సాహానికి తావేది? అట్లాంటి పరిస్థితుల్లో గ్రామస్తులే కొద్దో గొప్పో కల్పించుకోకపోతే పరిస్థితులు ఎట్లా మెరుగవుతాయి? ముందు ఆలోచన ఉండాలిగా. అంతా ప్రభుత్వం మీద వదిలేస్తే ముందు ముందు పరిస్థితి ఏమిటి? పిల్లల విషయంలో పరిస్థితి ఇంకా విషమం అవదా? పిల్లల భవిష్యత్తుతో గ్రామ భవిష్యత్తు ముడిపడిన విషయం గ్రామస్తులు గ్రహించినట్లు కనబడదు. ఈ విషయాల్లో గ్రామపంచాయతీది కేవలం ప్రేక్షక పాత్రగానే కనపడుతోంది సచివాలయ ధ్యాస అంతా వేరే విషయాల మీద గదా!

ఖర్చు ఎంత, ట్యూషన్ ఫీజు ఎంత?

పిల్లలకి వాళ్ళ కుటుంబంలో ఎంత ఖర్చు పెట్టుతున్నారు. వాళ్ళ తల్లిదండ్రుల ఆదాయ, వ్యయాలను గురించి కొద్దోగొప్పో తెలిస్తే బాధ్యతా భావం వస్తుందనటంలో సందేహం లేదు. చాలా మంది పిల్లలకి ప్రైవేటుకు ఎంత కడుతున్నారో తెలియదు. రూపాయి నుంచి ఐదు రూపాయల చొప్పున తల్లిదండ్రులు రోజూ ఇస్తూ వుంటే వారం, నెలకు ఎంత ఇస్తున్నారు. అట్లాగే వాళ్ల బట్టలు, ఇతర అవసరాలకు ఎంత ఖర్చు పెడుతున్నారు. తల్లిదండ్రులు భరించగలరా, అప్పు చేస్తున్నారా అని తెలిస్తే పిల్లల ఆలోచనా విధానం వేరుగా వుండవచ్చు. రేపటికి దాచుకోవాలి, దుబారా ఖర్చు ఎట్లా తగ్గించుకోవాలో 14 సంవత్సరాల కల్లా కొంతైనా తెలియాలి. అప్పుడే జీవనశైలి వేరుగా వుండే అవకాశం వుంది. ఖర్చుకి తగ్గ ఫలితం విషయంలో కొంత అవగాహన రావాలి. తల్లిదండ్రుల ఆస్తి, ఆదాయం, ఖర్చులు, పొదుపు విషయాలు హైస్కూలుపిల్లలకి కొంతైనా తెలియాలి. తృప్తి అనే భావం, ఆలోచన, అలవాటు, నమ్మకం మానసిక విషయమే అయినా, అది ఖర్చు పెట్టే పద్ధతుల మీదే ఆధారపడి వుంటుంది. పిల్లలకి ఆదాయ, వ్యయాల గురించి అవగాహన చిన్నప్పటి నుంచే వుండాలి. అందుకు తల్లిదండ్రుల ప్రయత్నం ఉండాలి.

నెదర్లాండు దేశంలో తల్లిదండ్రులలో ఎవరో ఒకరు కనీసం అయిదు యేళ్ల వరకు ఇంటి దగ్గరే ఉండి పిల్లల పెంపకం బాధ్యత తీసుకుంటారు. ఈ లోపు స్కూలుకి పంపటం నేరం. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పిల్లలు ఆ వయస్సులో ఎంత ఎక్కువ గడిపితే అంత మంచిది. ఆ తర్వాతే బయట స్కూలుకి పంపితే వాళ్ళ ఆలోచనలకి అర్థంపర్థం.

పిల్లలకు బాధ్యతా భావన వస్తుందని అక్కడ చాలాకాలం నుంచి ఆ విధంగా చేస్తున్నారు. అందుకేనేమో ప్రపంచంలో సంతోషంగా వున్న దేశాల్లో నెదర్లాండు మొదటిది. ఆలోచించవలసిన విషయం కదా!

జన్మనిచ్చిన తల్లికి ప్రసవానంతరం మొదటి మూడు నెలల వరకు సెలవు ఇవ్వాలని మన దేశంలో కూడా ఉన్నది చట్టం. ఈ మధ్య దీన్ని ఆరు నెలల వరకు పొడిగించారు. ఆయాలను నియమిస్తాం అంటే కుదురుతుందా? ఈ మధ్య సిక్కిం ప్రభుత్వం మొన్న జనవరిలో ఒక సంవత్సరం వరకు సెలవు ప్రకటించారు. ఒక ఆయాని కూడా ప్రభుత్వమే ఇంటి వద్ద భరిస్తుందని కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

అయితే మనకి ఇక్కడ తల్లిదండ్రులు ఎంతో తొందరగా పిల్లలని స్కూలుకి పంపాలని ఆలోచిస్తారనిపిస్తుంది. మూడు సంవత్సరాలలోపే పంపాలని చూస్తారు. దగ్గరలో వున్న అంగన్‌వాడీలోనో, ప్రయివేటు స్కూళ్లలోనో వదిలి రావాలని చూస్తారు. పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి అనే భావన మచ్చకు కూడా కనపడదు. తల్లిదండ్రులు ఇద్దరూ పనుల్లోకి వెళ్ళాల్సి వస్తుండడం వల్లా?

పిల్లలని బాగా చదివించాలి అనే తల్లిదండ్రుల ఆలోచన మంచిదే. అయితే చదువు అంటే తరగతులు పాస్ కావటమే కాదు. జీవితంలో రాణించిన వాళ్ళు ఏ విధంగా ఆ స్థితికి వెళ్లారో కూడా కొంతైనా తెలియాలి. స్కూలుకి డబ్బులు ఇస్తేనే బాగా చెపుతారు, బాగా చదువుతారు అనేది భ్రమ. తల్లిదండ్రుల ప్రోత్సాహం ప్రత్యక్షం, పరోక్షం చాలా ముఖ్యం. ఎక్కువ డబ్బులు కట్టినంత మాత్రాన, దూరంలో వున్న స్కూలుకి పంపితేనో, బూటు, టై కట్టడంతో మంచి చదువు అనేది ఆధారం లేని ఆలోచన. ప్రతి చిన్నారిలో, ఏదో ప్రత్యేకత ఉంటుంది. అది కొంతమంది మాత్రమే గ్రహిస్తారు. తల్లిదండ్రులు గమనిస్తే గాని తెలియదు.

ఆ ప్రత్యేకతని బయటకి తీసే ప్రయత్నం ఇంటి దగ్గర, స్కూల్లో కూడా జరగాలి. గ్రామంలో పిల్లల అభివృద్ధికి సదుపాయాలు, అవకాశాలు ఉండాలి. కలగ చేయాలి. పిల్లలు వాళ్ళంతట వాళ్ళు ఆలోచించుకునే అవకాశాలు కలగజేయాలి.

మా ఊరిలో అట్లాంటి అవకాశాలు, ఆలోచనలు ఉన్నట్లు కనపడదు. అదే నా ఆవేదన. జీవిత చరిత్రల గ్రంథాలయానికి వచ్చే పిల్లల్లో ఎంతో ఉత్సాహం, కుతూహలత, ఆలోచనా శక్తి వుందనేది తెలుస్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే కాక గ్రామంలోని వివిధ సంస్థలు కూడా పిల్లల అభివృద్ధికై కొంత ఆలోచన చేయాలి, వాళ్ళ వంతు కృషి చేయాలి.

సమాజ దృక్పథం

'నేను, నా తల్లిదండ్రులు, నా కుటుంబం, నా పక్కవాళ్లు, నా స్నేహితులు, నా గ్రామం, ' అనే భావన ఎప్పుడు మొదలవుతుందో అప్పుడే సమాజ స్పృహ మొదలయినట్లు. అప్పుడే ఎవ్వరూ చెప్పకుండానే సహజంగా ఆలోచనా ధోరణిలో కూడా మార్పు వస్తుంది. అప్పుడే స్వంత ఆలోచనలకి, వ్యక్తిత్వానికి నాంది అని చెప్పవచ్చు.

మంచిచెడుల విచక్షణా భావన ఎంత త్వరగా వస్తే పిల్లలు, యువకులు అంత త్వరగా భావి పౌరులు అవుతారు. ఏదో ఒక ప్రత్యేకత రావడానికి, ఇష్టాలని అభివృద్ధి చేసుకోవచ్చో తెలుస్తుంది. అదే వ్యక్తిత్వ వికాసానికి సంకేతం. పిల్లలకి వాళ్ల చుట్టుప్రక్కల వున్న స్థితిగతులను గురించి కొద్దో, గొప్పో అవగాహన రావాలి, అది పెరగాలి కూడా. అప్పుడే విచక్షణాభావం వస్తుంది. అందరూ బాగుండాలి, అందులో నేను కూడా వుండాలి అనే భావన, ఆలోచనే గొప్పది. అది పెద్దమార్పులకు, కొత్త నాయకత్వానికి మార్గం అని పిల్లలు తెలుసుకోవాలి.

ప్రకృతి పరిచయం

పిల్లలకు ప్రకృతిని గురించిన అవగాహన పిల్లలకు చిన్నతనం నుంచే వుండాలి, రావాలి, వస్తూనే ఉండాలి. అది నిరంతర ప్రక్రియ. ఇంట్లో జరిగే పండుగలు, పబ్బాలుస ఆచారనియమాల ద్వారా, బయట చెట్టు, పుట్ట, నీటి వినియోగం చూస్తూ తెలుసుకోవాలి. గాలి, నీరు, భూమి, ఆకాశం, అగ్నిని ఎందుకు గౌరవ ప్రదంగా చూస్తామో, కొలుస్తామో కూడా పిల్లలకు ఎంత త్వరగా తెలిస్తే అంత మంచిది. చెట్లలో నుంచి వచ్చే అక్సిజన్ (ప్రాణవాయువు) మానవులకు మేలు చేయటం వంటివి ఎన్నో రకాలుగా ప్రకృతి అందించే వనరులు అని తెలుసుకోవాలి. మంచి, చెడుల విచక్షణ తెలియజేస్తుంది. గమనించటం లోనే వుంది విశేషత, విజ్ఞత. అయిదారు సంవత్సరాలకే చెట్లు ఏ విధంగా ప్రతి సంవత్సరం మార్పులు చెంది పాత ఆకులు రాలి కొత్త చిగురులొస్తాయో తెలియాలి.

ఊరి చెరువుల్లో స్కూలు పిల్లలను సంవత్సరానికి ఒకసారి బోటులో తీసుకెళ్ళి చెరువుల పరిశ్రుభతని గురించి తెలుసుకునే విధంగా చూడాలి. తాడి, వేప, కొబ్బరి, బాదం, ములగ చెట్ల లాంటి వాటి ప్రాముఖ్యత, ఎందుకు తగ్గిపోతున్నాయో తెలియజేయాలి.గ్రామంలో రెండు కాలువలు, ఐదు చెరువులు ఉన్నా, నీళ్లలో ఈత పిల్లలకి రాదు. నాకు బాగా గుర్తు. నేను హైస్కూలులో ఉండగా, రోజూ కాలువలో సాయంత్రం నలుగురైదుగురు పిల్లలం కలిసి ఈత కొట్టేవాళ్లం. హైస్కూల్ పిల్లలకి కాలువలు, చెరువులు కాలుష్యమయం ఎందుకు అవుతున్నాయి? అలా కావటం వల్ల మానవులకు కలిగే ఇబ్బందులు, నష్టాలు ఏమిటో లుసుకుంటే జీవితాంతం గుర్తు ఉంటాయి. ఎప్పుడైనా వెళ్లి చూడకుండా కేవలం పుస్తకాలలో పాఠాలు కంఠస్తం చేస్తే ప్రయోజనం ఉండదు కదా! సాంఘిక శాస్త్రం, ఆరోగ్యం, వాతావరణ మార్పులను, చుట్టుపక్కల, పరిసరాల్లో జరుగుతున్న విషయాలు కూడా విద్యార్ధులకు తెలియచేయాలి.

ఈ విషయాన్ని పెద్దలు గ్రహించినట్లు, శ్రద్ధ తీసుకున్నట్లు కనపడదు. సచివాలయం, పంచాయతీ ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. నిర్దిష్ట కార్యక్రమం అమలు పరచాలి.

విద్యార్థి దశ నుంచే ప్రకృతి, వాతావరణంలో జరుగుతున్న మార్పులను గురించి అవగాహన ఉండాలి. ఇది జీవన విధానాలు, అలవాట్లతో ఏవిధంగా ముడిపడిందని కూడా తెలియాలి.

వయోజన తరగతులు మళ్ళీ అవసరం

మా ఊరిలో చాలామంది యువకులు ఖాళీగా వుండడం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. వాళ్ళలో నలుగురైదుగురు కలసి పెద్దలకు చదవటం నేర్పే కార్యక్రమాన్ని చేపట్టవచ్చు. గ్రామాల్లో చాలామందికి కొన్నిచోట్ల సగం మందికి పైగా చదవటం రాదు. చదవలేరు. వాళ్ళకి వారంలో ఒకటి రెండుసార్లు ఏదో ఒక వేళలో ఆ చుట్టుపక్కల వున్న వాళ్ళకి చదవటం నేర్పితే గ్రామంలో మంచి మార్పుకి నాంది అవుతుంది. 10 తరగతులతో పెద్దలకు చదవటం నేర్పవచ్చు. ఇదంతా ఒక సంవత్సరంలోపు చేయవచ్చు. డ్వాక్రాలో సభ్యులుగా వున్న 30 మంది మహిళల పరిస్థితి కూడా అంతే. సంతకం మాత్రం కష్టంగా చేయగలరు. చాలా మంది బ్యాంకు పుస్తకం చదవలేరు. లెక్కలు రావు. కొంత మంది రైతుల విషయంలో కూడా అంతే.

సగం మంది కూలి చేసుకునే వాళ్ళకు కూడా. మరి అట్లాగే పాలకేంద్రంలో పాలు పోసేవాళ్ళు, సహకార సంఘంలో సభ్యులకు చదవడం రాదు. ఈ వయోజన విద్య కార్యక్రమం చేపడితే గ్రామాలకి ఒక ఆదర్శ కార్యక్రమం అవుతుంది. కొద్దో గొప్పో చదువుకున్న పిల్లలు, యువకులు ఈ కార్యక్రమాన్ని కలసి చేపట్టాలి. ప్రతి ఊరిలో చదువురాని, చదవలేని వాళ్ళు వుండకూడదు. రెండు సంవత్సరాలలోపే. ఇది సాధ్యం కావాలి. ఊరిలో ఇంకా చదవలేని వాళ్ళు 2023 లోనూ ఉండటం సిగ్గుపడే విషయం కాదా!

3 పేరులో ఏముంది?

పూర్వం పిల్లలకి పేరు పెట్టడం ఒక అట్టహాస కార్యక్రమం. నలుగురిని సంప్రదించటం, పుట్టిన సమయాన్ని బట్టి, తాత నాయనమ్మల వంటి పెద్దల గుర్తుగా పేరు పెట్టేవారు. పేరు గుర్తింపు, గుర్తుకే కాదు గర్వ కారణం కూడా. వ్యక్తిత్వం ప్రతిబింబించే విధంగా పేరుపెట్టేవారు. పేరు స్ఫూర్తి కోసం, ఆదర్శంగా పెరగడానికి, ఒక ప్రత్యేకత కోసం తాతల పెద్దరికానికి, వారసత్వానికి గుర్తుగా కూడా.



ప్రోత్సాహం అనేక విధాలుగా

మరి ఇప్పుడు పిల్లలకు పేరు ఎందుకు పెడతారు. అంటే ఏమిటి, ఎవరు పెట్టారో కూడా చాలామందికి తెలియదు. 12 సంవత్సరాలు దాటిన 7 నుండి 10 తరగతుల వాళ్ళలో వాళ్ల అసలు పేరు, దాని అర్థం తెలియని వాళ్లే ఎక్కువ. శివాజీ అంటే చత్రపతి శివాజీ లాగా ఒక వీరవంతుడు. ఒకప్పుడు దేశనాయకులు, ప్రముఖుల పేర్లు పిల్లలకు పెట్టేవారు.

అంతటి నాయకుల గొప్ప సేవా భావం కలుగుతుందని, అయితే ఇప్పుడు పెట్టే పేర్లు వేరు. వాటి అర్థం పెట్టిన వాళ్ళకి కూడా తెలియదు. ఫ్యాషన్ కోసం, మెప్పుదల కోసం పేర్లు ఎక్కువ. అక్కడక్కడ పిల్లలు వాళ్ల పేర్లు వాళ్లే నిర్ణయించుకుని స్కూలు రిజిస్టర్లలో వచ్చేటట్లుగా చూసుకుంటు ఉన్నారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు మార్చేవాళ్ళు కొంతమంది. పేరులోనే ఉంది ఉనికి అని గ్రహించాలి. మంచి పనులు చేయడానికి ఆదర్శ వంతమైన జీవితానికి సంపద సృష్టికి, కృషికి కూడా అనే విధంగా పేర్లు ఉండవచ్చుగా.

మా ఊరిలోనే కాదు నేను గమనించింది పిల్లల అహంకార ధోరణి, ధిక్కార భావాలు కొట్టొచ్చినట్లుగా ఉండటం. ఇది ఏ వర్గం, ఉన్నవాళ్ళా, లేని వాళ్ళా అనేదానికి సంబంధం లేకుండా. తల్లిదండ్రులు ఈ విషయంలో తెలిసీ తెలియనట్లుగా ఉంటున్నారు. చిన్న వయసులో అట్లాంటి ఆలోచనలని సరి చేయకపోతే వచ్చే అనర్థాలు అనేకం. తెలియకుండా వచ్చేస్తాయి.

అహంకార భావం వినాశనానికి నాంది. అన్నీ నాకు తెలుసు అనే భావన కూడా అహంకారమే కదా. దీన్ని ఎవ్వరిగొయ్యి వాళ్ళు తవ్వు కున్నట్టు చెప్పవచ్చు. సరైన సందర్భంలో సరిగా చేయకపోతే ఎట్లా ఎవరు చేస్తారు? పిల్లలు ఈ విషయం గ్రహించే సరికి అవకాశాలు జారవిడుచు కున్నట్టేగా.



జీవిత చరిత్రల గురించి చెప్పుకొనటం

శతకాలు, జీవిత చరిత్రలు చదవటం వల్ల అట్లాంటి అరిష్టాల గోతుల్లో పడకుండా ఎవరికి వాళ్ళు కాపాడుకోవచ్చు. స్నేహితులతో కలిసి మెలిసి చర్చించుకుంటం వల్ల కూడా అహంకార ధోరణి నుంచి రక్షించుకోవచ్చు.

అహంకారం, గర్వానికి మధ్య తేడా తెలుసుకోవాలి. గర్వం నేను ఫలానా వాళ్ళ అమ్మాయినో, అబ్బాయినో అనో, ఫలానాగ్రామం అనో, స్కూలు అనో గర్వం ఉండవచ్చు. అయితే అహంకారం పతనానికి తెలియకుండా నాంది అవుతుంది. ఇది ఎంత త్వరగా తెలుసుకుంటే తెలియచెప్తే అంత మంచిది. నాయనమ్మ, అమ్మమ్మ కథలతో పిల్లలు అట్లాంటి ధోరణుల నుంచి జాగ్రత్త పడవచ్చు. పేరు ప్రభావం అదే.

పిల్లల పుట్టిన రోజు మాత్రం అట్టహాసంగా చాలా ఇళ్లలో జరిగే కార్యక్రమం. గ్రామాల్లో కూడా కేక్ కట్ చేయటం, క్యాండిల్ ఆర్పటం. ఇంటింటా పండగలాగా పదిమంది పిల్లలతో కలిసి ప్రతి సంవత్సరం కార్యక్రమం అలవాటు అయింది. అయితే దీని బదులు పిల్లలచేత చెట్లు నాటించడం, చుట్టుపక్కల ఎవరికైనా సహాయం చేయించటం, మంచి పుస్తకాలు ఇవ్వడం, పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం లాంటి కార్యక్రమాలే గాక ఆ సంవత్సరంలో ఏమి ప్రత్యేకంగా చేయదల్చుకుందీ తెలియజేయటం గర్వంగా చెప్పుకునే విధంగా ఇందులో భాగం కావాలి.

వ్యక్తిత్వం అంటే ఏమిటి? ఎట్లా వస్తుంది?

పిల్లల్లో వ్యక్తిత్వం ఏమిటి అనుకోవడం సహజం. అయితే వ్యక్తిత్వ లక్షణాలు 4 నుంచి 6 సంవత్సరాల నుంచే కనబడతాయి. చాలామంది విషయంలో అయితే లక్షణాలు 7– 9 సంవత్సరాల తర్వాత గాని మొదలవ్వవు. 10 నుంచి 14 సంవత్సరాలకు వ్యక్తిత్వం వికసిస్తుంది. ప్రస్ఫుటం కావడానికి, గ్రహించటాన్ని బట్టి. వ్యక్తిత్వం అంటే ఏమిటి? ఎట్లా వస్తుంది? ఏ విధంగా వ్యక్తపరచబడుతుంది? ప్రవర్తన ఆలోచనలు వ్యక్తపరచడం, చూపించే విధానంలోనే వుంది. ఈ విషయాలన్నీ ముందు తెలిస్తే నియంత్రించుకోవచ్చు.

వ్యక్తిత్వానికి మూలం. చిన్నప్పటినుంచీ వచ్చేఅలవాట్లు. సమయ పాలన, సహనం, సహకరించటం, సంతృప్తి, సంతోషం, సర్దుకుపోవటం, స్నేహశీలత, నమ్మకం, బాధ్యతాభావన ఇవన్నీ ఏదో ఒక రూపంలో కనపడటంలోనే వుంది వ్యక్తిత్వ వికాసం.

ప్రతిదానికి అమ్మ, నాన్న, ఇంకెవరి మీదో ఆధారపడడం మాన్పించాలి. ఇవే క్రమశిక్షణకి మూలాలు. బాధ్యత, భావన ఉందా, వచ్చిందా, నియమాలు, నిబంధనలతో '**నాకు తెలుసులే**' అనేది నిర్లక్ష్య ధోరణి. అహంకారం, అసూయ ధోరణులను గ్రహించాలి. ఎవరిని వాళ్ళు నియంత్రించుకోవటం ముఖ్యమైనది.



చెప్పేవాళ్ళుంటే...
నేర్చుకునేవాళ్ళు చాలా మంది...

వివేకం, వినయం మంచి లక్షణాలు. కృతజ్ఞతా భావన, క్షమాగుణం **'తెలివితేటలకి'** ముఖ్యం. ఈ గుణాలను గ్రహించినప్పుడు ఆలోచనలని బహిర్గతం చేయకల్గాలి. ఈ గుణాలు పిల్లలుగా వున్నప్పుడే మొదలవ్వాలి.

అయితే ఈ లక్షణాలు ఎవరో ఒకరు పురికొల్పి, ప్రోత్సహించినప్పుడే బహిర్గతం అవుతాయి. వీటిని అభివృద్ధి చేసినప్పుడే స్కిల్ డెవలప్మెంట్, నైపుణ్యత వచ్చేది. అప్పుడే వ్యక్తిత్వం ఇతరులకు ఆదర్శం కూడా అయ్యేది. వ్యక్తిత్వం నుంచే ఖ్యాతి, కీర్తికి అవకాశాలు. కాబట్టి వ్యక్తిత్వానికి క్రమశిక్షణ ముఖ్యం. పిల్లల అంగ బలహీనతలు, మానసికత సరిగ్గా లేకపోవడం లాంటి వాటిలో కుంగిపోరాదు. దృఢ నిశ్చయతకు ఇవీవే అడ్డుకాకూడదు.



కలసి మెలసి ఆడుకుంటాం...

రోటరీ వాళ్ళు అప్పుడప్పుడు క్యాంపు ద్వారా పిల్లల వినికిడి దృష్టి పరీక్షించి చర్యలు తీసుకోవడం జరిగింది. ఇంకా ఇట్లాంటి వైద్య పరీక్ష లేక మానసిక వికాస పరీక్షలు కూడా అవసరం వ్యక్తపరచలేని వాళ్ళు, సరిగా రాయలేని వాళ్ళు చాలామంది గ్రామంలో వున్నారు. వాళ్లకి ప్రత్యేక క్లాసులు అవసరం.

అలాగే ప్రత్యేక నేర్పువున్న ఉన్న పిల్లలు చాలామంది ఉన్నారు. బొమ్మలు వేయగలవారు, పాటలు పాడగలవారు, నటనలో కూడా ప్రకృతిని గురించి చెప్పగలవారు. ఈ అభిరుచులను గమనించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే గ్రామానికి ప్రత్యేకత వచ్చే అవకాశాలు ఎన్నో. ఇది గ్రామపెద్దలు ఎవరో ఒకరు శ్రద్ధ తీసుకుంటే గాని సాధ్యమవ్వదు.

వ్యక్తిత్వానికి మూలం... రుచి!

'**రుచి**' అంతా తిన్న దానిదేనా? కానే కాదు. నాలుకది కూడా కాదు. మరి? అలవాటుదే ఎక్కువ. ఆ అలవాటు ఎప్పటి నుంచి, ఎక్కడి నుంచి, ఎవ్వరి దగ్గర నుంచి వస్తుంది, వచ్చింది అనే దానిని బట్టి రుచి ఏర్పడుతుంది, అలవడుతుంది. దీనిని ఎంత త్వరగా తెలుసుకొని ఆచరణలో పెట్టుకోగల్గితే అంత మంచిది.

రుచిని బట్టే తిండి అలవాట్లు ఉంటాయి. తిండి అలవాట్లను బట్టే కదా ఆరోగ్యం. ఆరోగ్యమంటే మానసిక స్థితిగతులను బట్టి వచ్చే ప్రత్యేకత, వ్యక్తిత్వం కూడా.

ప్రత్యేకతే గదా, వ్యక్తిత్వం అంటే. వ్యక్తిత్వం ఎక్కడ నుంచి మొదలు అవుతుంది? నాలుక, రుచి. మరి రుచిని నిగ్రహించుకోకల్గితేనే కదా క్రమశిక్షణ మొదలయ్యేది.

ఇది ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిన విషయం. స్వతహాగా తీసుకోవచ్చు, తెలుసుకోవచ్చు, చూడవచ్చు. చదవవచ్చు ఏదో రూపంలో గ్రహించడం ముఖ్యం.

ఎంత ముందుగా చిన్నతనంలో ఈ విషయాన్ని గ్రహించగలిగితే అంత ఉపయోగం. తల్లిదండ్రులు ఈ విషయం చెప్పకుండానే పిల్లలు తెలుసుకునే విధంగా వుండాలి.

రుచికి మూలం ఆహార నియమాలను పాటించక పోవడం. ఎంత రుచికరమైనదైనా మితంగా తినగలిగితే ఆరోగ్యాన్ని నియంత్రించుకో గలుగుతారు అయితే ఆ అవగాహన చిన్నప్పటి నుంచి వుండాలి, వచ్చినప్పుడే ఉపయోగం. మితంగా తినటం, వేళకు తినటం, నీరు తాగడం లోనే ఉంది ఆరోగ్యం. అది రహస్యం ఏమీ కాదు, చాలామందికి తెలుసు. అయితే రుచి అనే అలవాటులో పడి అవన్నీ మర్చిపోయి తినటం, తాగటం జరుగుతోంది.

ఇదంతా ఎప్పుడు, ఏ వయసులో? 10 సంవత్సరాల ప్రాంతంలోనే ఈ రుచి, ఆకలి అలవాట్లను గురించి తెలుసుకోవాలి. నియంత్రించుకోవాలి 15 సంవత్సరాల కల్లా. ఏమి తిన్నా మితంగా తినటం, రోజూ ఒకే సమయానికి తినటం అలవాటు చేసుకోవాలి. పొట్ట పెరగకుండా చూసుకోవాలి కూడా. ఇది తల్లిదండ్రుల బాధ్యత. పిల్లలు కూడా వాళ్ళంతట వాళ్లే అలవాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నప్పటి చెడ్డఅలవాట్లు, అశ్రద్ధలే కొంపలు ముంచుతాయి. పెద్దయినతర్వాత. ఇదంతా క్రమశిక్షణలో భాగం. సమయ పాలన, క్రమశిక్షణ తర్వాత అతి ముఖ్యమైనవి రుచి, శుచి, శుభ్రతలు.



ఇవా యూత్ కార్యక్రమాలు!!

ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ఎంతోమందికి గ్రామాల్లో ప్రవేశ పెట్టారు, పెడుతున్నారు. అయితే పిల్లల వ్యక్తిత్వ అభివృద్ధికి ఏమైనా ఉన్నాయా? అమ్మ ఒడి, మధ్యాహ్నభోజనం, పుస్తకాలు, సైకిళ్ళు, టాబ్స్ లాంటివి ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న నాయకుల ప్రణాళికలే. గ్రామంలో ప్రత్యేకంగా పిల్లల కోసం అంటూ ఒక వ్యవస్థ, సంస్థ లేవు. ఏర్పరచాలనే ఆలోచన కూడా కనపడదు. కనీసం ఒక పిల్లల పార్కు, గ్రంథాలయం, ఏదైనా లేబరేటరీ పెట్టవచ్చు. గ్రామాల్లో దాతలు కూడా పిల్లల విషయంలో ఆలోచించినట్లు లేదు. విగ్రహాలు, వినోదాలు, రాజకీయాలు సంబంధించినవే అన్నీ. ఒక సంగీతం టీచరో, డాన్స్ టీచరో, డ్రిల్ టీచరో లేక పిల్లలకు హాబీ పెంచే కార్యక్రమాలు లేనే లేవు. యువజన సంఘాలు మా ఊరిలో నాలుగు ఉన్నాయి అంటే ఆశ్చర్య పడాల్సిందే. మరి మహిళా మండలి లాంటివి కూడా ప్రస్తుతం మా ఊరిలో లేవు. కొన్ని సంవత్సరాల కిందట మా ఊరిలో మహిళా మండలి కోసం కట్టిన భవనాన్ని ప్రభుత్వం ఉపయోగించు కుంటుంది.



గ్రామంలో ఉన్న ఏ స్కూలులో కూడా పిల్లల కోసం ఏ ఏర్పాట్లూ లేవు. పిల్లలచేత గ్రామంలో శ్రమదానం, యోగా, పరుగు కార్యక్రమాలు లాంటివి కూడా వినలేదు.

అవి నా చిన్నప్పుడు వుండేవి. గ్రామపంచాయతీ, మండలి పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. జీవితచరిత్రల గ్రంథాలయంలో ఒక సంవత్సరం నుంచి పిల్లల్ని ఆకర్షించే పసందైన కార్యక్రమాలు ఆట, పాట, వినోద, విజ్ఞాన కార్యక్రమాలు కొద్దిగా మొదలయ్యాయి. ఇంకా తల్లిదండ్రులు గ్రహించినట్లు లేదు.

పిల్లలని, విద్యని పార్టీ రాజకీయాలకు ఎంత దూరంగా పెట్టగల్గితే అంత మంచిది. భవిష్యత్తుకి కావలసింది నాయకత్వ స్ఫూర్తిగాని, నాయకుల పార్టీ పోరు, పార్టీ రాజకీయం కాదు. పార్టీలు వ్యక్తిగత తగాదాలను అసలే తీసుకురాకూడదు. పిల్లలని ఉపయోగించకూడదు. మరి అట్లా చేస్తున్నవాళ్ళు. అనర్హులు కావాలి. చదువు సంధ్య లేని వారిని పాఠశాల వ్యవహారంలోకి దించకూడదు. గ్రామంలో అర్హత, ఉత్సాహం గలవాళ్లు లేకపోలేదు. అట్లాగే ఉపాధ్యాయులు కూడా. మా ఊరికి ఈ విషయంలో మంచి చరిత్ర ఉంది. ఇప్పుడు కూడా చాలామంది ఉపాధ్యాయులను ప్రశంసించాలి. గ్రామ సమస్యలను పార్టీలకు ఎంతదూరంగా ఉంచగలిగితే ఆ వ్యవస్థ కార్యక్రమాలకి అంత మంచిది. వ్యక్తిగతంగా పార్టీ ప్రమేయం ఉన్నా అది విచక్షణకి కారణం కారాదు. ఇది ఎందుకు ప్రత్యేకించి చెబుతున్నానంటే ఆ ప్రమాదం పొంచి ఉన్నట్లు కనబడుతోంది. మా ఊరిలో సంకేతాలు ఉంటే ఇతర గ్రామాల్లో ఇంకా ఎక్కువ అని గ్రహించాల్సి ఉంటుంది. కాపాడు కొనగలిగితే భవిష్యత్తు బాగా ఉంటుందనేది గ్రహించాలి. అది అసాధ్యం అనుకుంటే అంతే సంగతులు. పార్టీ కార్యకర్తలు విద్య, పిల్లల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం, వేలు పెట్టటం అవివేకం, దూరదృష్టి లేకపోవడమే.

మాటలే రేపటి మూటలు

వ్యక్తిత్వం పిల్లలు మాట్లాడే మాటల ద్వారానే బహిర్గతం అవుతుంది. మాట్లాడే భాష, ఉచ్చారణ, పదశైలి, వాక్య నిర్మాణం మీదే పిల్లల భవిష్యత్ ఉంటుంది. అయితే పిల్లల్లో భాష మాట్లాడే తీరుని గురించి చిన్నప్పటి నుంచి చెప్పి సాధ్యమైనంత వరకు సరి చేయాలి. ఎవరో ఒకరు నేర్పించ గలిగితే ఇంకా మంచిది. చిన్న వయస్సులో ఈ విషయాలు ఆషామాషిగా కనపడవచ్చు. చర్చా కార్యక్రమాలు, చర్చలు, బిగ్గరగా చదవడం లాంటి అలవాట్లు చిన్నప్పటి నుంచి కలగజేయాలి. ఎవరికి వాళ్ళు తెలుసుకునే విధంగా తెలియజెప్పాలి. మరి స్కూల్లో కూడా అధ్యాపకులు ఈ విషయాల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సినిమాలో వివిధ పాత్రలుఏ విధంగా మాట్లాడతారో గ్రహించాలి. ఎన్నో ఉదాహరణలు పిల్లలకి తెలియ జేయవచ్చు.



కొట్టు దగ్గర కొనుక్కుందాం

ఈ విషయంలో పిల్లలు కొంత చొరవ తీసుకోవచ్చు. శ్రమదానంగా చెరువులు, కాలువలని శుభ్రపరిచే పనులు ఒక్కసారైనా చేయవచ్చు. హైస్కూలు ద్వారా అట్లాంటి కార్యక్రమాలు అప్పుడప్పుడు ప్రయత్నించాలి.

మా ఊరి పాలకేంద్రంలో 20 గ్రామాలకు పైగా ఊళ్ళ నుంచి పాలు ప్రతిరోజు తీసుకువచ్చి వాటిని ఇక్కడ శీతల కేంద్రంలో పరీక్షించి పంపుతారు. గ్రామంలో కొంతమంది పిల్లలు రోజూ పాలకేంద్రంలో పాలు పోస్తారు. అయితే వాటిని ఆ తర్వాత ఏమి చేస్తారు అని తెలియదు. 4 నుంచి 7 తరగతి పిల్లలని ఇక్కడికి తీసుకువెళ్లి ఆ యంత్రాల ద్వారా జరిగే పరిశుద్ధత గురించి తెలియజేయవచ్చు. అట్లాగే ఊళ్లోనే ఉన్న గానుగ ద్వారా నూనె ఎట్లా తీస్తారో చూపించవచ్చు.

ఈ ఆశ వర్కర్స్‌కు స్కూళ్ళ దగ్గరలో ఉన్న దుకాణాలలో, బండ్ల మీద, ఉండే హానికరమైన తినేవి, తాగేవి అమ్మకుండా నిషేధించే అధికారాలు ఉన్నాయి. అయితే అవి చెప్పటం వరకే. గ్రామస్తులు సహకరిస్తేనే అవి అమలు చేయగలరు కదా!



సాంస్కృతిక కార్యక్రమాలే భవిష్యత్‌కి బాట...

పిల్లలు కొంత ధన సహాయం (5, 10 రూపాయలు అయినా) ఇంకొకళ్ళ పిల్లలకి సహాయం చేసే అలవాటు ప్రయత్నించాలి. ఒక పుస్తకం బహుమతిగా ఇవ్వటం అన్నిటికన్నా మంచి ఆలోచన, అలవాటు.

పిల్లల చేత (బుక్ బ్యాంక్) పుస్తక బ్యాంకు ఒక ప్రయోగంగా బ్యాంకు పిల్లలు కలిసి చేయవచ్చు. ఎవరో ఒకరు చొరవ తీసుకొని ప్రయత్నం చేయవచ్చు. పిల్లలు దాచుకోవడానికి **"కిడ్డీ బ్యాంకు"** కొద్ది మంది పిల్లల దగ్గరే వుంది. ఆడపిల్లల్లో దాచుకునే ఆలోచన, అలవాటు ఉంది. గ్రామాల్లో ఈ కిడ్డీ బ్యాంకును ఉపయోగించి పొదుపు నేర్పాలి.

కాలాన్ని జయించగలమా?

దేనికైనా విలువ కాలాన్ని బట్టే అని ఎంతోమందికి అవగాహన వుంది. కాని ఎంతమందికి అసలు రహస్యం కాలాన్ని జయించడంలోనే వుందని తెలుసు? అసలు కాలం, సమయం, అవగాహన లేకపోతే జీవితంలో ఏమి సాధించగలరు? ఈ సత్యాన్ని నిత్యజీవితంలో ఎంతమంది గ్రహిస్తారు. చిన్నప్పటి నుంచే ఈ విషయం తెలిస్తే పిల్లలు పిడుగులవుతారు, సమర్థులు అవుతారు.



పిల్లలు ఏకమైతే కొత్త ప్రపంచం ...

ఈ కాలం అవగాహన ఎక్కడ నుంచి వస్తుంది? ఇప్పుడు చాలా మంది చేతి గడియారాలు, మొబైలు ఫోనులున్నాయి.

ఎక్కువ మందికి సమయం ఎట్లా ఉపయోగించుకోవాలో తెలియాలి. అయినా దినచర్యని గురించి చిన్నతనం నుంచే కొంతైనా గ్రహింపు ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చు. అప్పుడే ఆలోచనా విధానం మారుతుంది, ఏదైనా చేయగల్గుతారు. తల్లిదండ్రులకు ఈ విషయం ముందు తెలియాలి, గ్రహింపు వుండాలి, పిల్లలు పాటించేలాగా చూడాలి.

మా ఊరిలో ఏడవ తరగతి విద్యార్థులందరికీ క్లాసులో సమయం విలువని గురించి చర్చించి, వాళ్లని వాళ్ల దినచర్య ఏదో ఒక రోజుకి వ్రాయమనడం జరిగింది నవంబరు 2022లో. ఆడ, మగ పిల్లలు దినచర్య రాయడానికి సిద్ధమయ్యారు. రెండు, మూడు రోజులు సమయం తీసుకున్నారు. కానీ వారం తర్వాత కూడా ఒక్కరూ రాయలేదు, కనీసం ప్రయత్నించినట్లు కూడా కనబడలేదు. వాళ్లకి ఆ తర్వాత వాళ్ల అమ్మ దినచర్యని గురించి వ్రాయాలని చెప్పడం జరిగింది. అమ్మ దినచర్యని గురించి కొంత అవగాహన లేకపోతే, ఇక వాళ్ల భవిష్యత్‌లో ఎంతవరకు చేయగలరు.

కాలం ప్రాముఖ్యత తెలిసినప్పుడేగా బరువు, బాధ్యతలు తెలిసేది. ఇది చిన్నప్పటి నుంచి అలవాటు అయితే వ్యక్తిత్వం వికసిస్తుంది కూడా. దినచర్య రాయటం అనే ప్రక్రియ ప్రాముఖ్యతను అందరూ గ్రహించాలి.

ఎవరికి వాళ్లు చిన్న వయస్సులో తమ దైనందిన కార్యక్రమాల గురించి తేల్చుకోగలిగితే, ఆలోచనలు పుట్టడం మొదలవుతుంది. అంతర్గతంగా అప్పుడే (introspection) ఆత్మ పరిశీలన మొదలు అవుతుంది. ఇది ఎంతమంది గ్రహించారు. మరెందుకని ఆ ప్రయోగాన్ని 7 నుండి 12 సంవత్సరాలలో ప్రయత్నించటం లేదు. రోజులో ఎక్కువ సమయం దేనికి ఉపయోగిస్తున్నారో, అది ఎంత వరకు సమంజసం? ఏ విధంగా మార్పు చేసుకోవచ్చు?

దీనికెంత సమయం పడుతుందో తెలుసుకోవడంలోంచి ఎన్నో కొత్త ఆలోచనలు స్వతహాగా రావడానికి అవకాశం వుంటుంది. సరిదిద్దుకోవడం లోనే వుంది భవిష్యత్‌కి బాట.

ఈ ప్రక్రియ ఎంత చిన్న వయస్సులో మొదలైతే అంత మార్పుకి, వ్యక్తిత్వ వికాసానికి కారణం అవుతుంది. బాధ్యతాభావం కూడా సహజం అవుతుంది. రోజులో 24 గంటలు ఎట్లా వినియోగించుకున్నాము అని స్వయంగా తెలుసుకోవడానికి అదే పునాది. రోజుకి 24 గంటలు సరిపడడం లేదని ఎంత మంది యువకులు అనుకుంటారు?

పోటీ ప్రపంచమే కాని

అయితే, పిల్లలు ఎవరికి వాళ్ళు తమతోనే పోటీ పడాలి, ఇతరులతో కాదు. ఇంతకు ముందు కన్నా బాగా చేయాలి. తప్పులు దిద్దుకోవాలి అనే కుతూహలం ఉండాలి. ఎవ్వరి తప్పులు వాళ్ళు తెలుసుకుని, దిద్దుకోవటం లోనే అసలు రహస్యం ఉన్నది. అంటే ఎవరికి వాళ్ళు ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవటం నేర్చుకోవాలి. అది గొప్ప సామర్థ్యాన్ని ఇస్తుంది. ప్రకృతి నుంచి నేర్చుకోగల్గితే ఎన్నో విజయాలకి మూలం అవుతుంది కూడా.



కలిసి ఆడుకుంటాం, నేర్చుకుంటాం

ఇట్లాంటి ఆలోచనలనే ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు గుర్తు చేస్తూ ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలని ప్రతి విషయంలో పక్కింటి పిల్లలతో ప్రతిసారి పోల్చటం మానాలి. ఎవ్వరి కృషి వాళ్ళదే. ఎవరి శక్తి సామర్థ్యాలు వారివే. వైఫల్యాలని ఎదుర్కొనటంలోనే ఉంది భవిష్యత్. పిల్లలను చిన్నప్పటి నుంచి నిరుత్సాహాలకు సర్దుబాటు చేసుకోవటం నేర్పాలి. వాటి నుంచి నేర్చుకోవలసిన విషయాలు గ్రహించటం పెద్దలు చెప్పి, ఆచిరిస్తుంటే పిల్లలు గ్రహిస్తారు. వైఫల్యాలు, నిరుత్సాహం సహజం. వాటిని ఎదుర్కొనటానికి ఓర్పు, నేర్పు, చొరవ ఏ విధంగా ఉపయోగపడతాయో పిల్లలకి తెలియజేయాలి.



ఆట, పాట
కార్యక్రమాల్లో
ప్రతిభ చూపిన
పిల్లలు

కొన్ని సమస్యలు తెలిసో, తెలియకుండానే వస్తుంటాయి. వాటిని ఆలోచనతో పరిష్కరించుకోవాలి. ఆలోచనే విజయానికి నాంది. స్ఫూర్తి ఆలోచనకి మూలం. ఆలోచన గురించి మిత్రులతో సంప్రదించవచ్చు. మహానుభావుల, ప్రముఖుల జీవిత చరిత్రల ద్వారా తెల్సుకోవచ్చు.

ప్రతి విషయం మీద సమస్యకి ఆలోచన అవసరం. మంచి చెడ్డల నిర్ణయాల ప్రభావం గురించి తెలుసుకుంటే భవిష్యత్ రూపు రేఖలు మారతాయి.

స్ఫూర్తి – ప్రేరణ

స్ఫూర్తి భవిష్యత్ ఆలోచనలకి మూలం. ప్రేరణకి కూడా స్ఫూర్తి కారణం. పిల్లలకు స్ఫూర్తి, ప్రేరణ ఎక్కడ నుంచి ఎట్లా వస్తాయి? ఇది ముందుగా కుటుంబంలో ఎవ్వరో ఒకరి ద్వారా జరుగుతుంది. తల్లి ముందుగా, ఆ తర్వాత తండ్రి, అక్కచెల్లెళ్లు, అమ్మమ్మ, నాయనమ్మ, తాతలు, సన్నిహిత బంధువులు ఎవరైనా కావచ్చు. ఆ తర్వాతే స్నేహితులు, చూసేవి, చదివేవాటి ద్వారా కూడా. అయితే పిల్లలు ఎంత త్వరగా, స్వతహాగా ఆలోచన మొదలుపెడతారో అంత త్వరగా వ్యక్తిత్వాన్ని వ్యక్తపరచగలరు. ఉపాధ్యాయులు, పాఠశాలలు కూడా స్ఫూర్తికి, ప్రేరణకి ఆలోచనే కారణం. అందరికీ అది ఒకే స్థాయిలో వుండదు.



నేర్చుకుంటాం.
మెరుగు
అవుతాం.

పిల్లలతో మెలిగే విధానం, పిల్లలు ఏమి చూస్తున్నారు, వింటున్నారు అనే ధ్యాస పెద్దలకు అవసరం. పిల్లలు ఎక్కువ అనుకరణ చేస్తారు. అయితే ఆ తర్వాత ఎట్లాంటి ఆలోచనలు చేస్తారు. ప్రలోభాలకు లోనౌతారా అనే దాని మీద ధ్యాసవుంచాలి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి ప్రతి విద్యార్థి విషయంలో ఆలోచించ కల్గితే పిల్లలని తీర్చిదిద్దటంలోఎంతో మార్పు తీసుకురావచ్చు. అయితే అట్లాంటి అలవాటు మా ఊరిలో తక్కువ అనిపిస్తుంది. శ్రద్ధ, సహకారాలు కూడా అంతే. సంవత్సరంలో ఒకసారి కూడా పాఠశాల కమిటీ సమావేశం జరుగుతున్నదో! లేదో! స్కూలు కమిటీ ఎప్పటి నుంచో వున్నా దాని ప్రభావం కనబడకపోగా ఈ మధ్య కమిటీ రాజకీయ ప్రభావాలకు లోనైంది.

స్కూలు టీచరమ్మ మీద (అది పబ్లిక్ స్కూలు అయినా, ప్రయివేటు స్కూలు అయినా) బాధ్యత వదిలేస్తే పెద్ద మార్పు రాదు. విద్యార్థి ప్రత్యేక శ్రద్ధవల్లే వచ్చే అవకాశం వుంది. ఇది జీవితచరిత్రలు చదవడం ద్వారా సాధ్యం అని తెలియజేసే ఉదాహరణలు ఎన్నో. ఎంతో మంది ఉన్నత స్థానంలోకి వెళ్లినవాళ్లు చెప్పిన, రాసిన విషయాలు, అనుభవాలను స్కూలు పుస్తకాలతో పాటు చదవాలి. జీవితచరిత్రలు హైస్కూలు నుంచి వెళ్లే ముందు చదివే సౌకర్యాలు, అవకాశాలు కలుగచేయాలి. అట్లాగే శతకాలు చదివి అర్థం చేసుకోగలిగితే ఆలోచనా విధానంలో మార్పుకి అవకాశాలు వున్నాయి. ఇది నేను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి దగ్గర నుంచి 1960 డిసెంబరులో తెలుసుకున్నా. శతకాలు ఎన్నో తెలుగులో ఉన్నాయి. సుమతీ శతకం, వేమన శతకం, ఇంకా ఎన్నో శతకాలు నా చిన్నతనంలో, ఇప్పుడు

కూడా వున్నాయి. అయితే ఇవి పెద్దవాళ్లకి మాత్రమే పరిమితం కాకుండా పిల్లల ప్రాథమిక విద్యనుంచే తెలుసుకుంటే ఆలోచనా విధానంలో మార్పుకి అవకాశాలు ఎక్కువ. పుస్తక ప్రపంచం అంతులేనిది. ఎంతోమంది దృక్పథాలను మార్చింది, భవిష్యత్‌ని తీర్చిదిద్దినది పుస్తక ప్రపంచమే. అదే స్ఫూర్తి, ప్రేరణకు మూలం.

పిల్లల వినోదం



నేను స్థాపించిన బ్రెడ్ (BREAD) సంస్థ అదే ఎన్నో సంవత్సరాలుగా చేస్తోంది. ఇప్పటికి 1800 పాఠశాలల్లో గ్రంథాలయాలు పెట్టారు.

జీవితాన్ని జయించి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఎంతో మంది జీవితచరిత్రల నుంచి తెలిసేదేమిటంటే వాళ్ళు చిన్నప్పుడు చదువులో పొందిన మార్కులు, గ్రేడులు కన్నా, జీవితచరిత్రల నుంచి స్ఫూర్తి పొంది కష్టాలన్నీ ఎదుర్కోవడం ద్వారా అనుభవాలే వాళ్ళ భవిష్యత్తుకు సహకరించాయి.

ఈ విషయంలో ఎన్నో చోట్ల జీవితాన్ని జయించిన వాళ్లు రాయటం, చెప్పటం జరిగింది. ఎందుకని వాళ్ళ అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇంకా పాతపద్ధతులు, ఆలోచన ధోరణుల్లో మార్పులు స్కూలు నుంచి రావాలి. ముఖ్యంగా 12 నుంచి 18 సంవత్సరాల పిల్లల విషయంలో ఇది గ్రహిస్తే గ్రామంలో అవకాశాలు పెరుగుతాయి. కనీసం కొంత మంది విజయానికి సహాయపడినట్లు అవుతుంది. అదే మా ఊరి జీవిత చరిత్రల గ్రంథాలయ స్థాపన లక్ష్యం.

సుభాష్ చంద్రబోస్ 100 సంవత్సరాల క్రిందట స్ఫూర్తి పిలుపు గుర్తు వస్తుంది. అదే: *"నువ్వు నాకు నెత్తురు ఇవ్వు, నేను దేశానికి స్వాతంత్ర్యం తెస్తా"* అని. అట్లాగే ఇప్పుడు 5 నుంచి 15 సంవత్సరాల పిల్లల చేత ***"జీవితచరిత్ర పుస్తకాలు చదివించండి, మంచి మార్పు గ్రహించండి"*** అనేదే ఇప్పటి నా నినాదం.

అమాయకత్వం, అసూయ

అమాయకత్వం నుంచి వచ్చేదే అసూయ అనే జాడ్యం. ఇది పుట్టుకతో వచ్చేది కాదు. అసూయతో కూడిన ఆలోచనలు చిన్నతనం నుంచే చుట్టు ముడతాయి. ఇవి ముఖ్యంగా తల్లిదండ్రులు, ఇరుగు పొరుగు నుంచి సంక్రమించేవే. తమను ఇతరులతో పోల్చుకుంటూ ఈర్ష్య పడటం దీని లక్షణం. సరైన వయస్సులో అట్లాంటి ఆలోచనలని సరిదిద్దకపోతే, అసూయ ఈర్ష్యగా మారి పిల్లల శక్తి సామర్థ్యాలను హరిస్తుంది.

లక్ష్యసాధన

పిల్లల్లో ఒక లక్ష్యం ఉండాలి. అట్లా వుంటేనే కదా అది ఎట్లా సాధించవచ్చో ఆలోచించేది. సమస్య వున్న చోటే నేతృత్వానికి చోటు, అవకాశం అని జగమెరిగిన సత్యం. సమస్య అనే పేరుతో ఉదాసీనత, సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించడం జరుగుతుంది. అయితే సమస్యలని ఎదుర్కొన్నప్పుడే వ్యక్తిత్వం బయటికి వచ్చేది. భవిష్యత్‌కి బాట ఏర్పాటయ్యేది. ఈ విషయాన్ని ఆలోచించని పిల్లలకి హైస్కూలు నుంచి వెళ్లే ముందు కొంతఅవగాహన వుండాలి. ఏదో ఒక లక్ష్యాన్ని నిర్ణయించు కోవటంతోనేఆలోచనలు వస్తాయి. అది జీవితలక్ష్యం కానవసరంలేదు. హైస్కూలు వరకు ఒక లక్ష్యం, ఆ తర్వాత లక్ష్యం వేరుగా వుండటం సహజం కూడా. లక్ష్యాలలో స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు ఉంటాయి.



ప్రోత్సాహానికి అవధులు లేవు

చాలా మంది స్కూలు పిల్లలని తమ లక్ష్యం ఏమిటి అని అడిగితే పోలీస్ ఆఫీసరు, ఇంజినీరు అనే ఎక్కువ మంది సమాధానం.

కారణం వ్యాపారి ఉపాధ్యాయుడు అనో, మరేదో ఫలానా కావాలను కుంటున్నాను అని చెప్ప గలవారు ఒకళ్ళో ఇద్దరో, అంతే. ఏఏ అవకాశాలు వుంటాయి అనే విషయంలో 30 సంవత్సరాల కిందటికీ ఇప్పటికి తేడా కనబడలేదు. ప్రస్తుత అవకాశాల విషయంలో కొంత అవగాహన వున్నవాళ్లు భవిష్యత్తు ను దర్శించుకోగలుగుతారు. ఇప్పుడు మారుతున్న ప్రపంచంలో, కొత్తకొత్త అవకాశాలు ఎన్నో మీ చుట్టూ ఎదురు చూస్తుంటాయి.

ఆశించకుండా జీవించడం సాధ్యమా?

`కష్టం` ప్రస్తుతం ఇంకా. అందులోనే ఉంది విశేషత. విజ్ఞత, వ్యక్తిత్వం. అయితే స్కూల్ నుంచి దీని ఉద్దేశం కొంత అర్థమైనా, అవక పోయినా తల్లిదండ్రులు గ్రామంలో ఇతరుల దగ్గర నుంచో, పుస్తకాల్లో వ్యక్తుల గురించి చదివే ప్రయత్నం చేయాలి. నేను మా నాన్న నుంచి తెలుసుకున్నా. అయితే నాకు అర్థం అవటానికి చాలా యేళ్లు పట్టింది.

భవిష్యత్‌ని గురించేకాక, ప్రకృతి గురించి, ఇతరులని గురించి కూడా ఆలోచన వుండాలి. ఆశయం ఏదీ లేకుండా జీవించటం ఏమిటో అర్థం కాకపోయినా తెలుస్తుంది. భగవత్ గీతపేరుతో చెప్పే అనేక బోధనల వుద్దేశ్యం అదేనని తెలుసుకోవటానికి యేళ్లు పడుతుంది. ఆలోచనేరాదు కూడా. వయస్సు దాటిపోయిన తరువాత వచ్చినా ఫలితం తక్కువ కదా!

ప్రయత్నించటం నుంచే ఈ ఆలోచన, ఆచరణ సాధ్యం. ఎవరికి వారు తెలుసుకోవడంలోనే వుంది గొప్పతనం అని మెచ్చుకోవటం అని కూడా ఒక మంచి అలవాటు. ప్రయత్నించటం లాగా. అప్పుడే ఆశించకుండా జీవించటం సాధ్యం.

హేతుబద్ధత అలవాటవ్వాలి

ప్రశ్నించటంలోంచి అబ్బేది హేతుబద్ధత. హేతుబద్ధత, దృక్పథం, ఆలోచనా ధోరణి వున్నప్పుడే జీవితం ఒక విశేషతని పొందుతుంది. సామాన్యంగా హేతుబద్ధతని అలవరచుకోటం ఒక ప్రత్యేకత. పదిశాతం మందిలో ఆస్వభావం వచ్చిందంటే అది ఒక కొత్త ఒరవడికి తోడ్పడినట్టే.

పిల్లలకి చిన్నప్పటి నుంచి హేతుబద్ధతని అలవాటు చేయాలి. పిల్లల దృక్పథం, భవిష్యత్‌లో ముడిపడిందని తెలిపే జీవన విధానం కావాలి.

అయితే తల్లిదండ్రులు పిల్లల్లో ప్రోత్సహించేది హేతువాదం కాదు. అది అనుకరణ. చెప్పింది చెప్పినట్లుగా చేయటంలో ప్రతిభ (మెరిట్) ఎట్లా వస్తుంది? ఎట్లా సాధ్యం?చాలామంది అసాధ్యం అనుకునే దాన్ని సాధించటంలోనే వుంది మజా. అదే నాయకత్వానికి కూడా మూలం.

కుతూహలం, అన్వేషణ

తప్పుల నుంచి నేర్చుకోవటం, ప్రకృతి నుంచి నేర్చుకోవడం, నిజమైన జ్ఞానం ఎవరికి వాళ్ళు కోరుకునేది. అదే కావాలి. మీరు మీతోనే పోటీ పడాలి, ఇతరులతో కాదు. పిల్లలు వాళ్ళంతట వాళ్లు ప్రశ్నించుకోవాలి. ఎప్పుటికప్పుడు, చిన్నతనం నుంచే ఇది ఒక అలవాటు కావాలి.

మందలింపుకి, కోప్పడడానికి, తిట్టడానికి ఒకటేనా కాదు. తేడా పెద్దలు, పిల్లలు తెలుసుకోవాలి. అప్పుడే కొన్ని సమస్యలు అసలు తలెత్తవు కూడా.

తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకి మందలింపు ద్వారా మంచి చెడుల గురించి తెలియజేయాలి. అదే హేతుబద్ధత. ఎప్పుటికపుడు మందలింపు అంటే ప్రేమతో మంచిగా సలహా ఇవ్వడం, తప్పును తెలియజేయటం.

చాలామంది ఉపాధ్యాయులు కూడా మందలింపు ద్వారానే పిల్లల్లో మార్పునకు ప్రయత్నిస్తారు. అయితే ఈ మధ్య మందలింపు వలన ఉపయోగం లేదనే భావనలో వున్నారు. ఆలోచించాలి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ఆలోచించాలి.

బాలోత్సవం, మంచి అవకాశం

పిల్లల్లో ఉన్న శక్తి సామర్థ్యాలు, ఆలోచనల ధోరణులను తీర్చి దిద్దడానికి ఆటలు, పాటలు, సంగీతం, నాటకం, చిత్రలేఖనం, వినోదం, వ్యక్తిత్వ పోటీలు, ఏకపాత్రాభినయం, కథారచన, పెయింటింగ్ లాంటి కళల ప్రదర్శన ద్వారా కలగజేయవచ్చు అనే విషయాన్ని డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు కొత్తగూడెంలో బాలోత్సవం ద్వారా మూడు దశాబ్దాలనాడే గుర్తు చేశారు. ఈ మధ్యకాలంలో చాలాచోట్ల బాలోత్సవం పేర రెండు, మూడు రోజులు జరిగే కార్యక్రమం. వేరు వేరు ప్రాంతాల్లో ఉన్న పిల్లల్ని వాళ్ళ ఇష్టమైన కళా ప్రదర్శన చేయడానికి అవకాశం కలగజేసే కార్యక్రమం. ఈ కార్యక్రమంలో ఎవ్వరైనా పిల్లలు పాల్గొనవచ్చు, వచ్చి చూసి, ఆనందించవచ్చు, తల్లిదండ్రులు పిల్లల ప్రతిభని చూడవచ్చు. ఈ బాలోత్సవానికి వేరువేరు రంగాల్లోని ప్రఖ్యాత వ్యక్తులను అతిథులుగా, బహుమతి ప్రదానానికి ఆహ్వానించడం జరుగుతుంది. వాళ్ల సందేశం వినటమే గాక వాళ్లతో పిల్లలు మాట్లాడే అవకాశం ఉంటుంది. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో ఒకసారి జరిగే ఈ బాలోత్సవాలు కొత్తగూడెంలో, మంగళగిరి, విజయవాడ, కాకినాడ ఇంకా అనేక చోట్ల

ఎంతో మంది పిల్లలతో కొత్త పులకరింపులు కలగజేయడమే గాక కొత్త అవకాశాలకు కారణం అవుతోంది. గుర్తింపుకి దోహదం అయింది. పిల్లలని మేల్కొలిపి ఒక కొత్త ఒరవడిని తీసుకువచ్చింది.



కాకినాడ క్రియా బాలోత్సవ అద్భుత కృషి

మా ఊరి బాలోత్సవానికి జీవితచరిత్రల గ్రంథాలయం నాంది పలక నుంది 2024 లో. చుట్టుపక్కల గ్రామాల పిల్లలకు ఇదొక అవకాశం. ఇటువంటి కార్యక్రమాలకు గ్రామంలోనే కాక చుట్టుపక్కల వేరు వేరు సంస్థలు కూడా పాల్గొనాలి. అప్పుడే ఇది సాధ్యం.




ప్రోత్సాహం అనేక విధాలుగా

మా ఊరిలో యువ సంఘాల పేర్ల మీద సినిమా వాళ్లకో రాజకీయ పార్టీల నాయకుల జన్మదినోత్సవాలకో రాత్రికి రాత్రి గోడపత్రాలు, బ్యానర్లు కనపడతాయి. అట్లాంటి యువ సంఘాలు 3, 4 తెరలు తీస్తాయి. అయితే వాళ్ళు ఏ నిర్దిష్ట కార్యక్రమాన్నీ గ్రామంలో చేపట్టలేదు. వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకోవటమే. గ్రామాల్లో ఉన్న సమస్యలు, సౌకర్యాలను గురించి మాట్లాడినట్లు వినలేదు. ఎంత సేపటికీ రాజకీయపార్టీల, కులాల ప్రభావం ఎక్కువ. గ్రామ దృక్పథానికి, అభివృద్ధిని గురించిన ఆలోచనలు ఉన్నట్లు కనబడదు. ఎవరికి వాళ్లే, ఎక్కువ మంది చదువులు మానేసిన వాళ్లే. కలిసి ఆటపాటలు, ఆలోచించడం చూడలేదు, వినలేదు. మా ఊరిలోనే కాదు అన్ని గ్రామాల్లో పరిస్థితి అదే. అయితే, మా ఊరిలో యువకుల మధ్య తగాదాలు ఉన్నట్లు వినలేదు. ఇది మంచి విషయం. దాదాపు 30 నుంచి 40 మంది యువకులు గ్రామంలో ఏమీ చేయకుండా ఉన్నారంటే ఆలోచించవలసిన విషయం కాదా? యువశక్తి కనబడదు. వాళ్లంతా అప్పుడప్పుడు కలిసి మాట్లాడుకున్నప్పుడే కదా తెలిసేది, ఏదైనా ఆలోచన వచ్చేది.

కనీసం మూడు కార్యక్రమాలు తీసుకోవచ్చు. మొదటిది: మా ఊరిలో సగం మంది మహిళలు చదవలేరంటే నమ్మశక్యంకాని నిజం. వీళ్ళకి వయోజన తరగతుల ద్వారా కనీసం బ్యాంకు, ప్రభుత్వ కాగితాలని చదవగల అవగాహన కలగజేయాలి. రెండవది: చెరువులు, కాలువల పరిశుభ్రత. కనీసం సంవత్సరంలో ఒక్కసారైనా శుభ్రపరచటం. మూడవది. మద్యం అలవాటును అదుపు చేయటం చాలా అవసరం. మద్యం అమ్మే దుకాణం దగ్గర ఆగి గమనిస్తే ఈ సమస్య తీవ్రత ఎంత ఎక్కువో తెలుస్తుంది. యువకులు కలసి కలగజేసుకుంటే, చొరవ తీసుకుంటే అవగాహనతో, సమస్యను అదుపులోకి తీసుకురావచ్చు.

యునిసెఫ్ (UNICEF) గురించి

కొద్దోగొప్పో పిల్లలను గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడానికి మూలకారణం యూనిసెఫ్ (UNICEF) అనే ప్రపంచ సంస్థ. ఇది రాష్ట్రాల్లో, దేశంలో ఆర్థిక సహాయం చేస్తూ, శ్రద్ధ తీసుకుంటుంది. అంగన్ వాడీలు, పౌష్టికాహారం, పిల్లల పెరుగుదల, తల్లుల ఆరోగ్యం విషయాలు, ప్రణాళికల రచన వాళ్ళ ద్వారానే జరుగుతున్నాయి. ఎన్నో యేళ్లుగా యూనిసెఫ్పిల్లల బాగోగుల గురించి శ్రమ పడుతోంది. అయితే ఈ వ్యవస్థ, ప్రణాళికలు విజయం వాటిని అమలుచేసే ప్రభుత్వాల చిత్తశుద్ధి మీదే ఆధారపడి వుంటాయి. ఎన్నో పధకాలు, గ్రామాల్లో స్థితిగతుల గురించి **ఆషా వర్కర్సు** ఒక పద్ధతిగా, క్రమం తప్పకుండా చేస్తున్నారంటే అది సంవత్సరాలుగా యూనిసెఫ్తీసుకున్న శ్రద్ధ వల్లనే.



	HEP-B. - At Birth Dose
6 weeks	OPV-1, PENTAVALENT-1 ROTA-1, FIPV-1, PCV-1
10 weeks	OPV-2, PENTAVALENT-2 ROTA-2
14 weeks	OPV-3, PENTAVALENT-3 ROTA-3, FIPV-2, PCV-2
9 MONTHS	MR-1, Vitamin-A-1 JE-1, BOOSTER-PCV
16-24 MONTHS	MR-2, OPV-BOOSTER DPT 1st BOOSTER, JE-2
5-6 YEARS	DPT 2nd BOOSTER
10 & 16 YEARS	TD
PREGNANT WOMEN	TD-1 Early in Pregnancy TD-2 - 4 weeks After TD-1 TD-BOOSTER: If received 2 TD doses in a pregnancy within the last 3 years

ఆషా వర్కర్సు,
వాళ్ళ కార్యక్రమాలు

పరిశోధనల ద్వారా ఎన్నో విషయాలు ఎప్పటికప్పుడు యూనిసెఫ్పిల్లల ఆరోగ్యం, తల్లులు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు అభివృద్ధి, వాళ్ళ పెరుగుదల కూడా తెలుసుకుంటుంది. అప్పటి నుంచి పిల్లలు 19 వ సం॥ వచ్చే వరకు, అంటే కౌమారదశ దాటేవరకు, ప్రతి సం॥ వాళ్ళకి ఐదారు రకాల టీకాలు (వ్యాక్సినేషన్స్) క్రమం తప్పకుండా ఇస్తుంటారు. ఆషా వర్కర్సు గ్రామాల్లో విస్తరించి ఒక పద్ధతి ప్రకారం పని చేయటానికి కారణం యూనిసెఫ్. మా ఊరిలో సరైన సౌకర్యాలు లేకపోయినా ఆషా వర్కర్సు ఎంతో శ్రద్ధతో పని చేయడం ఆనందం కలిగిస్తుంది.



ఆషా వర్కర్సు, వాళ్ళ కార్యక్రమాలు

ఈ వ్యవస్థ అందరికీ అందుబాటులో వుండటం కొరకు స్వచ్ఛంద సంస్థలకి కూడా కొన్ని బాధ్యతలని అప్పచెప్పి అందరి పిల్లల, తల్లుల బాగోగుల కోసం కృషి చేస్తోంది.

ఇందుకోసం ప్రముఖ సంస్థలు అహ్మదాబాద్‌లోని సేవా (SEWA), ఢిల్లీ లోని సీఎంఎస్ (CMS) లాంటి ఎన్నో సంస్థలను అనుసంధానంతో ఎప్పటికప్పుడు పని చేస్తుంది.

ఈ పిల్లల ఆరోగ్యమే కాక, వాళ్ళ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి సహకరిస్తుంది. అందుకు కావలసిన శిక్షణ (ట్రైనింగ్) కూడా (UNICEF) ఇస్తుంది. అయితే స్థానికంగా సంస్థలు ఈ విషయాలని చర్చించడానికి వుండాలి. (UNICEF) మీద ఎన్ని సం॥లు ఆధారపడతాం.

ఈ సందర్భంగా ఢిల్లీలో దేశప్రభుత్వం ఈ మధ్య (జనవరి 2023)లో కొన్ని సూచనలు చేసింది. మూడో సంవత్సరం నుంచి అంగన్‌వాడీలో ఉండాలని, అయిదు సంవత్సరాల బదులుఆరు సంవత్సరాలప్పుడే స్కూల్లో చేరాలని చెప్పటం జరిగింది. దీని ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం తెలియ చెప్పాలా? 3 నుంచి 6 సంవత్సరాల వాళ్ళకి అంటే అంగన్‌వాడీలో ఎట్లాంటి పుస్తకాలు వద్దని, ఆటలు, పాటలు, కథలు చెప్పటం లాంటివి మాత్రమే అని, అట్లాగే 6 నుంచి 8 సంవత్సరాలు వాళ్ళు కూడా పుస్తకాల మీద ఆధారపడే బోధనకే పరిమితం కాకూడదని చెప్పటం జరిగింది. మంచి ఆలోచనే సరైన సమయంలో ఈ సలహా రాష్ట్రాలకు పంపటం జరిగింది. మరి గ్రామంలో అమలుపరచటం ఎవరి బాధ్యత?

గ్రహించని జాడ్యాలా, మూఢత్వమా ?

మా ఊరు ఒకప్పుడు, 80 సంవత్సరాల కిందట, మూఢనమ్మకాలకి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపిన గ్రామంగా పేరొందింది. అయితే అప్పుడు ఆ మూఢనమ్మకాలు లోకజ్ఞానం, చదువు సంధ్యలు లేక. మరి ఇప్పటి మూఢనమ్మకాలని ఏమనాలి? అప్పుడు ఆ ఉద్యమంఒక జాతిని మేల్కొలిపింది. మరి ఇప్పటి మూఢనమ్మకాలు అవకాశాలను జార విడవటమేగాక, ఒక తరాన్ని తప్పుతోవ పట్టిస్తున్నాయా అనిపిస్తుంది. కొత్త మూఢనమ్మకాలకి కారణం పూర్వీకులు కానే కాదు. ఇప్పటి పిల్లల తల్లిదండ్రులే. చదువుకున్న వాళ్లు, ఎక్కువ మంది, చదువులేని వాళ్ళు, కూలినాలి చేసుకునే వాళ్ళు అనే భేదం లేకుండా అంతా ఒకే విధంగా ఈ కొత్త మూఢనమ్మకాల బాధితులు. అయితే అసలు బాధితులు వాళ్ల పిల్లలు. అంటే ఒక తరం. ఊహించండి. ఈ మూఢనమ్మకం ఏంటి అనేది. అసలు వీళ్లందరికీ ఈ మూఢనమ్మకాలు వాళ్ల పిల్లల భవిష్యత్‌ని, వాళ్ల తెలివి తేటల్ని వృధా చేస్తున్నాయి అని, వాళ్ల ప్రతి పనిని నిర్వీర్యం చేస్తున్నాయి అని అవగాహన ఉన్నట్లు కనబడటం లేదనిమా ఊరిలో ఒక సం॥లోనే కాదు, కొంతకాలంగా నేను గ్రహించిన విషయం. అయితే ఇది మా ఊరికి సంబంధించినదే కాదు, అన్నిచోట్ల ప్రస్తుతం విస్తరిస్తున్నది ఈ మూఢ నమ్మకం. ఏమిటి ఈ మూఢనమ్మకం? ఎంతసేపూ **"చెప్పిన మాట వింటున్నారా?"** లేదా అనేది మూలం. అయితే పిల్లల ఆలోచనలో మార్పు ఎట్లా వస్తుంది?



రెండు సంవత్సరాల నుంచే బ్రష్షు, పేస్టు

పిల్లల పెంపకంలో పెద్దల ధోరణి అధ్వానంగా వుందా అనిపించక తప్పదు. అది కొంతమంది విషయంలో ప్రేమ, వాత్సల్యం, మరికొంత మంది విషయంలో మానసిక అనారోగ్యమో? అజ్ఞానమో అనిపిస్తుంది.

చాలా మంది విషయంలో అది అమాయకత్వం అని తెలిసేసరికి పరిస్థితి చేయిజారిపోతుంది. చాలామంది దానిని గ్రహించలేకపోవటం వల్ల సరి దిద్దుకోలేకపోతున్నారు. కొన్ని ముఖ్య విషయాలని మాత్రమే ఇక్కడ చర్చించడం జరిగింది.

గ్రామంలో ఎక్కువమంది ఉపాధ్యాయులు, సచివాలయంలో పనిచేసే వాళ్లు, ఆరోగ్యసిబ్బంది, డాక్టర్లు అంతా ఊరు బయట నుంచి వచ్చేవాళ్లే. వాళ్లకి గ్రామ పిల్లల గురించి, వాళ్ల సమస్యల గురించి ఎంత అవగాహన, స్పృహ ఉంటుందనుకోవచ్చు. గ్రామంలో వున్నవారికే ఆ దృష్టి లేనప్పుడు బయట నుంచి వచ్చే డాక్టర్లు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులకు, ప్రతినిధులకు ఏమాత్రం వుంటుంది.

మరీ ముఖ్యంగా గ్రామపంచాయతీకి, ఎన్నికైన పాలకవర్గానికి పిల్లలని గురించి ఏ మాత్రం సమాచారం గాని, ఆలోచన లేవు.



బస్సు కోసమా, భవిష్యత్ కోసమా?

పన్నెండు విషయాల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇవి ఉదాహరణలు మాత్రమే.

1. **"అసలు చదువు అంటే"** అనే విషయాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. ఇప్పుడు 2023 ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు చదువే చదువు. సంవత్సరం, సంవత్సరం పాస్ అవటం ఆ తర్వాత గ్రేడులు, ర్యాంకుల కోసం పాకులాడటం అంతే అన్నట్టు. విద్య, వినియోగం భవిష్యత్ అనే విషయాల మీద ఈ మధ్య 4, 5 నివేదికలు వచ్చాయి. అవి ASER, NCERT, NASCOM, GLOBAL agencies, పరిశోధన ఫలితాలలో వివిధవిషయాలు తెలియజేశాయి. ఏమిటంటే ప్రస్తుత చదువులు పెద్దగా ఉపయోగ పడడం లేదు. 40 నుంచి 80 శాతం పాస్ అయిన డిగ్రీదారులు ఉద్యోగాలకి పనికిరారు. వాళ్ల భవిష్యత్ ఏమంత చెప్పుకోదగినదిగా ఉండదు. అయినా మన ఆలోచనల్లోగాని, ప్రభుత్వ పద్ధతిలోగాని మార్పు కనపడదు.



తల్లిదండ్రులకి అసలు ఈ విషయాలు తెలిసినట్టే లేదు, పట్టినట్లుగా లేదు. ఇంకా వేరు పరిశోధనలు తెలియజేసినవి ఏమిటంటే చదువుతో పాటు ఆటా, పాటా ఆనందించి, చుట్టుపక్కల ప్రకృతి పరిస్థితులు తెలుసుకోవడం వల్ల చదువు బాగా రావడమేగాక జీవితంలో బాగా రాణిస్తారని ఎన్నో ఉదాహరణలతో తెలియజేశాయి. అయినా తల్లిదండ్రులకి చదువేచదువే.

"మంచి చదువు" అంటే ఏమిటో తెలియకుండా ఎన్నో అపోహలు, ఊహా గానాలు, అనుకరణల్లో తల్లిదండ్రులు సతమతమై పిల్లలని వారి ప్రపంచాన్ని దూరం చేస్తున్నారా? అవకాశాలని పోగొట్టు కుంటున్నారా అనిపించక తప్పదు. పిల్లలని, ప్రాథమిక విద్యని రాజకీయాలకి దూరంగా పెట్టలేమా? విద్యా వ్యవస్థ ప్రస్తుత పరిస్థితికి చాలా వరకు రాజకీయ నాయకుల దృక్పథం, ఆలోచనలే కారణం. గ్రామంలో పరిస్థితి చూస్తే ఈ విషయం గ్రహించగలరు.

2. స్థానిక పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు వున్నా, ఉచితంగా అందుతున్నా దూరంగా వున్న స్కూళ్లకి డబ్బులు కట్టి మరీ పిల్లలని పంపిస్తున్నారు. అది ఒక గొప్ప విషయంలా భావించడం జరుగుతోంది. స్థానిక స్కూల్లో **"సరిగ్గా చెప్పడం"** లేదనే భావంతో అయితే, ఆ స్థానిక బడిలోబాగా చెప్పటానికి గ్రామస్తులు, తల్లిదండ్రులే కృషి చేయాలి కదా? ఎప్పుడైనా తెలుసుకుని, సమాచారం తీసుకుని పరిస్థితులు సరిచేయడానికి

ప్రయత్నం చేశారా? మరి తల్లిదండ్రులలో ఒక కమిటీ ఉందిగా. ఎందుకు శ్రద్ధ తీసుకుని సరి చేసుకోలేకపోతున్నారు?

పిల్లలు దూరం వెళ్లటం వల్ల రోజూ రెండు గంటల దాకా వెళ్లటానికి, రావటానికి ఖర్చు కాకుండా పిల్లల మీద ఒత్తిడి, కొత్త స్నేహాలు, అలవాట్లు సంగతి పట్టించుకున్నట్లు కనబడదు. రోజూ 5-6 బస్సులు ఉయ్యూరు నుంచి, గుడివాడ నుంచివచ్చి 25-40 మంది పిల్లలని ఉదయం ఏడు గంటలకే వచ్చి సాయంత్రం 6. 30 కి దించటానికి వస్తాయి.

3. 2023లో కూడా ఒక (మూఢ) నమ్మకం ఏమంటే డబ్బులు పెడితేనే పిల్లలకి మంచి చదువు అబ్బుతుందని. తల్లిదండ్రుల బాధ్యత అదే అనే భావన కూడా. మరి అదేగా ఇప్పుడు ఎక్కువ జరిగేది. **"ఇంగ్లీషు కాన్వెంట్"** లో చదివే పిల్లలను కూడా సాయంత్రం తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ స్థానిక **"ట్యూషన్"** కి పంపటం, కొంతమంది ఆ విధంగా సంతృప్తి చెందుతున్నారు. స్థానిక స్కూల్లో చదివేవారిని పొద్దున, సాయంత్రం ట్యూషన్‌కి పంపటం. *"ఇంటి దగ్గర చదవరు, అక్కడ చదువుతారు"* అనే భావనతో, పిల్లలని ఊపిరాడకుండా పరిగెత్తిస్తున్నారు. అది ఏదైనా కొత్తవిలువల కోసం, విజ్ఞానం (నాలెడ్జ్) కోసం కాదు. మంచి మార్కులతో పరీక్ష పాస్ కావటం కోసం అనే భ్రమలో. ఇంటి దగ్గర చదివితే మేము వాళ్ల చదువులో సహాయపడలేము కనక మళ్లీ ప్రైవేటుకి అనేది తల్లిదండ్రుల ఆలోచన అనిపిస్తుంది.

4. ఇంగ్లీషు కాన్వెంట్‌లో చదివే వాళ్లలోనే కాదు స్థానిక స్కూల్లో చదివే కొంత మంది పిల్లలకి **"తెలుగురాదు."** అని చెప్పడం ఒక **"గొప్పగా"** భావించడమేగాక చిన్న తెలుగు వాక్యాలు కూడా చదవలేని దుస్థితి.

అయితే తల్లిదండ్రులు ఈ విషయాలని పట్టించుకున్నట్టే కనబడదు. ఇంగ్లీషు చదవాలి, నేర్చుకోవాలి, రావాలి అనే ఆలోచన. సమస్య అది కాదు.

తెలుగు చదవడం కూడా రాకపోతే రేపుఎక్కడ, ఎట్లా ఏ ఉద్యోగమైనా, సొంతవ్యాపారమైనా ఎట్లా చేయగలరు అనే ధ్యాస ఉన్నట్లు లేదు. మరి దీనికి బాధ్యులు ఎవరు? ఆలోచించాల్సిన విషయం కాదా. తెలుగుతోపాటు ఇంగ్లీషు వస్తేనే కదా భవిష్యత్.



5. పిల్లలు తల్లిదండ్రులతో, కుటుంబంతో కొంత సమయమైనా గడపాలి. కలిసి మెలిసి భోజనం చేయటంలో, మాట్లాడుకోవడం, ఇంటిలో ఆటలు, పాటలు లాంటివి జరిగినప్పుడే సంబంధాలు, విలువలు, విచక్షణా భావాలు ఏర్పడతాయి. ఇది గ్రహించినట్లు కనబడదు. ఇప్పుడు చాలా మంది విషయంలో పొద్దున నుంచి రాత్రి ఏడు, ఎనిమిది గంటల వరకూ చదువే చదువు. లేవగానే ప్రయివేటు, స్కూలు, మళ్లీ ప్రయివేటు అట్లా బిడ్డ తండ్రిని చూసేది కూడా వారంలోరెండు మూడుసార్లే.



ఇదే స్కూలు ప్లే గ్రౌండ్ పరిస్థితి

6. స్కూలుకి వెళ్లే ముందు పిల్లలకి తల్లిదండ్రులు రూపాయి నుంచి పది రూపాయల దాకా ఇవ్వడం జరుగుతోంది. ఇది ఆర్థిక స్తోమతకు సంబంధం లేకుండా అన్ని వర్గాలు చేస్తున్న పని. ఈ అలవాటును ఏ విధంగా చూడాలి? ఈ డబ్బు ఎందుకు ఇస్తున్నట్లు? పిల్లలు దేనికి ఉపయోగిస్తున్నారు. ఎవ్వరైనా దాచుకుంటున్నారా? ఎట్లాంటివి కొంటున్నారో తల్లిదండ్రులు ఎప్పుడైనా తెలుసుకుంటున్నారా? దాఖలాలు లేవు. ఈ డబ్బుని ఎక్కువ మంది పిల్లలు స్కూలు దగ్గర వున్న షాపులో లాలీపప్, చూయింగ్‌గమ్, క్యాండీలు లాంటివి కొనటానికి వినియోగిస్తూ వున్నారు. పిల్లల్లో కొత్త కొత్త అలవాట్లు, హానికరమైనవి కూడా ఎప్పుడో మొదలయ్యాయి. అట్లాంటి అలవాట్లు మార్చటానికి తల్లిదండ్రులు ఏమైనా చేశారా? స్కూలు ఉపాధ్యాయులు తల్లిదండ్రులకి భయపడి మాట్లాడ కుండా చూసీ, చూడనట్లుపోవడం జరుగుతోంది. రూపాయి ఇచ్చే బదులు ఏదైనా తినేవి, ఇంట్లో చేసినవి, ఏదైనా వస్తువు (కలమో, స్కేలో, పుస్తకమో) కొనుక్కో వచ్చుగా? లేదా దాచుకుని నెలనెలా వస్తువు కొనుక్కోవచ్చు. పూర్వంలాగా కిడ్డీ బ్యాంకు వాడుతున్నట్టు కనబడదు.

7. స్కూల్లో శ్రమదానంలో ఒకప్పుడు పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొనే వాళ్లు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించేవారు. కొన్ని మార్కులు శ్రమ దానానికి వేసేవారు. అయితే ఇప్పుడు సామాజిక స్పృహ, సేవా భావం ఎంత త్వరగా వస్తే వ్యక్తిత్వానికి అంత మంచిది. కానీ తల్లిదండ్రులు, స్కూల్లో పిల్లలకు ఏదో ఒక శ్రమదానం కార్యక్రమం పెడితే అందుకు సహకరించకపోగా, సహించలేకపోతున్నారు. అంటే ఏమి నేర్పుతున్నట్లు? దాని ప్రభావం ఏమిటి? వాళ్లకి అవగాహన లేదు. ఇంట్లో నీళ్ళు పట్టటం పిల్లల బాధ్యత కాదా? మరి అందుకు డబ్బులు ఎందుకు అలవాటు చేశారు. బంగారు బాతు కథ గుర్తుకు వస్తుంది నాకు.

గ్రామంలో కొంతమంది పిల్లల పెంపకం విషయంలో గెలుపు గుఱ్రాల ధోరణి కనబడుతుంది.



ఈ వయస్సు ఎండమావి కాకూడదు

8. మా ఊరి స్కూల్లో ఆటల వ్యవస్థ బాగా లేదు. మంచి డ్రిల్లు మాస్టారు వున్నా, ఎంతో చొరవ తీసుకున్నా ఉపయోగపడటం లేదు. ఎన్నో సం॥ ల నుంచి పిల్లల ఆటస్థలం (ప్లేగ్రౌండ్) దూరంగా వుండడం, అదీ సరైన రీతిలో లేకపోవడంతో పాటు అది కొంత ఆక్రమణలో వుండడటమే కారణాలు. పిల్లల శ్రమదానం ద్వారా ప్లేగ్రౌండ్‌ని సరిచేయవచ్చు. అయితే ఎందుకు సిద్ధంగా లేరు. ఎవ్వరైనా దాతకోసం ఎదురు చూస్తున్నాను. కొంత ప్రయత్నించాను కూడా. స్థానికుల్లో పరిష్కారం చేయాలనే దృష్టి లేనే లేదు.



మూలనపడుతున్న అంగన్ వాడీ

9. పిల్లల **"గోల", "అల్లరి"** కనబడుతుందిగాని దాని వెనుక వున్న ఉత్సాహం, స్వచ్ఛందంగా వచ్చే ఆలోచనలు, ఆప్యాయత, స్నేహశీలత తల్లిదండ్రులు గ్రహించలేకపోతున్నారు. తల్లిదండ్రులే కాదు కొంతమంది గురువులు కూడా. వాళ్లకి పిల్లలని ఏదో ఒక కారణంతో నిరుత్సాహ పరచడం తేలిక. గోల, అల్లరి కాదు ఆనందం అనీ అందులోంచే ప్రోత్సాహం వస్తుందని గ్రహించాలి. గ్రంథాలయాలు కూడా అట్లాంటి గోల అల్లరి ఆలోచనలకి నాంది కావాలి. కొత్త ఉత్సాహానికి, ఆలోచనలకి శుభసూచకం కావాలి.

10. చెప్పిన మాట వినటంలోనే పిల్లల విజ్ఞత, వినయం వుంటుందను కోవడం భ్రమ. తల్లిదండ్రులు చెప్పిన మాట ఎందుకు వినాలో తెలియజేసే విధంగా మాట్లాడటమే కాక వాళ్ళ ప్రవర్తనా తీరు కూడా అదే తీరులో వుండాలి. అంటే పిల్లలకి నేర్పాల్సింది, వాళ్ళు తెలుసుకోవలసింది, కారణాలు, ఉద్దేశ్యాలు, ఆధారాలే గదా... గుడ్డెద్దు చేలో పడినట్లు రీతిలో చెప్పింది చేయటం కాదు. అయితే తల్లిదండ్రులను వ్యతిరేకమించమని కాదు. తల్లిదండ్రులే అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలి.



అమ్మలే ముందు పట్టించుకునేది...

11. చిన్నప్పటి నుంచే ప్రశ్నించే ధోరణి పిల్లలకు అలవాటు చేయాలి. అందుకు అవకాశాలు వీలయినంత ఎక్కువగా కల్పించాలి. ప్రస్తుతం జరిగేది పూర్తిగా విరుద్ధం. ఇళ్లలోనే కాదు, స్కూలు, తరగతిలో కూడా. ముఖ్యంగా మగపిల్లలు పూర్తిగా వెనుకబడి పోయారు. ఆడపిల్లలు చదువులో ముందుండటమే గాక, నల్గురిలో కలిసిమెలిగే విధానం, ప్రశ్నలు అడిగే విధానం, ఆలోచనలో మగపిల్లల కన్నా ఆడపిల్లలు మెరుగ్గా ఉన్నారని, మా ఊరిలోనే కాదు, చాలా గ్రామాల్లో, స్కూళ్లలో గమనించటం జరిగింది. దీనివల్ల మగపిల్లల్లో సామాజిక దృక్పథమేగాక వ్యక్తపరిచే తీరు తగ్గిపోతుందని గ్రహించవచ్చు. రాయటంలో, మాట్లాడటంలో, అడగటంలోనేకాక వినటం, వివేకం, వినయాలలో ఆడ పిల్లలే ముందు ఉన్నారు. (అయితే స్కూలు నుంచి వెళ్లిపోయాక, పెళ్లి తర్వాత పరిస్థితి వేరు. ఈ విషయాన్ని గురించి నేను వేరే పుస్తకంలో వివరంగా ప్రస్తావించాను.)



స్కూల్ బ్యాగ్ బరువు –
అంత అవసరమా

అసలు గ్రామంలో పిల్లల కోసం ఏమైనా సదుపాయాలు వున్నయ్యా అని చూస్తే ఆశ్చర్యం తప్పదు. ఎట్లాంటి ఆలోచన కూడా వున్నట్లు లేదు. ఇది మా ఊరి పరిస్థితే కాదు. చుట్టుపక్కల ఏ గ్రామంలో కనీసం ఉదాహరణలు కూడా లేవు. హైస్కూలులో, ఎలిమెంటరీ స్కూలులో ఎట్లాంటి ఏర్పాట్లు లేవు. నా చిన్నప్పుడు రామాలయం, శివాలయం రెండూ పిల్లలు ఆడుకునే ముఖ్యమైన చోట్లు. ఇప్పుడు అవి ఏవైనా పూజా కార్యక్రమాలు, పండగలప్పుడుగాక ఎప్పుడూ తాళంవేసి వుంటాయి. ఈ రెండు దేవాలయాల మధ్య స్థలం కొంత బ్యాడ్ మెంటెన్, కబడ్డీకి కూడా ఉపయోగపడేది.




సాంస్కృతిక కార్యక్రమాలే భవిష్యత్‌కి బాట...

ఇప్పుడు ఆ స్థలాలు పిల్లలకు అందుబాటులో లేవు. అప్పుడు లైబ్రరీ కూడా సమావేశానికి, మాటా మంతీకి ఉపయోగపడేది. ఇప్పుడు అవి కూడా లేవు. ఎవరి ఇంట్లో వాళ్లు, అదీ టెలివిజన్ ముందు తప్పదన్నట్లు. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా పిల్లలు వెళ్లి కూర్చుని మాట్లాడుకునే చోటు లేదు. ఇళ్ల అరుగులన్నీ ఎప్పుడూపెద్దల ఆధీనంలో వుంటాయి. ఆడుకోవటానికి చోటే లేదు. బజారే వాళ్లకి ఆటస్థలం. ఇక పాటల ప్రసక్తే లేదు.



డాక్టర్. ప్రసాద్ తోటకూర, తానా పూర్వాధ్యక్షులు

"పిల్లలు పిడుగులు సిసింద్రీలే" అనటానికి సాక్షీభూతం ఈ పుస్తకం. భాస్కరరావుగారు అకుంఠిత దీక్షతో గ్రామాల అంధకారాన్ని పోగొట్టాలని కంకణం కట్టుకున్న భాస్కరుడు. ముదునూరు కేంద్రంగా సాగినవారి పరిశోధనలో వెలువడిన అంశాలు ఎంతగానో ఆలోచింపజేస్తాయి. గ్రామాల్లో పిల్లలు భావిపౌరులు **"కావాలిగా!"** అనటంలో కాస్త నైరాశ్యం, అందులోనే **'కావాలి'** అనే తపన, **'ఎలా అవుతారు?'** అనే ప్రశ్న. పిల్లల నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు అన్నారు. ఈ పుస్తకం కేవలం పిల్లలకే కాదు, పెద్దలకు, గురువులకు, సమాజానికి మొత్తంగా విశ్వమానవ కళ్యాణంలో చక్కని బోధనామృత ప్రేరణాత్మక గీత...



రచయిత: డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు

ముదునూరులో జన్మించి, ఇండియాలో రెండు, అమెరికాలో రెండు విశ్వవిద్యాలయాలలో చదివి జ్ఞానశిఖామణి, బహుగ్రంథకర్త, సేవాతత్పరులుగా ఎదిగారు. ప్రభుత్వాలు, మంత్రిత్వశాఖలకు సలహాదారులుగా సేవలందించారు. దేశ సమాచార రంగంలో 'ప్రజావాణి' విషయంలో ప్రభుత్వ పనితీరు పరిశీలనలో ఆద్యులు, ప్రముఖులు. స్వగ్రామంలో ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 1990లో **"బ్రెడ్"** సంస్థను స్థాపించారు. వేలాది విద్యార్థుల జ్ఞానవికాసానికి 1500 పైగా పాఠశాలల గ్రంథాలయాలను, సి.యం.ఎస్. లాంటి ప్రముఖ సంస్థలను స్థాపించారు.

ISBN : 978 - 93 - 100 - 0214 - 0